# బోల్షివిక్


సీ.పీ.ఐ (మావోయిస్టు) ఏ.ఓ.బీ సమాచార పత్రిక

సంపుటి: ౨

సంచిక: 1

జులై 2020-జూన్ 2021

## పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవాల సందర్భంగా ప్రత్యేక సంచిక



1. నయాగఢ్ రెయిడ్



2. నయాగఢ్ రెయిడ్



3. తెల్లరాయి అంబుష్



4. బలిమెల అంబుష్

# విషయ సూచిక


పీ.ఎల్.జీ.ఏ సందేశం - 3





ఇంటర్వ్యూ - 9


విశాఖ స్టీల్ ప్లాంట్ - 13





మావో మిలటరీ వ్యాసం - 18

సిద్ధాంత వ్యాసం - 28



ఎస్.ఐ.బీ - 28

పత్రికా ప్రకటన - 31






అమరుల జీవిత చరిత్ర - 37

పోరాట ప్రవంతి - 48




# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి. పి. ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైనా, పి. ఎల్. జి. ఎ. పైనా, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుంచి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. జులై 2020 నుంచి జూన్ 2021 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పీ. ఎల్. జీ. ఏ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఏ. ఓ. బీలో కామ్రేడ్ అశోక్ (సందె గంగన్న, డీ. వీ. సీ. ఎమ్), కామ్రేడ్ రణదేవ్ (ముఖేష్, డీ. వీ. సీ. ఎమ్), కామ్రేడ్ మల్లాల్ (ఏ. సీ. ఎమ్), కామ్రేడ్ మాస (కిషోర్–పీ. పీ. సీ. ఎమ్, సెక్షన్ కమాండర్), కామ్రేడ్ అంజన్న (ఏ. సీ. ఎమ్), కామ్రేడ్ పాయికే (పీ. ఎమ్), కామ్రేడ్ లలిత (పీ. ఎమ్), కామ్రేడ్ దయ (పి. ఎమ్), కామ్రేడ్ శాంతి (పీ. ఎమ్), కామ్రేడ్ చైతే (పీ. ఎమ్)లతోపాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్. జడ్. సీ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవాలను 2020 డిసెంబర్ నుంచి 2021 డిసెంబర్ వరకు విప్లవోత్సాహంతో ఘనంగా జరపండి!

# దేశవ్యాపితంగా పాలకవర్గాలు చేపట్టిన విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్ 'సమాధాన్' దాడిని ఓడించే లక్ష్యంతో ఏ.ఓ.బీ వ్యాపితంగా గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

భారతదేశంలో శిథిలావస్థకు చేరిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి పీడిత ప్రజలను విముక్తి చేసే లక్ష్యంతో, 2 డిసెంబర్, 2000 సంవత్సరంలో ఎమ్.ఎల్.ఎమ్ సిద్ధాంతం వెలుగులో, మన పార్టీ నాయకత్వాన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ) ఏర్పడిన విషయం మనందరికి సుపరిచితమే. మన పార్టీ వ్యవస్థాపకులు, ఉపాధ్యాయులు, భారత విప్లవోద్యమ నిర్మాతలు అమరులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్‌చటర్జీల దిశానిర్దేశంతో, అమరులు కామ్రేడ్ శ్యాం, మహేశ్, మురళిల ప్రేరణతో, వేలాది అమరుల స్ఫూర్తితో ఆ రోజు మన ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ) ఏర్పడింది. రానున్న డిసెంబర్ 2 నాటికి మన వీర పీ.ఎల్.జీ.ఏ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తి కావస్తున్నది. ఈ సందర్భంగా యావత్ పార్టీ కమిటీలకూ, కమాండ్‌లకూ, పార్టీ సభ్యులకూ, పీ.ఎల్.జీ.ఏ యోధులకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాలకూ, ప్రజాసంఘాల నాయకులకూ, కార్యకర్తలకూ, మిలీషియా సభ్యులకూ, ఏ.ఓ.బీ విప్లవ ప్రజానీకానికి ఏ.ఓ.బీ స్పెషల్‌జోనల్ మిలటరీ కమీషన్ తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నది.

గత రెండు దశాబ్దాల కాలంలో భారతదేశ వ్యాప్తంగా విప్లవాన్ని విజయవంతం చేసే క్రమంలో వేలాది మంది భూమి పుత్రికలు, పుత్రులు తమ నులివెచ్చని రక్తాన్ని ధారపోసారు. నిర్దిష్టంగా ఏ.ఓ.బీ



జోన్‌వ్యాప్తంగా ఈ 20 సంవత్సరాల కాలంలో 200 మందికి పైగా కామ్రేడ్స్ ఈ నేలతల్లి విముక్తి కోసం తమ ప్రాణాలను త్యాగం చేసారు. వీరిలో కేంద్రకమిటీ సభ్యుడు వడ్కాపూర్ చంద్రమౌళి (దేవన్న, బాలకృష్ణ), స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ మస్తాన్‌రావు, కౌముది, గౌతం, రణదేవ్, ప్రసాద్, దయ, కొమ్ము, మహితతోపాటు, అనేక మంది డీ.వీ.సీ, ఏ.సీ, పీ.పీ.సీ, పార్టీ సభ్యులు, దళ సభ్యులు, విప్లవ ప్రజా నిర్మాణాల నేతలు, సభ్యులు, విప్లవ ప్రజానీకం ఉన్నారు. వీరంతా ఈ దేశ పీడిత ప్రజల విముక్తి కోసం, అభివృద్ధి నిరోధక, విప్లవ ప్రతీఘాతుక నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ, దేశంలో అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ, ఆ తదుపరి సోషలిజాన్నీ, కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఈ క్రమంలో అనేక మంది కామ్రేడ్స్ శతృసాయుధ బలగాల, విప్లవ ప్రతీఘాతుక సాయుధ ముఠాల దాడులను విరోచితంగా తిప్పి కొడుతూ, వీరమరణం పొందారు. మరికొందరు కామ్రేడ్స్ శతృవు అమలు చేసిన కుట్రపూరిత, మోసపూరిత, పాశవిక బూటకపు ఎన్‌కౌంటర్‌లలో ఏ మాత్రం చలించక పార్టీ రహస్యాలను కంటికి రెప్పలా కాపాడి శతృవును సవాలు చేస్తూ అమరులై, గొప్ప త్యాగపూరిత సాంప్రదాయాలను నెలకొల్పారు. ఇంకొందరు తీవ్రమైన అనారోగ్యాలను ఎదుర్కొంటూ, శతృ తీవ్ర నిర్బంధంలో వైద్యం అందకపోయినా, చివరి ఊపిరి వదిలేంతవరకూ, ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా, చేతనైన పనులను చేస్తూ పార్టీ, పీ.ఎల్.జీ.ఏ క్యాడర్ల మధ్య, ప్రజలమధ్య ఉత్సాహంగా ఉంటూ చావును గేలిచేసారు. ఈ ప్రజావీరులు మృత్యుంజయులు. వారి త్యాగం మన ఆలోచనలనూ, సంకల్పాన్ని మరింత దృఢ పరుస్తుంది. మనం ఎల్లప్పుడూ ఈ ప్రజావీరులపట్ల, అమరులపట్ల అత్యంత గౌరవాన్ని ప్రదర్శించాలి. వారు అందించిన స్ఫూర్తితో, వారు వదిలి వెళ్ళిన కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి, వారి ఆశయాలనూ, ఆదర్శాలను ఎత్తిపట్టాలి. వాళ్ళ పోరాటం, త్యాగం, విజయాలు మనకు నిరంతరం ప్రేరణ, ఉత్తేజాన్నిస్తాయి. వాళ్ళు కన్న కలల్ని సాకారం చేసేందుకు చివరి రక్తపుబొట్టు ఉన్నంతవరకు పోరాడుదామని ఈ సందర్భంగా మరోసారి శపథం చేద్దాం.

ఇదే క్రమంలో శతృ ఫాసిస్టు దాడులను తిప్పికొడుతూ ఎంతో మంది పార్టీ, పీ.ఎల్.జీ.ఏ కార్యకర్తలతోపాటు, విప్లవ సానుభూతిపరులు, సాధారణ ప్రజలు అక్రమ అరెస్టులపాలై జైళ్ళలో బంధించబడి, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని విప్లవ స్ఫూర్తితో అధిగమిస్తూ, జైలు అధికారుల నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ అనేక పోరాటాలు చేపట్టి, జైళ్ళనే పోరాట కేంద్రాలుగా మలిచి యావత్ పీడిత ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఆ కామ్రేడ్స్‌కు ఏ.ఓ.బీ ఎస్.ఎమ్.సీ విప్లవాభినందనలు తెలియజేస్తున్నది. వారు జైళ్ళ నుంచి తొందరగా విడుదలై విప్లవోద్యమంలోకి తిరిగి వచ్చేలా పీ.ఎల్.జీ.ఏ తన శాయాశక్తుల ప్రయత్నిస్తుందని హామీనిస్తూ, ఆ కామ్రేడ్స్ త్వరగా జైలు గోడల నుంచి విముక్తి కావాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది.

ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ) వారోత్సవాలు జరుపుకోవడమంటే గడిచిన రెండు దశాబ్దాల కాలంలో పీ.ఎల్.జీ.ఏ సాగించిన రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక కృషిలోని సాఫల్య, వైఫల్యాలను సమీక్షించుకోవడం, ఈ కృషిలో మనతో భుజం, భుజం కలిపి నడిచి అమరులయిన వారి ఆదర్శాల నుంచి ప్రేరణ, ఉత్తేజాన్ని పొందడం, శతృవు మన ముందుంచిన సవాళ్ళను స్వీకరించి వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రతిఎత్తుగడలను రూపొందించుకోవడం, విప్లవోద్యమం ముందున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి తగిన పోరాట, నిర్మాణ రూపాలనూ, పని పద్ధతులను రూపొందించుకోవడం, రూపొందించుకున్న ఎత్తుగడలనూ, పని పద్ధతులను దృఢంగా అమలు చేయడం, సాధించాల్సిన కర్తవ్యాల అమలుకోసం మావోయిస్టు పోరాటశైలితో ముందుకు సాగడానికి ప్రతినబూనడం –వీటిని గమనంలో ఉంచుకొని మన పీ.ఎల్.జీ.ఏ వారోత్సవాలను జరుపుకుందాం.

### గడిచిన రెండు దశాబ్దాల కాలంలో, మన జోన్‌వ్యాప్తంగా, పీ.ఎల్.జీ.ఏ చేపట్టిన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషిని రేఖామాత్రంగా పరిశీలిద్దాం

గత రెండు దశాబ్దాల కాలంలో మన జోన్‌వ్యాప్తంగా అనేక ఎత్తుగడల ఎదురుదాడులు, ప్రతిఘటన క్యాంపెయిన్‌లను మన పీ.ఎల్.జీ.ఏ చేపట్టింది. ఈ మొత్తం కాలంలో 200మందికి పైగా ఏ.పీ.ఎస్.పీ, గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జీ, డీ.బీ.ఎఫ్, ఓ.ఎస్.ఏ.పీ, సీ.ఆర్.పీ.ఎఫ్, కోబ్రా, బీ.ఎస్.ఎఫ్‌లకు చెందిన బలగాలను మన పీ.ఎల్.జీ.ఏ మట్టుబెట్టింది. మరో 300 మంది పోలీసులను గాయపర్చి కొన్ని చర్యలలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకుంది. 2001లో మన పీ.ఎల్.జీ.ఏ చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లలో కలిమెల, మోటు, ఉప్పలాడ పోలీసు క్యాంపులపై రెయిడ్స్ నిర్వహించింది. కలిమెల, ఉప్పలాడలలో మనకు విజయాలు లభించి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నప్పటికీ, మోటులో మనకు ప్రతికూలతలు ఎదురైనాయి. ఇదే సంవత్సరంలో చింతకర్రపాలెం, మారేడుమిల్లు, లక్ష్మీపురంల దగ్గర ఆంబుష్ ఎత్తుగడల ద్వారా శతృవును దెబ్బతీసింది. 1998 ఆగష్టు నెలలో కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్‌కు కారకుడైన సీ.ఐ గాంధీనీ, వాడి బాడీగార్డును మన ప్రత్యేక యాక్షన్ టీం సాలూరు కోర్టులో చంపి, వాళ్ళ దగ్గర ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. 2002లో అనకాపల్లి, చోడవరం రెయిడ్స్‌తోపాటు, గొట్లబద్రలో ఆంబుష్ నిర్వహించింది. ఇదే సంవత్సరంలో విశాఖ, ఈస్ట్ డివిజన్ ఉద్యమ అణచివేతలో కీలకపాత్ర పోషించిన డీ.ఎస్.పీ పోతారెడ్డిని మన యాక్షన్ టీం ఖతం చేసింది. 2003లో పోలవరం ఆంబుష్‌తోపాటు, కూనేరులో ఆర్.పీ.ఎఫ్ పోలీసులపై దాడిచేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. 2004లో చారిత్రాత్మకమైన కొరాపుట్ మల్టీరెయిడ్‌ను నిర్వహించింది. ఈ మల్టీ రైడ్‌లో ఏ.ఓ.బీ బలగాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. 2005లో కూనేరు రైల్వే పోలీసులపై రెండవసారి దాడి చేసి, ఆయుధాలనూ, డబ్బులను స్వాధీనం చేసుకున్నది. 2006లో ఆర్.ఉదయగిరి పోలీసు ఔట్‌పోస్టుపై పట్టపగలు దాడి చేసి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నది. ఇదే సంవవత్సరం వోడమామిడి దగ్గర పోలీసులపై దాడి చేసింది. 2007లో ఎమ్.పి 79, గుడ్లవాడ దగ్గర శతృవును దెబ్బ తీసింది. 2008లో బలిమెల, తెల్లరాయి, గునికిరాళ్ళ దగ్గర ఆంబుష్ ఎత్తుగడలతో కమాండో బలగాలను వెంటనే కోలుకోలేని విధంగా

దెబ్బతీసింది. ఇదే సంవత్సరం ఒడిశాలో కేంద్ర మిలటరీ కమీషన్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ రోప్‌వే (నయగడ దాడి)లో మన పీ.ఎల్.జీ.ఏ బలగాలు పాల్గొని వాటిని విజయవంతం చేయడానికి కృషి చేసాయి. 2009లో నాల్కో దాడితోపాటు, పాలూరు ఆంబుష్ ద్వారా శత్రువును దెబ్బతీసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నది. ఇదే సంవత్సరంలో కిల్లంకోట దగ్గర గ్రేహౌండ్స్ బలగాలపై మన పీ.ఎల్.జీ.ఏ చేసిన ఆవర్చ్యునిటీ ఆంబుష్‌లో ముగ్గురిని గాయపర్చింది. 2012లో డైక్రీ ఆంబుష్‌లో బీ.ఎస్.ఎఫ్ కమెండెంట్‌తోపాటు, ఉప కమెండెంట్, సీ.ఐ, ఎస్.ఐలను ఖతం చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఇదే సంవత్సరంలో ఆలంపాడులో పీ.ఎల్.జీ.ఏ ఏర్పాటు చేసిన బూబీట్రాప్ పేలి ఇద్దరు ఓ.ఎస్.ఎఫ్ పోలీసులు ఖతం కాగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇదే సంవత్సరంలో ఎస్.ఐ.బీ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అప్పన్నను మన పీ.ఎల్.జీ.ఏ యాక్షన్ టీం పాడేరు టౌన్‌లో ఖతం చేసింది. 2013లో రాళ్ళగడ్డ దగ్గర మన పీ.ఎల్.జీ.ఏ ఏర్పాటు చేసిన ఒక డెలిబరేట్ ఆంబుష్‌లో ముగ్గురు బీ.ఎస్.ఎఫ్ పోలీసులు చనిపోగా, మరో ముగ్గురు గాయపడ్డారు. 2015లో పలగరేవు ఆంబుష్‌లో ముగ్గురు బీ.ఎస్.ఎఫ్ పోలీసులను ఖతం చేసి, 6గురుని గాయపర్చింది. 2017లో సుంకి దగ్గర జరిగిన ఆంబుష్‌లో 9 మంది ఓ.ఎస్.ఏ.పీ పోలీసులు ఖతం కాగా, మరో నలుగురు గాయపడ్డారు. 2018లో మాఫియా ముఠాలకు నాయకులుగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన అరకు ఎమ్.ఎల్.ఏ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఏ సీవేరి సోమలను మన పీ.ఎల్.జీ.ఏ ఖతం చేసి వాళ్ళ బాడీగార్డ్స్ దగ్గర వున్న ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. 2019లో డాబుగూడ దగ్గర మన పీ.ఎల్.జీ.ఏ కామ్రేడ్స్‌పై పోలీసులు దాడి చేయడంతో, ఆ దాడిని విరోచితంగా తిప్పికొడుతూ ఒక డీ.బీ.ఎఫ్ పోలీసును చంపి, మరొకరిని గాయపర్చి కామ్రేడ్ రాకేష్ అమరుడైనాడు. ఈ సంవత్సరంలోనే పెదబయలు ఏరియాలో, మిలీషియా కామ్రేడ్స్ ఏర్పాటు చేసిన బూబీట్రాప్ పేలి కొద్ది మంది పోలీసులు గాయపడ్డారు. నిర్దిష్టంగా ఈ సంవత్సరంలో మన పీ.ఎల్.జీ.ఏకు, పోలీసులకు మధ్య జరిగిన వివిధ ఘర్షణలలో ముగ్గురు పోలీసులు చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. మెట్టగూడ గ్రామం దగ్గర ప్రయాణంలో ఉన్న పీ.ఎల్.జీ.ఏ కామ్రేడ్స్‌పై పోలీసులు దాడి చేయడంతో, ఆ దాడిని ప్రతిఘటించే క్రమంలో ఒక గ్రేహౌండ్స్ పోలీసును మన కామ్రేడ్స్ గాయపరిచారు. ఈ ఘటన జరిగిన తర్వాత పెదబయలు ఏరియాలో మిలీషియా కామ్రేడ్స్ ఏర్పాటు చేసిన బూబీట్రాప్ పేలి మరో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు గాయపడ్డారు. ఇదే క్రమంలో గజ్జేడు గ్రామం దగ్గర మనపై దాడికి వస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై మన పీ.ఎల్.జీ.ఏ బలగాలు అకస్మాత్తుగా దాడి చేయడంతో ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు ఖతం కాగా, మరికొంత మంది గాయపడ్డారు. కటాఫ్ ఏరియాలో గుర్రశెట్టి జంక్షన్ దగ్గర కూంబింగ్స్‌కు వచ్చిన బీ.ఎస్.ఎఫ్ బలగాలపై మన పీ.ఎల్.జీ.ఏ బలగాలు స్నైపర్ టెక్నిక్‌తో దాడి చేసి ఒకర్నిని గాయపరిచారు.

ఈ ఎత్తుగడల ప్రతిదాడులన్నీ మన పార్టీ రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ వ్యూహంలో భాగంగా జరిగాయి. మరోవైపు పార్టీ అందించిన రాజకీయ చైతన్యంతో ప్రజలు భూమి, విస్థాపన, ముంపు వంటి అనేక జీవన సమస్యల పరిష్కారానికి పోరాడి విజయాలు సాధించారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతమంతటా 'జల్, జంగల్, జమీన్ మావే' అనే నినాదం సర్వసాధారణ నినాదంగా మారింది. ప్రజలు ఈ సమస్యల పరిష్కారానికీ, ప్రజల రాజ్యాధికారానికి మధ్య ఉన్న సంబంధాన్నీ, ప్రజల రాజకీయ అధికారానికీ, ప్రజా సైన్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపజేసేలా సాయుధులవుతున్నారు. మిలీషియా, ప్రజా సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలలోకి సమీకృతులువుతున్నారు. పీ.ఎల్.జీ.ఏ ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ, వారికి రక్షణ కల్పిస్తుంటే, ప్రజలు పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏను కాపాడుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్, సమాధాన్ పేర్లతో విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు అమలు చేస్తున్న క్రూరమైన సాయుధ అణచివేత దాడులను తీవ్రంగా నిరసిస్తున్నారు, ప్రతిఘటిస్తున్నారు. వాటికి వ్యతిరేకంగా పార్టీ ఇచ్చిన బంద్ పిలుపుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పోలీసులు గ్రామాలపై దాడులకు పాల్పడినప్పుడు సంఘటితంగా వాళ్ళపై తిరుగబడుతున్నారు. పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు తమ నిరసనను తెలియజేస్తున్నారు. ప్రజా శత్రువులపై దాడులు చేసి, వాళ్ళ ఆస్తులను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ప్రజా ద్రోహులను విచారించి, శిక్షించే సందర్భాలలో వందలు, వేల సంఖ్యలో సమీకృతులవుతున్నారు.

**శత్రు సన్నాహాలు**

తూర్పు కనుమలు విప్లవ యుద్ధానికి అనువైన ప్రాంతం కావడం, చారిత్రాత్మక ప్రాధాన్యత గల రంపపితూరీ, శ్రీకాకుళ సాయుధ పోరాటం, ఒడిశాలో చక్రబిసోయ్ పోరాటం, లక్ష్మణ్‌నాయక్ నాయకత్వాన జరిగిన బ్రిటీష్ వ్యతిరేక పోరాటం వంటి ప్రగతిశీల, విప్లవ పోరాటాలు జరిగిన ప్రాంతాలలో మన ఉద్యమం బలపడుతూ ఉండటంతోపాటు, తూర్పు కనుమలలో ఉన్న భౌగోళిక సంపదనూ, ప్రకృతి వనరులను దోచుకోవడం కోసం దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ ఉండటం, ఆ పోరాటాలకు మావోయిస్టు పార్టీ, నాయకత్వం వహిస్తూ ఉండటంతో సహించలేని దోపిడీ పాలకవర్గాలు ఆది నుంచీ జోన్‌వ్యాప్తంగా తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తూ వచ్చాయి.

గడిచిన రెండు దశాబ్దాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనపై కొనసాగిస్తున్న అణచివేత, నిర్మూలన దాడిని రోజు రోజుకు మరింత తీవ్రతరం చేస్తూ వచ్చాయి. ఈ దాడి ఎల్.ఐ.సీ వ్యూహంలో భాగంగా బహుముఖంగా సాగింది. సాయుధదాడి, సంస్కరణలు, దుష్ప్రచారం, ఇలా అనేక రూపాలలో ఈ దాడి కొనసాగింది. ఇందులో సాయుధ అణచివేత ప్రధానం అయినప్పటికీ, మిగతా రూపాలన్నీ సమన్వయించబడ్డాయి. దోపిడీ రాజ్యాంగ యంత్రంలో భాగంగా ఉన్న అన్ని ప్రభుత్వశాఖలను విప్లవోద్యమానికి వ్యతిరేకంగా మలిచారు. విప్లవోద్యమానికి సహకరిస్తున్న వివిధ సెక్షన్ల ప్రజల్ని నయాన-భయానా నిర్వీర్యపరిచే ఎత్తుగడలను అవలంభించారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజల మిలిటెన్సీపై నీళ్ళు చల్లే సామ్రాజ్యవాద, దోపిడీ ప్రభుత్వ అనుకూల సంస్కరణలను అమలు చేస్తూ వచ్చాయి.

ఇక దోపిడీ వర్గ స్వభావం కలిగిన బూర్జువా, రివిజనిస్టు పాలకపార్టీలు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే విప్లవోద్యమాన్నీ, ప్రజాఉద్యమాలను అణచివేసే విషయంలో ఐక్య మనస్కతను కలిగి ఉన్నాయి. ఈ మొత్తం అణచివేత ప్రక్రియలో రాజ్యయంత్రంలో భాగంగా ఉన్న పోలీసుశాఖనే ముందు భాగాన ఉంటూ కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు పగ్గాలు చేపట్టిన పోలీసు అధికారులు చట్ట వ్యతిరేకంగా అనేక ఆకృత్యాలు, అత్యాచారాలు, అవినీతి, హత్యాకాండ, దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయి. విప్లవచేవ సన్నగిల్లి, పోలీసులు ఇస్తున్న ప్రోత్సాహకాలకు ఆశపడి విప్లవోద్యమం నుంచి వైదొలిగి ప్రజలకు ద్రోహం తలపెట్టిన మాజీలు కొద్దిమంది మాఫియా అవతారం ఎత్తి విజృంభించడం కన్పిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపున ప్రజలను అణచివేస్తూనే, మరోవైపు ఉపాధి పేరిట పీడిత వర్గాలకు చెందిన యువతను తమకు కాపలాకాసే కిరాయి పోలీసు ఉద్యోగాలు చేయమంటూ ప్రోత్సాహిస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక ఆదివాసీ యువకులను పోలీసు ఉద్యోగాలలో నియమిస్తూ, మన కళ్ళను మన వేలితో పొడిచే కుటిల ఎత్తుగడలను దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి.

పైన చెప్పిన విధంగా పాలకవర్గాలు ప్రజలను మభ్యపెట్టడానికి అనేక మోసపూరిత ఎత్తుగడలను అనుసరిస్తూనే, మరోవైపు సాయుధంగా అణచివేత చర్యలను తీవ్రతరం చేసాయి. వేల, కోట్ల ప్రజాధనంతో ఉద్యమ ప్రాంతమంతటా పోలీస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో భాగంగా రోడ్లు, సెల్‌టవర్లు, బ్రిడ్జిల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తూ వస్తున్నాయి. ఏ.పీ.ఎస్.పీ, ఏ.ఎన్.ఎస్, సీ.ఆర్.పీ.ఎఫ్, బి.ఎస్.ఎఫ్, గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జీ, డీ.బీ.ఎఫ్, కోబ్రా బలగాలను ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ జంగల్ వార్‌ఫేర్‌లో శిక్షణను ఇస్తూ, అధునాతన ఆయుధాలను సమకూర్చి మన పోరాట ప్రాంతాలలో మోహరించాయి. ఈ బలగాలు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, విప్లవ ప్రజానీకం లక్ష్యంగా నిరంతరం కూంబింగ్స్ నిర్వహిస్తున్నాయి. ఈ కూంబింగ్స్‌లో భాగంగా 'ఏరియా డామినేషన్స్' నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భాలలో పార్టీ ఉన్నతస్థాయి నాయకత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రత్యేక కేంద్రీకరణ ఉంటుంది. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసి, ఆ నెట్‌వర్క్‌పై ఆధారపడి మకాంలపై దాడులు చేయడం, గ్రామాలపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేయడం, దోపిడీ చేయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, గ్రామాలనూ, ఇళ్ళను తగలబెట్టడం, సంఘ నాయకత్వాన్ని అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి సంవత్సరాల తరబడి జైళ్ళల్లో బంధించడం, యువతను నయాన-భయానా లొంగిపొమ్మని వత్తిడి తేవడం, సరెండర్ కానీ సంఘ నాయకత్వాన్ని బూటకపు ఎన్‌కౌంటర్స్‌లో కాల్చిచంపడం లాంటి క్రూరమైన పద్ధతుల్లో శతృవు తన సాయుధ దాడిని కొనసాగిస్తూ వస్తున్నాడు.

2004 సెప్టెంబర్ 21న మావోయిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత దాని నాయకత్వంలో ఏర్పడిన పీ.ఎల్.జీ.ఏ యొక్క యుద్ధ చర్యల తీవ్రత, విస్తృతి పెరగడంతో భారతదేశ దోపిడీ పాలకవర్గాలు తీవ్రమైన ఆందోళనకు గురయ్యాయి. ఈ దాడుల తీవ్రతను కొంత ముందుగానే అంతర్జాతీయ, దేశీయ పాలకవర్గాలు అంచనా కట్టాయి. ఈ నేపథ్యంలోనే అమెరికన్ సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో అప్పటి దేశ ప్రధానమంత్రి, 'వామపక్ష ఉగ్రవాదం దేశ అంతరంగిక భద్రతకు ప్రధానమైన ముప్పుగా పరిణమించింద'ని ప్రకటించాడు. వాస్తవంగా దేశ అంతరంగిక భద్రతకు ముప్పు అంటే పాలకవర్గాల దృష్టిలో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, భూస్వాముల ఉనికికే ముప్పు ఏర్పడిందనేదే. ముఖ్యంగా అపార ఖనిజ, అటవీ సంపదలకు నిలయమైన మన ఉద్యమ ప్రాంతాలలో విప్లవోద్యమం బలపడటం సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల వేలకోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రమాదకరం. అందుకే దేశ సంపదను కొల్లగొట్టే ఈ దోపిడీ దొంగలంతా కుమ్మక్కయి భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న మన పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏను సమూలంగా నాశనం చేయాలనే కుట్రలతో విప్లవ ప్రతీఘాతుక యుద్ధ పథకాల్ని రూపొందించి అమలు చేస్తున్నాయి.

ఈ పథకంలో భాగంగానే విప్లవోద్యమంతోపాటు, జాతుల ఉద్యమాలనూ, ప్రజాస్వామిక ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2009లో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' అనే నరహంతక ఫాసిస్టు దాడి పథకాన్ని రూపొందించి కొనసాగించింది. ఈ పథకంలో భాగంగా ఉద్యమ ప్రాంతాలలో వేలాది పోలీసు, కమాండో, పారా మిలటరీ బలగాలను మోహరించే విధంగా కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేయడం, సాయుధ బలగాలను ఆధునీకరించడం, ఆయా రాష్ట్ర పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఇంటలిజెన్సీ సమాచారాన్ని యిచ్చిపుచ్చుకోవడం, జాయింట్ ఆపరేషన్స్‌ను ప్లాన్ చేసి అమలు చేయడం లాంటి అనేక ప్రతీఘాతుక ఎత్తుగడలను శతృవు కొనసాగిస్తున్నాడు. శతృవు 2017 వరకు ఈ ఆపరేషన్‌ను కొనసాగించినప్పటికీ, అనుకున్నంతగా ఫలితాలు సాధించలేకపోవడంతో అప్పటి వరకు వచ్చిన అనుభవాలను క్రోడీకరించి 2017 మేలో, ముఖ్యంగా డీ.కేలో పీ.ఎల్.జీ.ఏ చేసిన బుర్కపాల్ ఆంబుష్ తర్వాత, ఆపరేషన్ 'సమాధాన్' దాడి పథకాన్ని, వ్యూహం - ఎత్తుగడలను రూపొందించి అమలు చేస్తున్నాడు. ఈ పథకంలో భాగంగా రానున్న 5 సంవత్సరాల (2017-22) కాలంలో భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నాడు. 2009 నుంచి 2017 వరకు దేశంలో కొనసాగించిన 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' దాడిలాగానే ఈ 'సమాధాన్' దాడి కూడా భారతదేశంలోని పీడిత వర్గాలపైన, పీడిత సామాజిక సముదాయాలపైన, పీడిత జాతులపైన, మత మైనార్టీలపైన మొత్తం భారతదేశ పీడిత ప్రజలపైన యుద్ధంగానే ఈ దాడి కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆపరేషన్ 'సమాధాన్' దాడికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ, ఆయా రాష్ట్రాల పరిధిలో అత్యంత పాశవికంగా అమలు చేస్తున్నాయి. జోన్ పరిధిలో ఆంధ్ర-ఒడిశా ప్రభుత్వాలు ఈ దాడిని అమలు చేయడం కోసం తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఈ సంవత్సర కాలంలోనే జోన్ పరిధిలో 7సార్లు శతృ బలగాలకూ, మన పీ.ఎల్.జీ.ఏ బలగాలకు మధ్య సాయుధ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కటాఫ్ ప్రాంతాన్ని పూర్తిగా దిగ్బంధించే విధంగా క్యాంపులు ఉనికిలోకి వస్తున్నాయి. ఈ సంవత్సర కాలంలోనే ఐదు బీ.ఎస్.ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేసారు. మరికొన్ని క్యాంపుల ఏర్పాటుకు సన్నాహాలు

చురుకుగా జరుగుతున్నాయి. ఆంధ్రలో మన ఉనికిని లేకుండా చేయడం కోసం నిరంతరం ఏరియా డామినేషన్స్ కొనసాగిస్తున్నారు. నెట్‌వర్క్ సహకారంతో దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ, ఈ దాడులను తీవ్రతరం చేసారు. వీటితోపాటు దుష్ప్రచార దాడి, సంస్కరణలను కొనసాగిస్తూ ప్రజలను పార్టీ నుండి దూరం చేసే ఎత్తుగడలను సీరియస్‌గా అమలు చేస్తున్నారు.

### మన సన్నాహాలు

ప్రస్తుతం శత్రువు కొనసాగిస్తున్న అత్యంత క్రూరమైన ఆపరేషన్ 'సమాధాన్' దాడిని రానున్న రోజుల్లో మరింత తీవ్రంగా కొనసాగించే అవకాశం ఉంది. ఈ దాడి స్వభావాన్ని పార్టీ క్యాడర్లు, పీ.ఎల్.జీ.ఏ పోరాట యోధులు, యోధలు ప్రజలు మరింత లోతుగా అర్థం చేసుకోవాలి. ఈ దాడి తీవ్రత, క్రూరత, పాశవికతను పరిగణలోకి తీసుకొని శత్రుదాడిలో అన్ని రకాల కష్టాలనూ, నష్టాలను తట్టుకుంటూ ధైర్యంగా నిలబడాలి. జోన్‌లో ఉన్న అనుకూలతలపై ఆధారపడుతూ అందుబాటలో ఉన్న వనరులతోనే ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ తెగించి పోరాడటం ద్వారా శత్రుదాడిని మనం ఓడించగల్గుతాం.

### ప్రజాయుద్ధంలో ప్రజల, మిలీషియా క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా శత్రు దాడిని ఓడించగల్గుతాం

చెరువు నుంచి చేపలను వేరుచేసే విధంగా శత్రువు మనలను ప్రజల నుంచి వేరు చేసి దెబ్బతీయాలని నిరంతరం ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయంలో మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంచే విధంగా పథకాలు రూపొందించి అమలు చేయాలి. శత్రువును ఓడించగలిగేలా ప్రజలను సన్నద్ధం చేసేందుకు వివిధ పోరాటాలలోకి ముఖ్యంగా సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటంలోకి సమీకరించడం, పోరాటాలలోకి సమీకృతులైన వారిని సాయుధ పోరాట రాజకీయాలతో చైతన్య పరచడం, మిలీషియాతో పాటు వివిధ ప్రజా నిర్మాణాలలోకి సమీకరించడం, ఈ మొత్తం కార్యకలాపాల ద్వారా వారిలో రాజ్యాధికార స్పృహను పెంచడం, దీని కొనసాగింపులో విప్లవ ప్రజా కమిటీలను నిర్మించడం చేయాలి. శత్రు దాడుల నుంచి తమకు తాము ఆత్మరక్షణ చేసుకోవడం, ప్రతిఘటించే విధంగా వివిధ స్థాయిల్లో ప్రజారాజ్యాధికార సంస్థలు ఏర్పర్చి సిద్ధం చేయాలి. పోరాట ప్రజానీకాన్ని చైతన్యపర్చి, సంఘటితం చేసి, వారిని సాయుధం చేయడం నేటి పరిస్థితిలో మన ముఖ్యమైన కర్తవ్యం. సామ్రాజ్యవాద ప్రోద్బలంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎల్.ఐ.సీ వ్యూహం-ఎత్తుగడల స్వరూపాన్ని, మోసపు ఎత్తుగడలనూ, బూటకపు సంస్కరణలనూ, కౌన్సిలింగ్, కోవర్టు, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను గురించి విశాల ప్రజారాశులకు సరైన అవగాహన కల్పించడం కోసం పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, వివిధ ప్రజాసంఘాలు తీవ్రంగా కృషి చేయాలి. శత్రువును శత్రువుగా చూడగలిగేలా మన శ్రేణులకు విద్య గరపాలి. ఈ విషయం ప్రజలకు అర్థం కాకపోతే వారు వర్గపోరాట చైతన్యంతో శత్రువుకు వ్యతిరేకంగా పోరాడలేరు. ప్రజలు తమకు తాము విముక్తి చేసుకోవడం, తమ వర్గాన్ని విముక్తి చేసుకోవడం కోసం న్యాయమైన ప్రజాయుద్ధంలో భాగం కావడం తమ జీవితంలో ఒక భాగంగా స్వీకరించే చైతన్యాన్ని అభివృద్ధి చేయాలి. ప్రజాయుద్ధం విజయం సాధించడం వల్లనే తమ జీవితాలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుదనే సత్యాన్ని ప్రజలకు అర్థం చేయించి, అందుకనుగుణంగా ప్రజాయుద్ధంలో ప్రజలకు శిక్షణనివ్వాలి. ప్రజాయుద్ధ నిర్మాణాలలో (పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, ప్రజా మిలీషియా) ప్రజలను సంఘటితం చేస్తూ వారిలో దాగివున్న ధైర్యసాహసాలను వెలికితీయాలి. ప్రజల నుంచి పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏను వేరు చేయడం కోసం సంస్కరణల పథకాల ద్వారా ప్రజలను ఉచ్చులోకి లాగే పద్ధతులను విఫలం చేయడం కోసం ప్రజలను చైతన్యవంతం చేయాలి. తద్వారా ప్రజల నుంచి శత్రువుకు ఎటువంటి మద్దతు లేకుండా చేయాలి. ఇటువంటి పద్ధతుల ద్వారా శత్రు కుట్రలను ఓడించాలి. వర్గచైతన్యాన్ని పెంపొందించి ప్రజల ఐక్యతను కాపాడాలి. ప్రజల తక్షణ, మౌళిక సమస్యలపై భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో ప్రజలను విస్తృతంగా సమీకరించాలి. ప్రజలను రాజకీయ పోరాటాలలో సమీకరించడం అంటే 'వారిని యుద్ధానికి సిద్ధం చేయడమే' అనే విషయాన్ని సదా మనం దృష్టిలో పెట్టుకోవాలి.

### ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షభంలోకి కూరుకుపోయి ఉంది. 1980ల దశకం నుంచీ అది లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ పేరిట అనుసరించిన నయా ఉదారవాద విధానాలు, దానిని సంక్షోభ సుడిగుండం నుంచి గట్టెకించలేకపోయాయి. ఈ వైఫల్యంతో అది దారీ తెన్ను తెలియని స్థితికి నెట్టుబడి ఉంది. ఈ స్థితిలో అంతర్జాతీయ మౌళిక వైరుధ్యాలు మరింతగా తీవ్రతరమవుతున్నాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో పీటముడి వేయడం వలన భారత ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రమైన ఆర్థిక, ద్రవ్యసంక్షోభంలోకి కూరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి సేవచేసేందుకు మోడీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. మోడీ ప్రభుత్వం ఒకవైపున హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ, ప్రజల మధ్య చీలికలు సృష్టించి, మరోవైపు సామ్రాజ్యవాద ప్రాయోజిత నయా ఉదారవాద విధానాలకు సేవ చేస్తున్నది. ఇందుకు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజాన్ని ఒక ఆయుధంగా చేపట్టింది. ఈ పరిణామాలు భారతదేశంలో కూడా మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నాయి.

ప్రపంచీకరణ కొనసాగిన మూడున్నర దశాబ్దాలలో మున్నెన్నడూ లేనంతగా వనరుల సంక్షోభం, పర్యావరణ సంక్షోభం, వ్యవసాయ సంక్షోభం, ఉపాధిలేమి, ద్రవ్యోల్బణం, అధిక ధరలు, కరోనా వంటి వైరస్‌ల వ్యాప్తివల్ల ఆరోగ్య సంక్షోభం ఇలా అనేక సమస్యలు పీడిత ప్రజల జీవితాలను చుట్టుముడ్తున్నాయి. ధనికులు మరింత ధనికులుగా మారితే, పేదలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ఈ వస్తుగత పరిస్థితులు అనేక ప్రజాపోరాటాలకు జన్మనిస్తున్నాయి. ఈ ప్రజా పోరాటాలు ఒక పెద్ద ప్రజా ఉద్యమ వెల్లువగా ఉద్భవించే అవకాశం పెరుగుతున్నది.

పై నేపథ్యంలో అంతర్జాతీయ, దేశీయ దోపిడీ పాలకవర్గాలు బలప్రయోగం ద్వారా ప్రజలను నియంత్రించాలని చూస్తున్నాయి. ముఖ్యంగా కిరాయి సాయుధ బలగాలపై ఆధారపడుతూ, వివిధ రూపాలలో ఫాసిజాన్ని ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి.



ప్రముఖ సామ్రాజ్యవాద దేశాలు మార్కెట్ల స్వాధీన పోటీలో వాణిజ్య యుద్ధాలకు తలపడుతున్నాయి. మరోవైపు అత్యంత ఆధునాతన మారణాయుధాలను సృష్టించి, వాటిని పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నాయి. ఆ ఆయుధాల కుప్పలపై అధిష్టించి ప్రపంచాన్ని నియంత్రించాలని చూస్తున్నాయి.

పై వస్తుగత విశ్లేషణ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థతోపాటు, దానికి సేవ చేస్తున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలు శిథిలావస్థకు చేరుకున్నాయనే వాస్తవం అవగతమవుతుంది. అయితే పైన చెప్పుకున్నట్లుగా అవి తమ అస్థిత్వాన్ని కాపాడుకొనేందుకు అత్యంత క్రూరంగా బలప్రయోగానికీ, హింసకు పాల్పడేందుకు సిద్ధపడుతున్నాయి. ఇప్పటికే అవి వివిధ దేశాల పీడిత ప్రజలపై అమానవీయమైన హింసను ప్రయోగిస్తున్నాయి.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

పై భౌతిక వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారతదేశంలో విప్లవోద్యమాన్ని పురోగమింపచేసేందుకు పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవాల సందర్భంగా, గత రెండు దశాబ్దాలలో మన పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ మా-లే-మా ఎర్రపతాకను ఎత్తిపడుతూ పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజల ప్రయోజనాలనే తన ప్రయోజనాలుగా ఎంచి, గుండె నెత్తురులు తర్పణ చేస్తూ సాధించిన విజయాలను ఎత్తిపట్టండి. ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదని బలంగా చాటిచెప్పండి. సామ్రాజ్యవాదుల, వారి దళారీ పాలకుల పాలనలో ప్రజలకు దోపిడీ, పీడన, అణచివేత, అత్యాచారాలతో కూడిన దుర్భర జీవితం, పరాధీనత, మరణం తప్ప మరేమీ దక్కదు. ప్రజలకు విప్లవం తప్ప మరో మార్గం లేదు. కనుక, పిడికెడు మందిగా వున్న సామ్రాజ్యవాదులు, వారి దళారీలకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులను సమైక్యం చేయండి. దేశంలోనూ, ప్రపంచంలోనూ అనుకూల విప్లవ పరిస్థితిని వినియోగించుకుని వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తగిన ఎత్తుగడలు చేపట్టి విప్లవ వెల్లువను సృష్టించండి. విప్లవోద్యమంలో లోపాలను చక్కదిద్దుకుంటూ, బలహీనతలను అధిగమిస్తూ, తప్పుల నుండి నేర్చుకున్న పాఠాలపై ఆధారపడి శత్రు వ్యూహాత్మక 'సమాధాన్' పథకాన్ని సాహసోపేతంగా ఎదుర్కోండి. సోషలిజం-కమ్యూనిజం లక్ష్యంతో దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో విప్లవోద్యమాన్ని మరిన్ని విజయాలు సాధించే వైపు పురోగమింపజేయండి. అంతిమ విజయం నిశ్చితంగా ప్రజలదే!

**నినాదాలు**

* ప్రజాయుద్ధంలో మిలీషియా, ప్రజల భాగస్వామ్యాన్ని, క్రియాశీలకంగా అభివృద్ధి చేద్దాం!
* శత్రువును నిర్మూలించే ఎత్తుగడలను దృఢంగా, సృజనాత్మకంగా, పట్టుదలతో అమలు చేద్దాం!
* స్వీయాత్మక శక్తులను పెంపొందించుకునే లక్ష్యంతో జోన్‌వ్యాప్తంగా రిక్రూట్‌మెంట్‌పై కేంద్రీకరిద్దాం!
* ప్రజా విముక్తి గెరిల్లా సైన్యా(పీ.ఎల్.జీ.ఏ)న్ని, బలోపేతం చేద్దాం!
* మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!
* పీఎల్‌జీఏ వర్ధిల్లాలి!
* సీపీఐ (మావోయిస్టు) వర్ధిల్లాలి!
* నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!
* ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ మిలటరీ కమిషన్

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు విముక్తి లేదు!

# పీఎల్‌జీఏ 20వ వార్షికోత్సవాల సందర్భంగా

## సీపీఐ(మావోయిస్టు) సెంట్రల్ మిలటరీ కమీషన్

## ఇన్‌చార్జ్ ఇంటర్వ్యూ

**1. ప్రశ్న:- పీఎల్‌జీఏను మీరు ఎలా నిర్వచిస్తారు?**

**జవాబు:-** విప్లవం హింసాపూరితమైనదని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కార్ల్ మార్క్స్ ఎప్పుడో చెప్పాడు. మన దేశంలోని ప్రజల ముఖ్యమైన సమస్యలకు కారణం ఈ కుళ్ళిన వ్యవస్థ అని మన పార్టీ చెపుతున్నది. ఈ వ్యవస్థను తొలగించాలి అంటే దీని అర్థం ఏమిటీ? అధికారంలో వున్న నిరంకుశ దళారీ బూర్జువా వర్గాన్నీ, భూస్వాములనూ, వారికి యజమానులైన సామ్రాజ్యవాదులను అధికారం నుండి తొలగించాలని అర్థం. సమాజంలోని అన్ని పీడిత వర్గాలకు, సామాజిక శ్రేణులకు మరియు జాతులకు అధికారాన్నివ్వాలి. ఇది దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజవంతం చేయటం ద్వారానే లభిస్తుంది. నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం, కాంక్సా, సొనార్‌పూర్, శ్రీకాకుళం, బీర్‌భూమ్, లఖింపూర్-ఖేరి వంటి మహత్తర పోరాటాల వారసత్వం నుంచి పీఎల్‌జీఏ ఆవిర్భవించింది. ఈ పోరాటాలకు కార్మికవర్గ అగ్రగామి దళమైన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) మార్క్సిజం- లెనినిజం-మావోయిజం సిద్ధాంత వెలుగులో ఈ పోరాటాలను నడిపిస్తున్న క్రమంలో ప్రజల యొక్క సైన్యంగా పీఎల్‌జీఏ ఆవిర్భవించింది. విప్లవోద్యమ విజయానికి గల మూడు మంత్ర దండాలలో ఇది ఒకటి.

పీఎల్‌జీఏ అనేది రాజకీయ సైన్యం. దేశంలోని కార్మికులు, రైతులు, ఇతర పీడిత వర్గాలు, పీడిత సామాజిక శ్రేణులు, పీడిత జాతుల హితం కోసం పనిచేస్తుంది. ఇది ప్రజా విముక్తి సైన్యం (పీఎల్ఏ)గా అభివృద్ధి చెందాలి. ఇది ఒక క్రమంలో గెరిల్లాయుద్ధం, చలనయుద్ధం, స్థావర యుద్ధాలను అభివృద్ధి చేస్తూ, దేశంలోని విశాల గ్రామీణ ప్రాంతంలో స్థావర ప్రాంతాలను నిర్మిస్తూ, చివరికి పట్టణాలను కూడా ఆక్రమించి ప్రజల రాజ్యాధికారాన్ని స్థాపిస్తుంది.

ప్రస్తుతం దేశంలో 17 రాష్ట్రాలలో విప్లవోద్యమం కొనసాగుతున్నది. అందులో 13 రాష్ట్రాలలో వివిధ స్థాయిలలో గెరిల్లా నిర్మాణాలున్నాయి. వర్గపోరాటం, మరియు గెరిల్లా యుద్ధం ఎక్కడైతే తీవ్రంగా జరిగిందో అక్కడ రాజ్యాధికార స్థాపన సమస్యను పరిష్కరించింది. ఆ ప్రాంతంలో పీఎల్‌జీఏకి ఉన్నత స్థాయి నిర్మాణాలున్నాయి.

**2. ప్రశ్న:- భారత విప్లవోద్యమంలో పీఎల్‌జీఏ పాత్ర ఏమిటీ?**

**జవాబు:-** భారత సమాజంలోని ప్రముఖమైన లక్షణాలను గనుక మనం గమనించినట్లయితే విప్లవ యుద్ధంలో పీఎల్‌జీఏ పాత్రను మనం అర్థం చేసుకోగలుగుతాము. ప్రజాస్వామ్యం పేరుతో బూటకపు స్వాతంత్రం విభిన్న పీడిత వర్గాల, సామాజిక శ్రేణుల, జాతుల, ముఖ్యమైన సమస్యలను వేటిని పరిష్కరించలేదు. పారిశ్రామిక కార్మికులతో సహా, కార్మికవర్గమంతా తీవ్ర దోపిడీ అణచివేతలకు గురవుతున్నారు. కోట్లాదిమంది కార్మికులను రోడ్ల మీదకి నెడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో సగం జనాభాకు భూమి లేదు. భూమి వున్న రైతాంగంలో 85 శాతం పేద రైతులే వున్నారు. వీరికి 5 ఎకరాల భూమికంటే తక్కువే వుంది. గత 35 సంవత్సరాలుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వలన 3 లక్షలకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పేదరికం వేగంగా పెరుగుతున్నది. పెరుగుతున్న నిరుద్యోగంతో విద్యార్థులు, యువకులు హతాసులవుతున్నారు. సామ్రాజ్యవాదుల, వారి దళారీల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం అమలు జరుపుతున్న విధానాల వలన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగం రోజురోజుకు క్షీణించిపోతున్నది.

పీడిత సెక్షన్ల మీద రోజురోజుకు బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు దాడులు పెరుగుతున్నాయి. రోజురోజుకు మహిళలపైన అత్యాచారాలు పెరుగుతున్నాయి. దళితుల మీద సమాజం తలదించుకునేలాగ క్రూరమైన దాడులు జరుగుతున్నాయి. తరతరాల నుండి సాగు చేసుకుంటున్న ఆదివాసీల భూములను ఫాసిస్టు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నది. భారత విస్తరణవాదానికి వ్యతిరేకంగా పీడిత జాతులు విడిపోయే హక్కుతోపాటు, స్వయం నిర్ణయాధికారం కోసం చేస్తున్న ఆందోళనలను ఈ ఫాసిస్టులు క్రూరంగా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు.

**3. ప్రశ్న:- ఈ 20 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిరాయి పోలీసు బలగాలను ఉపయోగించి అమలు జరుపుతున్న విప్లవ ప్రతిఘాతుక అభియాన్‌లకు వ్యతిరేకంగా పీఎల్‌జీఏ, ప్రజలు గడించిన అనుభవాల గురించి చెప్పండి?**

**జవాబు:-** దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి అమెరికా సామ్రాజ్యవాదులు తయారు చేసిన ఎల్ఐసీ నీతిని ఉపయోగిస్తున్నారు. ఈ ప్రతిఘాతుక దాడులు విప్లవోద్యమం సాధించిన-అనగా పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజలు సాధించిన విజయాలను నష్టపరిచే ప్రయత్నం చేస్తున్నాయి. డీఆర్‌జీ,

డీవీఎఫ్, డీఎఫ్ వంటి జిల్లా స్థాయి బలగాలు, గ్రేహౌండ్స్, సీ-60, హాక్‌ఫోర్స్, ఎస్‌టీఎఫ్, ఎస్‌ఓజీ, జార్ఖండ్ జాగ్వర్, థండర్ బోల్ట్ వంటి రాష్ట్ర స్థాయి బలగాలు, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, ఎస్‌ఎస్‌బీ, సీఐఎస్‌ఎఫ్ ఇంకా సెంట్రల్ రిజర్వ్ బెటాలియన్ వంటి మొత్తం 6 లక్షల బలగాలను విప్లవోద్యమ నిర్మూలన కోసం ఉపయోగిస్తున్నారు. ఈ బలగాలకు తోడు భారత సైన్యంలోని కొన్ని యూనిట్లను రహస్యంగా ఉపయోగిస్తున్నారు. ప్రజల మద్దతుతో పీఎల్‌జీఏ ఈ బలగాలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నది. గత 20 సంవత్సరాలుగా ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో 4,520 మంది కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేశారు. విప్లవోద్యమం కొనసాగుతున్న రాష్ట్రాలలో 'జన్‌జాగరణ్', 'సేంద్ర', 'శాంతి కమిటీ', 'హర్మద్ వాహిని', 'సల్వాజుడుం' వంటి తెల్ల మిలీషియాను పీఎల్‌జీఏ ఓడించింది.

ఇటువంటి ప్రతిఘాతుక క్యాంపెయిన్‌లన్నీ విప్లవోద్యమాన్ని నిర్మూలించడంలో విఫలమయ్యాయి. భారత పాలకవర్గాలు 2009లో గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో దేశవ్యాప్త దాడిని ప్రారంభించాయి. పార్టీ గైడెన్స్‌లో ప్రజల క్రియాశీల మద్దతు మరియు భాగస్వామ్యంతో పీఎల్‌జీఏ శతృవు దమనకాండను తిప్పికొట్టింది. సాహసపూరితమైన ప్రజలు, పీఎల్‌జీఏ సాహసంగా ప్రతిఘటించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్ ద్వారా పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యాయి.

దేశవ్యాప్తంగా గెరిల్లా యుద్ధం తీవ్రం అవగా పాలకవర్గాలకు మరొక ప్రతిఘాతుక దాడి అవసరమైంది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఆర్థిక సంక్షోభం వలన సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, దళారీ, నిరంకుశ బూర్జువా వర్గంతో అనేక ఒప్పందాలు చేసుకున్నాయి. పాలకవర్గాలకు పీఎల్‌జీఏ ఒక అడ్డంకిగా వున్నది. విప్లవోద్యమ నిర్మూలన కోసం 2017లో మరింత క్రూరమైన 'సమాధాన్' వ్యూహాన్ని అమలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన వ్యవస్థను స్థాపించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ప్రజా రాజ్యాధికార స్థాపనలో పార్టీకీ, పీఎల్‌జీఏకి ప్రజలు మద్దతిస్తూనే వున్నారు. పార్టీకీ, పీఎల్‌జీఏకి ప్రజల మద్దతే నిజమైన బలం.

**4. ప్రశ్న:- పీఎల్‌జీఏ విఫలతలు, సఫలతల గురించి చెప్పండి?**

**జవాబు:-** పీఎల్‌జీఏ యొక్క సఫలతలు పార్టీ రాజకీయ, మిలటరీ లైన్ పైన ఆధారపడి వుంటాయి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో మన పార్టీ లైన్ పరీక్షించబడి బలపడింది. ఈ లైన్ మీద ఆధారపడి విప్లవ శక్తులు తమను తాము కాపాడుకుంటూ, ప్రజా పునాదిని పెంచుకుంటూ, శత్రువు బలగాలను నిర్మూలించే దాని మీద పీఎల్‌జీఏ అధిక ప్రాధాన్యతనిస్తుంది. అధికారాన్ని స్వాధినపరుచుకోవడం విప్లవం యొక్క కేంద్ర కర్తవ్యం. దీనిలో బలప్రయోగం తప్పనిసరి. పీఎల్‌జీఏ ఎక్కడైతే బలంగా వుందో, శత్రువు మీద దాడులు చేసిందో అక్కడ స్థానిక స్థాయిలో బూర్జువా ప్రభుత్వం ధ్వంసం చేయబడి, ప్రజా ప్రభుత్వ నిర్మాణం జరిగింది. ఇది ఒక ప్రముఖమైన రాజకీయ విజయం.

దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సిద్ధాంతం ద్వారా పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా మార్చడానికి ఎప్పటికప్పుడు నూతన గెరిల్లా యుద్ధ ఎత్తుగడలను అభివృద్ధి చేస్తున్నాము. రాజకీయ నిర్మాణ పనులు, గెరిల్లా యుద్ధాన్ని విస్తరించటం, బలోపేతం చేయటం, శతృవు నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకుంటూ పోరాట శక్తిని పెంచుకోవటం, పోరాట ప్రాంతాలను విస్తరించేందుకు మేము నిరంతరం ప్రయత్నం చేస్తున్నాము. ఈ క్రమంలో గడిచిన 20 సంవత్సరాలలో చలనయుద్ధ లక్షణాలతో కూడిన కొన్ని పెద్ద పెద్ద గెరిల్లా చర్యలను నిర్వహించాము.

డీకే మరియు జార్ఖండ్‌లలో నిర్వహించబడిన ముఖరం, ఖర్రా వంటి ఆంబుష్‌లలో పెద్ద సంఖ్యలో శతృ బలగాలను నిర్మూలించాము. ఖర్రాలో ప్లాటూన్ సంఖ్యలో శత్రు బలగాలను నిర్మూలించాము. ముఖరంలో కంపెనీ సంఖ్యలో శతృ బలగాలను నిర్మూలించాము. ఈ పెద్ద చర్యలన్నింటిలోనూ పీఎల్‌జీఏ ఆయుధాలను స్వాధీనం చేసుకొని తన సామర్థ్యాన్ని పెంచుకున్నది. ఈ పెద్ద గెరిల్లా చర్యల్లో చలనయుద్ధ లక్షణాలను చూడవచ్చు. గడచిన 20 సంవత్సరాలలో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలకు చెందిన 3058 మందిని నిర్మూలించాము. 3604 మంది పోలీసులను గాయపరిచాము. 3240 తుపాకులను స్వాధీనం చేసుకున్నాము. 1,54,247 తుటాలను స్వాధీనం చేసుకున్నాము. ఈ యుద్ధ చర్యల ద్వారా కిరాయి బలగాల దూకుడు ఒక మేరకు తగ్గింది. 2020 మార్చిలో మినప ఆంబుష్‌లో పారామిలటరీ బలగాలకు తోడు సైన్య బలగాలు కూడా స్థానిక బలగాల ముసుగులో ఈ చర్యలో పాల్గొన్నాయి. ఈ చర్యను విజయవంతం చేయటం ద్వారా ఉన్నతమైన అనుభవంతో కూడిన విజయాన్ని పీఎల్‌జీఏ సాధించింది.

ఏ యుద్ధంలోనైనా యుద్ధ సామగ్రి ప్రాముఖ్యం కలిగిన విషయంగా వుంటుంది. పీఎల్‌జీఏ ఈ విషయంలో అభివృద్ధిని సాధించింది. కామ్రేడ్ అరవింద్‌జీ పీఎల్‌జీఏ మద్దతుతో ఇంప్రూవైజ్డ్ పేలుడు పదార్థాలను తయారు చేసి ఒక నమూనాగా నిలిచారు. (అరవింద్‌జీ, దేవ్‌కూమర్‌సింగ్ సీసీ సభ్యుడు, పీబీ సభ్యుడు 2018 మార్చిలో గుండె జబ్బుతో అమరుడయ్యాడు). బీహార్-జార్ఖండ్ గెరిల్లా జోన్‌లో రసాయనిక పదార్థాలతో ప్రయోగాలు చేసి వచ్చిన అనుభవాన్ని పార్టీ అంతటికి పంచారు.

ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ సమయంలో ఉద్యమ ప్రాంతంలోని ముఖ్య ప్రాంతాల్లో మోహరించి, సివిల్, మిలటరీ సప్లైయిలను కొనసాగనీయకుండా చేసింది. అయినప్పటికీ ప్రజల మీద ఆధారపడి పార్టీ, పీఎల్‌జీఏ ఇంప్రూవైజ్డ్ ఆయుధాలను, విస్ఫోటక పదార్థాలను తయారు చేశాము చేస్తున్నాము. ప్రభుత్వం గెరిల్లాలకు అందుతున్న సప్లైలను అడ్డుకున్నప్పటికీ, ప్రజల మీద ఆధారపడి యుద్ధానికి అవసరమైన యుద్ధ సామగ్రిని తయారు చేయగల సామర్థ్యం పీఎల్‌జీఏ సంపాదించింది. ఇది ప్రజాయుద్ధం సాధించిన ఒక విజయం.

ఇవి పీఎల్‌జీఏ, ప్రజలు సాధించిన ప్రముఖమైన విజయాలు. ఇటువంటి పాజిటీవ్ అనుభవాల మీద ఆధారపడి శతృవు భవిష్యత్తులో ఎటువంటి ఫాసిస్టు విధానాలను అమలు చేసినా, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామనే విశ్వాసం మాకున్నది.

ఇక పీఎల్‌జీఏ విఫలతల గురించి చెప్పాలంటే, గెరిల్లా నియమాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరిగినప్పుడు విఫలతలు

జరిగాయి. అనవసరమైన నష్టాలను నివారించుకోవడంలో విఫలత జరిగింది. పీఎల్‌జీఏ తమ శక్తిని సురక్షితంగా కాపాడుకోవటంలో విఫలత చెందింది. దేశవ్యాప్తంగా జరిగిన శత్రు దాడిలో పెద్ద సంఖ్యలో మేము పీఎల్‌జీఏ శక్తులను కోల్పోయాము. 2011 నుండి ముఖ్యమైన నష్టాలు జరిగాయి. ఈ నష్టాల వలన నెగిటీవ్ ప్రభావం పడింది. రిక్రూట్‌మెంట్‌పై ప్రభావం పడింది. కొంత మంది క్యాడర్లు విశ్వాసాన్ని కోల్పోయారు. బలహీనమైన క్యాడర్లు శత్రువు ముందు లొంగిపోయారు. కొంతమంది ద్రోహులుగా మారారు. ఆయా సమయాల్లో మేము పరిస్థితిని సమీక్షించి ఆచరణలో మార్పు తీసుకురావడానికి తప్పులను సరిదిద్దుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. ఈ బలహీనతలనూ, పరిమితులను అధికమించి తప్పనిసరిగా ముందుకు పోతాము. అపజయాలు జరిగాయని నిరాశ పడము. ప్రజాయుద్ధమనేది అజేయమైనది. ప్రజా సేన కూడా అజేయమైనదే.

### 5. ప్రశ్న: పీఎల్‌జీఏ ప్రజలతో ఎలా కలిసిపోతుంది?

**జవాబు:–** పీఎల్‌జీఏ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే ప్రజలకు సేవ చేయటం, ప్రజారాజ్య స్థాపన కోసం శత్రువుతో పోరాడటం. సామ్రాజ్యవాదులు, దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గం విశాల ప్రజలకు ఇవి మూడు ప్రధాన శత్రువులని నిరంతరం ప్రచారం చేస్తుంది. విప్లవ రాజకీయాలను ప్రచారం చేయటం ద్వారా ప్రజలను ప్రేరేపించి వర్గ పోరాటంలోకి వారిని సమీకరిస్తుంది. దోపిడీ నుండి విముక్తి కోసం, ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపన కోసం వారిని సంఘటితం చేస్తుంది. అంతర్జాతీయ కార్మికవర్గానికి మహోపాధ్యాయుడైన కామ్రేడ్ మావో సూత్రికరించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సిద్ధాంత నియమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఈ దేశ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయిస్తుంది. ప్రజలనూ, ప్రజల సంస్కృతిని గౌరవించడమే కాకుండా ప్రజల సాంస్కృతిక కార్యకలాపాలలో పీఎల్‌జీఏ విస్తృతంగా పాల్గొంటొంది. వర్గ పంథా, ప్రజా పంథా నియమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నది. ప్రజలకు ఎన్నో విధాలుగా సేవ చేస్తున్నది. ప్రజలకు వైద్య సేవలందిస్తున్నది. ప్రజల ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొంటున్నది. ప్రజల అటవీ ఉత్పత్తుల సేకరణలో పాలుపంచుకుంటున్నది. ఈ విధంగా పీఎల్‌జీఏ ప్రజల ప్రేమను, విశ్వాసాన్ని పెద్దమొత్తంలో పొందింది. పీఎల్‌జీఏను బలోపేతం చేయడం కోసం, ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు తమ పిల్లలను పీఎల్‌జీఏలో భర్తీ చేస్తున్నారు. ప్రజలు పీఎల్‌జీఏతో దృఢమైన సంబంధాన్ని కలిగివుండి పీఎల్‌జీఏ తప్పులను విమర్శించడంలో కూడా వెనుకాడటం లేదు. ఈ విధంగా పీఎల్‌జీఏ ప్రజలతో అడుగడుగు కలుపుతూ బలోపేతమైన ప్రజాసైన్య లక్షణాన్ని పెంచుకుంటున్నది. పీఎల్‌జీఏ ఈ విధంగా పార్టీ, మరియు ఐక్య సంఘటనలను బలోపేతం చేస్తున్నది.

### 6. ప్రశ్న:- పీఎల్‌జీఏలోని మహిళా క్యాడర్ల సాహసోపేతమైన రిపోర్టులున్నాయి. ఈ విధమైన అభివృద్ధి మీరు ఎలా సాధించారు?

**జవాబు:–** మహిళలు సమాజంలో అత్యంత పీడితులుగా వున్నారు. సమాజంలో సగ భాగంగా వున్నారు. వారిలో అసమాన్యమైన శక్తి వుంది. పార్టీ, పీఎల్‌జీఏలు శత్రు వ్యతిరేక పోరాటము, పితృస్వామ్య వ్యతిరేక పోరాటం చేస్తున్నారు. ఈ విషయంలో కొంత అభివృద్ధిని సాధించాము. పార్టీ, పీఎల్‌జీఏ మరియు ఐక్యసంఘటన శ్రేణులలో పితృస్వామ్య వ్యతిరేక పోరాటం ద్వారా మార్పు తీసుకురావడం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాము. వీటి ద్వారా మహిళల శక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తున్నాము. పీఎల్‌జీఏలో పెద్ద ఎత్తున మహిళల భాగస్వామ్యం పెరగటమనేది వారి ఆకాంక్షలను తెలియజేస్తున్నది. అన్ని రంగాలలోను మహిళా నాయకత్వాన్ని పెంపొందించాలనేది మేము కర్తవ్యంగా పెట్టుకున్నాము.

### 7.ప్రశ్న :- మిలటరీ కార్యకలాపాలలో పీఎల్‌జీఏ విధానం ఏమిటీ?

**జవాబు:–** పార్టీ వర్గపంథా, ప్రజాపంథా మీద ఆధారపడి మిలటరీ కార్యకలాపాలకు చెందిన విధానాన్ని తయారు చేసింది. పీఎల్‌జీఏ దానిని అనుసరిస్తున్నది. బూర్జువావర్గ సైన్యంలోకి ఎక్కువ మంది పీడిత వర్గాల నుండే వస్తారు. అందుకనే మేము సాయుధ బలగాల తుపాకులను ప్రజల మీదా కాకుండా వారి యజమానుల మీదే గురిపెట్టండని చెపుతున్నాము. సాయుధ బలగాలకు ఉద్యోగాలను వదిలిపెట్టండని వారికి మేము పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాము. సరెండర్ అయిన శత్రు బలగాలను పీఎల్‌జీఏ నిర్మూలించడం లేదు. శత్రు బలగాల్లో గాయలైన వారికి వైద్యం కూడా చేస్తున్నది. ప్రభుత్వ సాయుధ బలగాలు ప్రజల మీదా, పీఎల్‌జీఏ శ్రేణుల మీద దారుణమైన దాడులు చేసినప్పుడు వాటిని మేము అంతే వేగంగా తిప్పికొడతాము. పోలీసు ఇన్ఫార్మర్లనూ, వర్గ శత్రువులను పీఎల్‌జీఏ అణచివేస్తుంది. పార్టీ యొక్క రాజకీయ నిర్మాణ కర్తవ్యాలలో భాగంగా అన్ని పీడిత వర్గాలను ఐక్యం చేసినట్లుగా శత్రుబలగాలలో వున్న పీడిత శక్తులను కూడా ఐక్యం చేయాలనేది ఒక కర్తవ్యంగా వుంది. ఈ మిలటరీ నియమాలను ఉల్లంఘించిన వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుంది.

### 8. ప్రశ్న:- ఇతర దేశాలలోని మావోయిస్టు పార్టీల ప్రజా సైన్యాలతో పీఎల్‌జీఏకు సంబంధం వుందా?

**జవాబు:–** భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), పీఎల్‌జీఏలు కార్మికవర్గ అంతర్జాతీయతను ఎత్తిపడతాయి. పార్టీతో సిద్ధాంత పరంగా సంబంధం వున్న ఇతర దేశాలలోని కమ్యూనిస్టు పార్టీల సైన్యాలతో పీఎల్‌జీఏకు సిద్ధాంతపరమైన సంబంధం వుంటుంది. గతంలో నేపాల్‌లోని పీఎల్‌జీఏ శ్రేణులకు మన పీఎల్‌జీఏ ట్రైనింగ్ ఇచ్చింది. మన పార్టీ ఈశాన్య రాష్ట్రాల్లోని సాయుధ పోరాటాలకు మద్దతు తెలుపుతుంది. ఫిలిప్పీన్స్, టర్కీ, కుర్దిస్తాన్‌లలో జరుగుతున్న ప్రజాయుద్ధాన్ని మరియు ఇతర సాయుధ పోరాటాల అనుభవాలను అధ్యయనం చేస్తుంది. ఫిలిప్పీన్స్‌లోని ఎన్‌పీఏతోనూ, టర్కీలోని గెరిల్లా సైన్యంతోను మన పీఎల్‌జీఏ సిద్ధాంతపరంగా భుజం భుజం కలిపి నడుస్తుంది.

### 9. ప్రశ్న:- పార్టీ, పీఎల్‌జీఏ మరియు ప్రజలకు మీరు ఇచ్చే సందేశం ఏంటి?

**జవాబు:–** పార్టీ, పీఎల్‌జీఏ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సిద్ధాంతాలను, రష్యా విప్లవోద్యమ అనుభవాలనూ, చైనా, వియత్నాం

తరువాయి భాగం 19వ పేజీలో...

# నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టడం ద్వారానే విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోగలుగుతాం!

మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. జనవరి 27న కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీ.సీ.ఈ.ఏ) సమావేశం ఉక్కు పరిశ్రమతోపాటు, దాని అనుబంధ సంస్థలలో నూటికి నూరు శాతం పెట్టుబడులు ఉపసంహరిస్తున్నట్లు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికనుగుణంగానే ఉక్కు పరిశ్రమ అమ్మకానికి ప్రభుత్వ ఉన్నతాధికారులు దక్షిణ కొరియా కార్పొరేట్ సంస్థ పోస్కో (పోహంగ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ)తో సంప్రదింపులు కూడా జరిపారు. మరోవైపు భారత దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యుడు ఆదానీతో కూడా కొన్ని లావాదేవీలు జరిగాయి. ఇంత జరుగుతున్నా, ఈ విషయాలేవి ఉక్కు పరిశ్రమ కార్మికులకు గానీ, గతంలో ఆ పరిశ్రమవల్ల నిర్వాసితులైన వారికి గానీ, విశాఖ ప్రజలకు గాని ఏ మాత్రం అర్థం కాకుండా తమ విక్రయ కార్యకలాపాలను గుంభనంగా నిర్వహించారు. అయితే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి ఈ విషయాలేమి అర్థం కాలేవనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఈ లోపాయికారి వ్యవహారాలన్నీ నడుస్తున్న క్రమంలోనే నెలన్నరకు విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకానికి సంబంధించిన అధికార ప్రకటన వెలువడింది. దీంతో విశాఖ ఉక్కు పరిశ్రమతోపాటు, విశాఖ నగరమంతా ఒక్కసారి భగ్గుమన్నది. కార్మికుల, నిర్వాసితుల, ప్రజల ఆగ్రహ జ్వాలలు ప్రజ్వరిల్లాయి.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం ప్రారంభమవటంతో అవకాశవాదం మూర్తిభవించిన పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ తామెక్కడ వెనకబడిపోతామేమోనన్ అందోళనతో ఉద్యమానికి మద్దతునిచ్చేందుకూ, నాయకత్వం వహించేందుకు పోటీ పడుతున్నాయి. వాస్తవంగా ఈ పార్టీలన్నీ దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేవే. అలాగే నయాఉదారవాద విధానాలలో భాగంగా అమలయ్యే ప్రైవేటైజేషన్‌కు కూడా ఇవి వ్యతిరేకం కావు. అయితే విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రారంభమైన ప్రజల కదలికను ఈ పార్టీలన్నీ గమనించి, ఆ ప్రజల కదలికనూ, ప్రజాఉద్యమాన్ని రాబోయే ఎన్నికలలో సొమ్ము చేసుకొనేందుకు దానికి మద్దతుగా ముందుకు వస్తున్నాయి, నాయకత్వం వహించేందుకు పోటీ పడుతున్నాయి. ఇటువంటి అవకాశవాద ధోరణితోనే బీ.జే.పీ పార్టీతో సహా పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే ఆందోళనకు దిగుతామంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మాణం చేసి, ప్రధాని వద్దకు అఖిలపక్ష ప్రాతినిధ్యాన్ని పంపుతానంటున్నాడు. ప్రధానికి మొక్కుబడిగా ఒక లేఖ కూడా రాసాడు.

రాష్ట్రంలో పార్లమెంటరీ పార్టీలన్నీ ఇంత ఆర్భాటం చేస్తున్నా, ఆ పార్టీల స్వభావం, వాటి నాయకుల వ్యక్తిగత బలహీనతలు




ఎరిగివున్న మోడీ ప్రభుత్వం మాత్రం, తన నిర్ణయంలో ఎటువంటి సడలింపును ఇవ్వడంలేదు. పార్లమెంటులో వై.ఎస్.ఆర్.సీ.పీ, టీ.డీ.పీలకు చెందిన ఎమ్.పీలు విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌పై అడిగిన ప్రశ్నలకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సూటిగానే సమాధానం చెప్పింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వలన పరిశ్రమ విస్తరణ, సామర్థ్యం పెంపు, ఆధునిక టెక్నాలజీ వినియోగం, మెరుగైన యాజమాన్య పద్ధతులు సమకూరుతాయనీ, దీనివల్ల పెద్దఎత్తున ఉత్పత్తి, ఉత్పాదకత పెరగడమేకాక ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయని బల్లగుద్ది చెప్పింది.

కానీ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తూ, ప్రైవేటీకరణ సాధించే అభివృద్ధినంతా ప్రభుత్వమే ఎందుకు సాధించలేకపోయిందో మాత్రం చెప్పలేదు. మోడీ ఇంకో అడుగు ముందుకేసి 'ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, ప్రైవేటీకరణ'లపై ఏర్పాటైన ఒక వెబినార్‌లో, '50-60 ఏళ్ళ కిందట ప్రభుత్వరంగ సంస్థలు మంచివే కానీ, ప్రస్తుతం వాటికి కాలం చెల్లిందనీ, వాటి భారాన్ని ప్రభుత్వం మోయలేదనీ, కనుక మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం తప్పదని' తేల్చి చెప్పాడు. వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన నాలుగు రంగాల(అణుశక్తి-రక్షణ-అంతరిక్ష రంగం, రవాణా, టెలీ కమ్యూనికేషన్లు, విద్యుత్-ఇంధనం-వివిధ రకాల ఖనిజాలు, బ్యాంకింగ్-ఇన్సూరెన్స్-ఆర్థిక సేవలు)లోని అతికొద్ది సంస్థలను మినహా, మిగిలిన అన్ని ప్రభుత్వరంగ సంస్థల(పీ.ఎస్.యూ)ను అమ్మేస్తామని ప్రకటించాడు. వ్యూహాత్మక రంగాలకు చెందిన సంస్థలలో కూడా అతితక్కువ స్థాయిలో ప్రభుత్వ ప్రమేయం ఉంటుందని వివరించాడు. పీ.ఎస్.యూల విక్రయం ద్వారా రూ॥ 2.5 లక్షల కోట్లను ఆర్జించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమనీ, ఈ ప్రజాధనాన్ని 'సద్వినియోగం' చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించాడు. మొత్తం సారాశంలో మోడీ చెప్పిందేమిటంటే 'ప్రభుత్వ విధి వ్యాపారం చేయడంకాదనీ, వ్యాపారానికీ, వాణిజ్యానికి ఊతమివ్వడమేననే' కల్తీలేని నయాఉదారవాద సిద్ధాంతాన్ని ప్రజలముందుంచాడు.

పార్లమెంటులో నిర్మలాసీతారామన్ ప్రకటనతోపాటు, ప్రధానంగా మోడీ వెబినార్ ప్రకటన వెలువడటంతో ఏ.పీకి చెందిన బీ.జే.పీ, వై.ఎస్.ఆర్.సీ.పీ పార్టీలు సన్నాయి నొక్కులు నొక్కటం ప్రారంభించాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయం కేంద్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగం కనుక, పైగా ఆ పరిశ్రమ నష్టాలతో కూడా నడుస్తున్నది కనుక ప్రైవేటీకరణ తప్పదనీ, అయితే దానిపై ఆధారపడి బ్రతికే కార్మికులకూ, ఇతర శ్రామికులకు ప్రయోజనం కలిగేలా కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకుంటుందని మోసపూరిత వ్యాఖ్యానాలు చేస్తున్నది. ఏ.పీ ముఖ్యమంత్రి జగన్ ముందుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రంకెలు వేసినప్పటికీ, ప్రధానమంత్రి ప్రకటనతో ఒక అడుగు వెనక్కి వేసి, విశాఖ పోరాటకమిటీ నాయకులతో మాట్లాడుతూ 'స్టీల్ ప్లాంట్ మిగులు 7వేల ఎకరాలను అమ్మి అప్పులు తీర్చేయవచ్చని' అన్నాడు. అంతేకాక 'షేర్ మార్కెట్‌లో స్టీల్ ప్లాంట్ వాటాలను లిస్టింగ్‌కు కూడా పెట్టవచ్చునని' ఒక దగుల్బాజీ సూచన కూడా చేసాడు. జగన్ ఇస్తున్న ఈ మధ్యేమార్గపు సలహాలు, సూచనలు అంతిమంగా విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించడానికే తప్ప మరి దేనికీ పనికిరావు. ఆనాడు విశాఖ ప్లాంటును నిర్మించేందుకు ఇళ్ళస్థలాలు, పొలాలు ఇచ్చి జీవిక కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారంలో భాగంగా కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. మొత్తం 16వేల 5 వందల కుటుంబాలకు 'ఆర్' (రీ హాబిలిటేషన్) కార్డ్ కేటాయించారు. ఈ 40 ఏళ్ళలో కేవలం 8వేల 5వందల మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. మిగిలిన 8వేల మందికి తరాలు మారుతున్నా ఇంతవరకూ ఉద్యోగాలు రాలేదు. 'ఆర్' కార్డ్ తాత నుంచి తండ్రికీ, తండ్రి నుంచి మనవడికి బదిలీ అవుతోంది తప్ప, ఉద్యోగాలు రాలేదు. జగన్ ఈ విషయాలను పరిగణలోకి తీసుకోకుండా భూములు అమ్మాలని ఇచ్చిన ఉచిత సలహా ఎవరికి పనికొస్తుంది? ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ వాటాలను లిస్టింగ్‌లో పెడితే జరిగే పరిణామమేమిటీ? గతంలో విశాఖలో ఉన్న పబ్లిక్ రంగ సంస్థ హిందుస్థాన్ జింక్ పరిశ్రమలో 10% వాటాలు అమ్మకంతో ప్రారంభించి జింక్ పరిశ్రమను వేదాంత కార్పొరేట్ కంపెనీకి పూర్తిగా అప్పగించలేదా! నేడు వేదాంత సంస్థ ఆ కంపెనీని మూసివేసి, కార్మికులను వీధులపాలు చేసి, సంస్థకు సంబంధించిన భూములతో రియలెస్టేట్ వ్యాపారం చేస్తూ, వందల, వేల, కోట్ల రూపాయలు సంపాదించడం లేదా! రేపు విశాఖ ఉక్కుకు కూడా ఈగతే పట్టదా! ఈవాస్తవాలన్నీ కళ్ళముందు కనిపిస్తున్నా, జగన్ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఒక ఉచిత సలహాను పారేసి తన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గబుద్ధిని ప్రదర్శించాడు.

ఇక రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీగా ఉన్న చంద్రబాబు విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌పై కేంద్రప్రభుత్వ ప్రకటన వెలువడగానే తీవ్రంగా స్పందిస్తూ, 'విశాఖ ఉక్కును తుక్కు కింద అమ్మేసి, రియలెస్టేట్ వ్యాపారానికి కేంద్రం పూనుకుంద'ని గంభీరంగా మాట్లాడుతూ హైడ్రామాకు తెర లేపాడు. వాస్తవంగా నయాఉదారవాద విధానాలైన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌లను 'అభివృద్ధి' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోకి తీసుకువచ్చి దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు రాష్ట్ర సహజ వనరులనూ, శ్రామికుల శ్రమశక్తిని దోచుకునేందుకు వాటికి దళారీగా పని చేసింది ఈ చంద్రబాబే. నేడు మాత్రం చంద్రబాబుతో సహా, తెలుగుదేశం నాయకులంతా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో తమ ప్రాణాలైన ఇస్తామంటున్నారు. ఇదంతా ఒక నాటకమే. రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నాటికి తమ ఓట్ల బ్యాంకును పెంచుకొనేందుకు చేసే సర్కస్‌ఫీట్లే ఈ హంగామా అంతా. ఇక బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీ.జే.పీతో వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగివున్న పవన్ జనసేన పార్టీ నుంచి పోరాడే ప్రజలు కొత్తగా ఆశించేదేమి ఉండదు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం ముందున్న సవాళ్ళు**

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆరంభమైన ప్రజాఉద్యమం ముందు నేడు అనేక సవాళ్ళున్నాయి. ఇప్పటికే గుంటకాడి నక్కల్లా కాచుక్కూచున్న పార్లమెంటరీ పార్టీలన్నీ ఈ ఉద్యమంలోకి జొరబడి దాన్ని నీరుగార్చేందుకు చేసే కుటిల ప్రయత్నాలు ఒక సవాల్ అయితే, ఆ ఉద్యమాన్ని ఒక స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో నడపటం ఒక ముఖ్యమైన సవాలుగా ఉంటుంది. ఎందుకంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్య ఏ రాజకీయ నేపథ్యం నుంచి ఉత్పన్నమయిందో ఆ రాజకీయ నేపథ్యానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడపకుండా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవటం సాధ్యం కాదు. ఇప్పటికే ఆ ఉద్యమంలో ఒక ముఖ్యమైన భూమికను పోషిస్తున్న వామపక్ష పార్టీలు, వాటి ట్రేడ్ యూనియన్‌లు ఆ ఉద్యమానికి ఒక స్పష్టమైన రాజకీయ లక్ష్యం లేకుండా చేసి, షరామాములన్నట్లు సమస్యకే పరిమితమైన యాదృచ్ఛిక ధోరణితో వ్యవహరిస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని నివారించేందుకు సమస్య తాలుకూ రాజకీయ మూలాల్లోకి వెళ్ళాలి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్నప్పటి నుంచి కేంద్రంలోనూ, రాష్ట్రాలలోను అధికారం నెరిపిన బూర్జువా పార్టీలన్నీ సామ్రాజ్యవాదులకూ, దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవ చేస్తూ వచ్చాయి. ఆ వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడే విధాన పరమైన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటూ వచ్చాయి. మోడీ వెబినార్‌లో మాట్లాడినట్లుగానే 50-60 ఏళ్ళ కింద ప్రభుత్వ రంగ పరిశ్రమలు మంచివే, అవసరమైనవే. ఎందుకంటే అవి దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి లాభాలు దండుకునేందుకు సేవ చేసాయి కనుక. మోడీ ఈ వాస్తవాన్ని మరుగున పరిచినప్పటికీ, ఇది ఒక చారిత్రక సత్యంగా మన ముందు నిలిచింది. ఆ నాటికి భారత దళారీ, నిరంకుశ బూర్జువావర్గం వద్ద పెట్టుబడి సరుకులు (యంత్రాలు వగైరా) తయారు చేసే భారీ పరిశ్రమలు నెలకొల్పేందుకుగానీ, పెద్ద పెద్ద గనులు తవ్వేందుకుగాని పెట్టుబడులు లేవు. కనుక రాజ్యమే ప్రజాధనంతో ప్రభుత్వరంగ భారీ పరిశ్రమలనూ, గనులను ఏర్పాటు చేసి దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి అవసరమైన పెట్టుబడి సరుకులతోపాటు, ముడి సరుకులను కారుచౌకగా అందించింది. ఈ క్రమంలో దేశంలోని దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం (సీ.బీ.బీ) చాలా శక్తివంతమైంది. మరోవైపు 1980ల చివరికల్లా భారతదేశ ఆర్థికవ్యవస్థ గొంతులోతు అప్పుల్లోకి కూరుకుపోయింది. ఈ అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు అప్పటి ప్రధాని పీ.వీ నరసింహారావు ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్‌లు సామ్రాజ్యవాదుల ద్రవ్యసంస్థ ఐ.ఎమ్.ఎఫ్‌ను అప్పుకోసం ఆశ్రయించారు. ఐ.ఎమ్.ఎఫ్ అప్పులు ఇస్తూ, భారత ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సాలెగూట్లోకి గుంజేందుకు విషమ షరతులను పెట్టింది. వాస్తవంగా ఈ షరతులు భారత ప్రజలకు విషమ షరతులేగానీ, ఈ దేశ సీ.బీ.బీ (కాంప్రడార్ బ్యూరాక్రటిక్ బూర్జువా) వర్గానికి మాత్రం 'తంతే గారెలబుట్టలో పడ్డ చందమైంది'. ఈ నేపథ్యంలోనే అంటే ఐ.ఎమ్.ఎఫ్ షరతులలో భాగంగా ఈ దేశ సీ.బీ.బీ వర్గం నయాఉదారవాద విధానాల పేరిట దేశంలోకి విచ్చలవిడిగా జొరబడ్డ సామ్రాజ్యవాదుల పెట్టుబడులకు వాహకంగా ఉంటూ, మరోవైపు ఆ పెట్టుబడులతో మిలాఖతై దేశ సంపదను పందికొక్కుల్లా అడ్డంగా మేసి, 'మహాకాయుడు'గా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో నాడు పబ్లిక్‌రంగ సంస్థలుగా ఉన్న భారీ పరిశ్రమలన్నింటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్నది. అందుకే దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం అభీష్టం మేరకే మోడీ ప్రభుత్వం స్ట్రాటజిక్, నాన్ స్ట్రాటజిక్ అనే తేడా లేకుండా పబ్లిక్‌రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించేందుకు సిద్ధమైంది. అయితే ప్రైవేటీకరణకు సాధికారత పొందేందుకు ఒక వ్యూహాత్మక దృష్టితోనే ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బతీస్తూ వచ్చింది. వాస్తవంగా 2009 వరకు కమ్యూనికేషన్ రంగంలో పీ.ఎస్.యూగా ఉన్న బీ.ఎస్.ఎన్.ఎల్ లాభాలతో నడిచింది. కానీ కాంగ్రెస్ హయం నుండే బీ.ఎస్.ఎన్.ఎల్‌ను నష్టాల ఊబిలోకి నెట్టడం ప్రారంభమై, మోడీ ప్రభుత్వ హయంలో ఆ క్రమం తీవ్రతరమైంది. ముఖ్యంగా ముకేశ్‌అంబానీకి చెందిన జియోకు ప్రాధాన్యతనిచ్చేందుకు బీ.ఎస్.ఎన్.ఎల్‌ను ఒక పథకం ప్రకారం దెబ్బతీసింది. దానికి పెద్ద ఎత్తున ఆస్తులున్నప్పటికీ, బ్యాంకులు ఋణం ఇవ్వలేదు. ఆధునీకరణను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసింది. ఇంకా అనేక పీ.ఎస్.యూలను ప్రైవేటీకరించే పథకంతో వాటికి తమ పథకాలను అమలు చేసే సీ.ఈ.ఓలను నియమించింది. ఇక విశాఖ ఉక్కుకు ఎప్పటినుంచో ప్రత్యేక గనులు కావాలని స్థానిక అధికారులు, కార్మికులు మొత్తుకున్నప్పటికీ, ఏ మాత్రం ఖాతరు చేయకుండా అది నష్టాల్లో నడుస్తున్నదని నేడు వేలెత్తిచూపుతున్నది. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లు, ముడి ఇనుము టన్ను ఒక్కంటికి రూ॥ 1600-1800 మధ్య ఖర్చు పెడుతుంటే, విశాఖ ఉక్కు మాత్రం టన్ను ఒక్కంటికి రూ॥ 5000 ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. నేడు పీ.ఎస్.యూలపై చూపుతున్న ఈ వివక్ష ఇవాల్టిది కాదు. ప్రపంచీకరణ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాం నుంచే ఈ వివక్ష ప్రారంభమైంది. మోడీ ప్రభుత్వ హయాంలో అది మరింత ఊపందుకుంది. ఇంత కుట్ర పూరితంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నప్పటికీ, దేశంలోని 366 పీ.ఎస్.యూలలో 43 మాత్రమే నష్టాల్లో నడుస్తున్నాయి. అయినా మోడీ ప్రభుత్వం పీ.ఎస్.యూల భారాన్ని మోయలేమంటూ మొసలికన్నీరు కారుస్తూ దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు వాటిని తెగనమ్మేందుకు సిద్ధమైంది.

అయితే నాడు పీ.ఎస్.యూలను ఏర్పాటు చేయడంగానీ, నేడు వాటిని ప్రైవేటీకరించడంగాని దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలోకి నడిపించేందుకు ఎంత మాత్రమూ కాదు, కేవలం ఈ దేశ దోపిడీ పాలకవర్గమైన సీ.బీ.బీ, దాని యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే. నాటి నుంచి నేటి వరకు పాలకపార్టీలు రూపొందిస్తున్న విధాన పరమైన నిర్ణయాలన్నీ దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల, వారి యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం మాత్రమే. ఈ వాస్తవాలు నేడు ఎంతగా ప్రజల సాధారణ చైతన్యంలోకి ఇంకిపోయాయంటే ప్రభుత్వ ఆర్డినెన్సులు, చట్టాలు పార్లమెంటులో రూపొందించబడటం లేదనీ, అంబానీ, ఆదాని వగైరా సీ.బీ.బీల అధికార నివాసాలలోనే రూపొందించబడుతున్నాయని ప్రజాఉద్యమాలలో పాల్గొంటున్న ప్రజలు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. విషయాలు ఇంత స్పష్టంగా బహిర్గతమవుతుంటే మోడీ ప్రభుత్వం పీ.ఎస్.యూలను అమ్మడం ద్వారా వచ్చే 2.5 లక్షల, కోట్ల ధనాన్ని ప్రజాసంక్షేమం కోసం ఖర్చు పెడతానంటున్నది. ఇందులో ఏ మాత్రం వాస్తవంలేదనీ, ఆ నిధులన్నీ వ్యాపారానికీ, వాణిజ్యానికి ఊతం ఇవ్వడంలో భాగంగా సీ.బీ.బీ పరిశ్రమలకు ఉద్దీపనల పేరుతో దారి మళ్ళుతాయనే విషయం కూడా ప్రజలకు స్పష్టమే, ప్రజల చైతన్యంలో ఉన్నదే.

పై విషయాలను దృష్టిలో పెట్టుకుని విశాఖలో ప్రారంభమైన ఉద్యమానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునే తక్షణ కర్తవ్యంతోపాటు, నయాఉదారవాద విధానాలను తిప్పికొడుతూ, దేశంలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొలిపే అంతిమ లక్ష్యం కూడా ఉండాలి. ఈ రాజకీయ అవగాహనకు భిన్నంగా దేశంలో రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలు కార్మికవర్గాన్ని ఆర్థికరొంపిలోకి దింపాయి. వారి దివాళాకోరు రాజకీయాల వలన దేశంలో కార్మికవర్గం రాజకీయ స్తబ్ధతకు లోనైంది. ప్రస్తుతం మోడీ ప్రభుత్వ హయాంలో ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులు,

విలువలు మృగ్యమవుతూ, దోపిడీ వర్గాల ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా భావించాలనే శాసనం (ఫాసిజం) ప్రజల గొంతులపై కత్తిలాగా వేలాడుతున్నప్పుడు విశాఖ ఉక్కు ఉద్యమం అన్ని ప్రజా ఉద్యమాలను కలుపుకొని ఒక రాజకీయ మహోద్యమంగా పురోగమించాల్సిన అవసరం నేడెంతో ఉంది.

ఉద్యమం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సవాలేమిటంటే, 1960లలో విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకునేందుకు రాష్ట్రవ్యాపితంగా వచ్చిన స్పందన, సహకారం, సంఘీభావం నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు కనిపించడం లేదనేదే. ఇది కొంత మేరకు వాస్తవం కూడా. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదంపై విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను సాధించేందుకు సాగిన ఆ మహోద్యమం 1960వ దశకంలో జరిగింది. 1960వ దశకం, దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాపితంగా ప్రజల ప్రజాస్వామిక చైతన్యంతో వెల్లువెత్తిన ఉద్యమాల దశకంగా చరిత్రలో నమోదైంది. ఆ దశకంలోనే భారతదేశంలో 'నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం వసంతకాలపు మేఘగర్జన' అయింది. ఈ ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలలో ప్రజలు గొప్ప ప్రజాస్వామిక, సోషలిస్టు చైతన్యంతో కదం తొక్కారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' ఉద్యమం కూడా ఇటువంటి ఉత్తేజంతోనే జరిగింది. ఈ ఉద్యమానికి రాష్ట్ర వ్యాపితంగా ప్రజల క్రియాశీలక మద్దతు లభించింది. 1966 అక్టోబర్‌లో గుంటూరు జిల్లాకు చెందిన తమనంపల్లి అమృతరావు ఆమరణ నిరాహారదీక్షకు కూర్చోవడంతోపాటు, నిరవధిక సమ్మె ప్రారంభమైంది. నవంబర్ 1న 3వేల మందితో జరిగిన ప్రజా ప్రదర్శనపై పోలీసు కాల్పులు జరిగి, 9 ఏళ్ళ బాలుడితో సహా 9 మంది చనిపోయారు. పోలీసులు జరిపిన ఈ క్రూరమైన హత్యాకాండ, పోరాడే ప్రజలను ఏ మాత్రం నిలువరించలేకపోయింది. ఉద్యమం రాష్ట్రవ్యాపితంగా అలముకొంది. పలు చోట్ల ప్రజలు సమరశీలంగా ప్రభుత్వంతో, దాని పోలీసులతో తలపడ్డారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వందలాది మంది విద్యార్థులు పోలీసులతో తలపడగా 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాలలో పోలీసులు జరిపిన కాల్పుల్లో సాయిరెడ్డి చనిపోయాడు. మొత్తంగా ఈ ఉద్యమంలో 32 మంది పోలీసు కాల్పుల్లో అసువులు బాసారు. ప్రజల ఒత్తిడితో 7గురు ఎమ్.పీలు, 67 మంది ఎమ్.ఎల్.ఏలు తమ పదవులకు రాజీనామ చేసారు. హైదరాబద్, గుంటూరు, విశాఖపట్టణం ఇంకా అనేక పట్టణాలు విద్యార్థుల ఆందోళనలతో అట్టుడికిపోయాయి. అందుకే ఆ ఉద్యమం ఒక విస్తృతమైన, సమరశీల మహోద్యమంలా కొనసాగి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచింది. ఆ నాటికి దేశ ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ 1970, ఏప్రిల్ 10న విశాఖలో 'ఉక్కు పరిశ్రమ'ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత 2 దశాబ్దాలకు 1992 ఆగస్టులో స్టీల్‌ప్లాంట్ అధికారికంగా ప్రారంభమైంది.

నేడు అదే స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తుంటే అప్పటి తరహాగా ప్రజలలో విశాలతత్వం, సహకారతత్వం, సంఘీభావం కొరవడి, ప్రస్తుత ఉద్యమానికి తగినంత మద్దతు లభించడంలేదనీ, ప్రజలు ఏ సెక్షన్‌కు ఆ సెక్షన్‌గా, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం వారుగా విభజింపబడి వారిలో సంకుచిత ధోరణులు పెరిగాయనే ఆందోళన కొద్దిమందిలో కనిపిస్తున్నది. వారి ఆందోళనకు భౌతిక పునాది ఉన్నమాట కూడా వాస్తవమే. ప్రస్తుతం రాష్ట్రంలో రాయలసీమ, దక్షిణకోస్తా, ఉత్తరకోస్తా ప్రజలలో భౌగోళిక విభజనే కాకుండా మానసిక విభజన కూడా ఏర్పడి ఉంది. ఇటువంటి మానసిక విభజన ఆ మూడు ప్రాంతాలకే కాకుండా ఇంకా చిన్న చిన్న ప్రాంతాలకూ, వివిధ ప్రత్యేక సామాజిక సెక్షన్లకు విస్తరించి ఉంది. ప్రజలను ఇటువంటి సంకుచిత చట్రాల దిశగా పరిమితం చేయడంలో, 1990ల నుంచి రాష్ట్రంలోకి వ్యాపించిన పోస్టుమాడర్నిస్టు సిద్ధాంత ప్రభావం ఉంది. వాస్తవంగా ప్రాంతాలు, ప్రత్యేక సామాజిక సెక్షన్లు వంటి అస్తిత్వాలు, అస్తిత్వ చైతన్యాలు, వారి పోరాటాలు అంతకు ముందు కూడా ఎంతో కొంత ఉనికిలో ఉన్నవే. అయితే వాటిని సంకుచిత చట్రంలోకి, పార్లమెంటు రాజకీయాల భ్రమల్లోకి నెట్టింది పోస్టుమాడర్నిస్టు సిద్ధాంతమే. అలానే పీడితవర్గ ప్రజలను ఐక్యం కానియకుండా చేసిందీ, వారిని ప్రజాస్వామిక, సోషలిస్టు చైతన్యానికి దూరం చేసింది పోస్టుమాడర్నిజమే. అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక రాజ్యంపై సామరస్య వైఖరిని కలిపించింది కూడా పోస్టుమాడర్నిస్టు సిద్ధాంతమే. దీనికి రివిజనిజం కూడా తోడైంది. అందుకే ఇది సిద్ధాంత సమస్య. ఈ సమస్య కూడా నేడు 'విశాఖ ఉక్కు పరిరక్షణ' ఉద్యమానికి ఒక సవాలుగానే ఉన్నది. ఈ సవాలును ఎదుర్కోవడానికి సిద్ధాంతరంగంలో కూడా పోరాటం అవసరమే. నేడు 'విశాఖ ఉక్కు సంరక్షణ' ఉద్యమంలో ముందు పీఠిన నిలిచే కార్మికవర్గం తమ వర్గసిద్ధాంతమైన మార్క్సిజంపైనా, దాని సూత్రాలపైన ఆధారపడి విశాల పీడిత ప్రజానీకాన్ని ఐక్యం చేసేందుకు తీవ్రమైన కృషి చేయడం చాలా అవసరం. అప్పుడే పోస్టుమాడర్నిస్టు బూర్జువావర్గ సిద్ధాంత ప్రభావం ప్రజలపై నుంచి క్రమంగా తొలిగి పీడిత ప్రజల ఐక్యత ఏర్పడటంతోపాటు, పోరాటం సమరశీలంగా పురోగమిస్తుంది.

ఇక చివరగా ఉద్యమం ఎదుర్కొనే తీవ్రమైన సవాలు ఫాసిజం. మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ముఖ్యంగా అంబానీ, అదానీలకు దేశాన్ని ఒక సురక్షితమైన మార్కెట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ సురక్షితమైన మార్కెట్‌లో వారికెటువంటి అవరోధాలు వుండకూడదు కనుక, అందుకవసరమైన చట్టాలను రూపొందిస్తున్నది. ఇప్పటికే పెద్దనోట్ల రద్దు, జీ.ఎస్.టీ, మూడు సాగు చట్టాలు, 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా బదిలీ, బ్యాంకుల ప్రైవేటీకరణ, పీ.ఎస్.యూల ప్రైవేటీకరణ ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లిస్టు ఒక పెద్ద చాంతాడంత అవుతుంది. మరోవైపు ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ సెక్షన్ల ప్రజలు మునుపెన్నడూ లేనంతగా ఉద్యమబాట పడుతున్నారు. ఆ ఉద్యమాలు దేశవ్యాపిత, సమరశీల స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. ఈ స్థితి సామాజిక సంక్షోభపు తీవ్రతను వ్యక్తీకరిస్తున్నది. ఈ సామాజిక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మోడీ ఇప్పటికే అనేక 'మంత్ర'లను ప్రయోగించాడు. అవన్నీ విఫలమైనాయి. ఇప్పటికీ 'అభివృద్ధి మంత్ర', 'ఆత్మ నిర్భర్ మంత్ర' అంటూ మరికొన్ని 'మంత్ర'లను ఉపదేశిస్తున్నాడు. వీటి బండారాన్ని కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో దోపిడీ పాలకవర్గాలకు

మిగిలిన ప్రత్యామ్నాయం మతం, జాతి, 'దేశభక్తి'ల పేరుతో ప్రజలలో భావోద్రేకాలను ప్రేరేపిస్తూ, ఒక కృత్రిమ, బలవంతపు ఐక్యతను తెచ్చేందుకు ప్రయత్నించడమూ, ఈ కృత్రిమ, బలవంతపు ఐక్యత ఆధారంగా దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు దోచుకునేందుకు భారతదేశాన్ని సురక్షితమైన మార్కెట్ (నయాభారత్ లేదా హిందూరాజ్యం)గా మార్చడమూ, ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా ఉన్నవారిని నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ఉంటుంది. దీనినే 'ఫాసిజం' అంటారు. ఈ క్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ఆర్.ఎస్.ఎస్ మార్గదర్శకత్వంలో పని చేస్తున్న మోడీ ప్రభుత్వం ఒక వైపున బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదాన్నీ, హిందూ సాంస్కృతిక జాతీయవాదాన్నీ, దేశభక్తిని ప్రజలలో ప్రేరేపిస్తూ, వాటి ఆధారంగా ప్రజలలో ఏర్పడిన ఒక మందబలాన్ని చూసుకొని సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక సంస్కరణలను అత్యంత వెరటుగా అమలుచేస్తున్నది. మరోవైపు తన విధానాలను వ్యతిరేకిస్తున్న కార్మికులనూ, రైతాంగాన్నీ, దళితులనూ, మహిళలనూ, మతమైనారిటీలనూ, పీడిత జాతులనూ, ప్రజాస్వామికవాదులనూ, మేధావులను తీవ్రంగా అణచివేస్తున్నది. ప్రజాఉద్యమాలపైనా, విప్లవోద్యమంపైనా, జాతుల పోరాటాలపైన అత్యంత క్రూరంగా దాడులు చేస్తున్నది. ఇప్పటికే ఎన్.ఐ.ఏ, ఊపా వంటి క్రూరమైన ఫాసిస్టు సంస్థలకూ, చట్టాలకు మరింత పదునుపెట్టి ప్రయోగిస్తున్నది. మరోవైపు ఆర్.ఎస్.ఎస్, వీ.హెచ్.పీ, భజరంగ్‌దళ్ వంటి హిందూమతోన్మాద సామాజిక ఫాసిస్టు సంస్థలు పెట్రేగిపోతున్నాయి. ఈ ధోరణి మరింత వేగంగా పెరిగే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితులలో 'విశాఖ ఉక్కు పరిరక్షణ' ఉద్యమమైనా, మరే ప్రజాఉద్యమమైన విజయవంతంగా పురోగమించాలంటే సంబంధిత నాయకత్వం ఫాసిజం సవాలును ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంకావాలి.

**ముగింపు**

'విశాఖ ఉక్కు పరిరక్షణా' ఉద్యమంలో ముందుపీఠిన నిలబడి పోరాడుతున్న కార్మికవర్గం ఈ సందర్భంగా తమ చారిత్రక కర్తవ్యాన్ని మననం చేసుకోవాలి. ప్రస్తుత పరిస్థితులల్లో 'విశాఖ ఉక్కు పరిరక్షణా' ఉద్యమం కేవలం ఆ డిమాండ్‌పైనే, అక్కడి ప్రజలతోనే పోరాడితే సాధ్యమయ్యేది కాదు, ఆ ఉద్యమ విజయం పైన చెప్పుకున్నట్లుగా అనేక సవాళ్ళను ఎదుర్కోవడంపై ఆధారపడి ఉంది. అలాగే దేశంలో జరుగుతున్న ప్రజాపోరాటాలను సమన్వయించుకొని ఒక ప్రజాపోరాట వెల్లువను సృష్టించడంపై ఆధారపడి ఉంది. ఆ ఉద్యమానికి తక్షణ, అంతిమ లక్ష్యాలను రూపొందించుకోవడంపై కూడా ఉద్యమ విజయం నిర్ణయించబడుతుంది. ఈ కర్తవ్యాలనూ, లక్ష్యాలను తమ చారిత్రక కర్తవ్యంలో భాగంగా చేసుకొని 'విశాఖ ఉక్కు పరిశ్రమ' కార్మికులు పురోగమిస్తారని ఆశిద్దాం!

**ప్రోగ్రాం**

*ప్రియమైన కార్మికులారా, ప్రజాస్వామికవాదులారా!*

రాజ్యం అత్యంత ప్రతీఘాతుకంగా మారిన నేపథ్యంలో, కింద ఇవ్వబడిన నినాదాలు కేంద్రంగా మహోద్యమాన్ని నిర్మించండి. ఏ ఉద్యమమైనా సమరశీలంగా పురోగమించాలంటే బలమైన రాజకీయ నాయకత్వం అవసరం. అటువంటి నాయకత్వం కార్మికవర్గంలోని పురోగామి శక్తుల నుంచే ఉద్భవిస్తుంది. అలాగే నిజమైన విప్లవకర కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అటువంటి నాయకత్వాన్ని అందిస్తుంది. ఈ నాయకత్వంలో ఒక బలమైన, విస్తృతమైన ఐక్యవేదికను ఏర్పర్చాలి. ఈ ఐక్యవేదికలో విస్తృత ప్రాతిపదికన ప్రజాస్వామిక సంస్థలను చేర్చుకోవాలి. విడిగా ఉండే ప్రజాస్వామికవాదులను కలుపుకోవాలి. బూర్జువా పార్టీలతో ఏర్పడే అఖిలపక్ష కమిటీతో ఐక్యకార్యాచరణ కొనసాగించాలి. మనం ఒక బలమైన శతృవుతో పోరాడుతున్నాము కనుక, ఈ పోరాటంలో ఏ కొద్ది సమయమైనా కలిసివచ్చే శక్తులుంటే వారిని కలుపుకుపోవాలి. అదే సందర్భంలో పోరాటాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించే దుష్టశక్తులను పసిగట్టి వారిని బహిర్గతపర్చాలి. ఉద్యమం నుంచి వేరుచేయాలి. మరో విషయమేమిటంటే దేశంలో కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు రాజకీయ, ఆర్థిక విధానాల(సీ.ఏ.ఏ, ఎన్.ఆర్.సీ, మూడు సాగుచట్టాలు, నూతన విద్యావిధానం వగైరా చట్టాలు)కు వ్యతిరేకంగా ప్రజాందోళనలు జరుగుతున్నాయి. ఈ ఆందోళనలను విశాఖ ఉక్కు పరిరక్షణా ఉద్యమం సమన్వయించుకోవాలి. ఇలా సమన్వయించుకోవడం ద్వారానే దేశంలో ఒక ప్రజాఉద్యమ వెల్లువ ఏర్పడి అది ఈ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచగలుగుతుంది. అలాగే అంతర్జాతీయ శ్రామికవర్గం మద్దతును పొందేందుకు ప్రయత్నించాలి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రజాస్వామికవాదుల, పర్యావరణవాదుల, మేధావుల, కళాకారుల మద్దతులను సోషల్ మీడియా ద్వారా కోరాలి.

ప్రధానంగా దేశంలో బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజం, సామ్రాజ్యవాద గ్లోబలైజేషన్‌కు పూర్తి స్థాయిలో సేవచేసేందుకు సిద్ధపడి, ప్రజలపై భీభత్సమైన దాడికి పూనుకున్న చారిత్రక నేపథ్యంలో, విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకునే తక్షణ లక్ష్యాన్ని సాదించేందుకు ఒక బలమైన, విస్తృతమైన దీర్ఘకాలిక స్వభావం కలిగిన నయా ఉదారవాద వ్యతిరేక రాజకీయ ఉద్యమానికి సిద్ధపడాలని విజ్ఞప్తి చేస్తున్నాం!

**ఉద్యమ నినాదాలు**

- విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకించండి!
- ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి!
- రీ-హాబిలిటేషన్ కార్డుదారులందరికీ పరిశ్రమలో ఉద్యోగం ఇవ్వాలి!
- కార్మికవర్గానికి వ్యతిరేకంగా 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకించండి!
- రైతువ్యతిరేక 3 సాగుచట్టాలను తిప్పికొట్టండి!
- పోస్టుమాడర్నిజం, రివిజనిజాలకు వ్యతిరేకంగా పోరాడండి!
- నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి!
- నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయండి!!

**ఆంధ్ర ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# పుకార్లు, మాటల యుద్ధంతో శత్రువును హడలుగొట్టి నిజమైన యుద్ధంలోకి దిగకముందే ఓడించాలి

**గమనిక**

ఈ వ్యాసం 'మావోజెడాంగ్ యుద్ధకళ' అనే పుస్తకంలోనిది. దీనిని 'లియుజికున్' అనే సైనిక వ్యూహ శాస్త్ర నిపుణుడు రాసాడు. ఈ పుస్తకంలో 48 వ్యాసాలున్నాయి. ఇందులోని ప్రతి వ్యాసమూ యుద్ధకళకు సంబంధించి అనేక విషయాలను తెలియజేస్తాయి. అంతేకాదు, ఈ వ్యాసాలు కామ్రేడ్ మావో గొప్ప సైనిక వ్యూహశాస్త్ర నిపుణుడనే విషయాన్ని మనకు తెలియజేస్తాయి. ఈ వ్యాసాలను ప్రతి బులిటెన్‌లో ఒకటి చొప్పున ప్రచురించేందుకు ప్రయత్నిస్తాము. ఈ వ్యాసాలు యుద్ధకళకు సంబంధించిన అవగాహనను మనకు పెంపొందిస్తాయి. కనుక మన పార్టీ నేతృత్వంలో జరుగుతున్న గెరిల్లా యుద్ధం (ప్రజాయుద్ధం)లో భాగస్వాములైన గెరిల్లా యోధులు/యోధలందరూ ఈ వ్యాసాలను శ్రద్ధగా అధ్యయనం చేయాలి. అధ్యయనం చేయడమే కాదు, యుద్ధక్షేత్రంలో వాటిని సృజనాత్మకంగా అమలు చేయాలి.

కామ్రేడ్ మావో చైనా కమ్యూనిస్టు పార్టీకి నాయకుడుగానూ, మిలటరీ కమీషన్‌కి సుప్రీం కమాండర్‌గాను ఉండినాడు. మొదట ఆయన కొమింగ్‌టాంగ్ సైన్యంలో చేరాడు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీకి 'ఎయిత్ రూట్ ఆర్మీ' పేరుతో పిలవబడే ప్రజా విముక్తి సైన్యం (ఎర్రసైన్యం) ఉనికిలో లేదు. 1911 అక్టోబర్ 10న జరిగిన ఊచాంగ్ తిరుగుబాటు చైనా దేశం మొత్తాన్ని ప్రభావితం చేసింది. ఈ తిరుగుబాటు మంచూ లేదా కింగ్ సామ్రాజ్యాన్ని కూలదోసి, చైనా రిపబ్లిక్‌ని ఏర్పర్చింది. ప్రాదేశిక రాజధానిగా ఉన్న హూనాన్‌లో మొదట ఈ తిరుగుబాటు చెలరేగింది. అప్పుడు అక్కడ ఉద్రేకపూరిత రాజకీయ వాతావరణం ఏర్పడింది. మంచు గవర్నర్ యాంగ్‌వెండింగ్, చాంగ్‌షా నగరంలో కర్ఫ్యూ విధించినప్పటికీ, విప్లవపార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ నగరానికి వెలపల, లోపల రహస్యంగా పని చేసారు.

ఒక ప్రాంతానికి రాజధాని నగరమైన జింగ్‌జియాంగ్ మిలటరీ స్కూల్‌లో కామ్రేడ్ మావో విద్యార్థిగా ఉన్నాడు. అక్కడి ప్రిన్సిపాల్ అనుమతితో ఒక రివల్యూషనరీ పార్టీ కార్యకర్త ఒకరోజు ఉద్వేగభరిత ఉపన్యాసాన్ని ఇచ్చాడు. చాలా మంది విద్యార్థులు ఆ ఉపన్యాసానికి ప్రేరేపితులై దానికి మద్దతు ప్రకటించారు. మంచు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు రిపబ్లిక్ స్థాపనలో పాల్గొన్నారు. కామ్రేడ్ మావో కూడా ఆ ఉపన్యాసానికి ప్రేరేపితుడై హూబె రాష్ట్రానికి వెళ్ళి విప్లవ సైన్యంలో చేరాలనుకున్నాడు. ఆ విప్లవ సైన్యానికి లీ యాన్‌హాంగ్ గవర్నర్‌గా ఉండినాడు. అయితే రవాణా సమస్యల వలన కామ్రేడ్ మావో అక్కడికి పోలేకపోయాడు. ఆ తర్వాత హూనాన్‌లో ఒక తిరుగుబాటు విజయవంతం అయింది. ఆ సమయంలో చాంగ్‌షాలో విద్యార్థుల సైన్యం తిరుగుబాటులో పాల్గొన్నది. ఇందులో మావో పాల్గొనలేదు. ఎందుకంటే అది అంత ఐక్యంగా లేదని ఆయన భావించాడు. ఆయన రెగ్యులర్ రివల్యూషనరీ సైన్యంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అదే ఆ తర్వాత కుమింగ్‌టాంగ్ సైన్యంగా జాతీయ విప్లవ సైన్యం పేరుతో చలామణి అయ్యింది.

కామ్రేడ్ మావో సైన్యంలో చేరిన తర్వాత, హూనాన్‌లోని 50వ రెజిమెంట్‌లో మొదటి బెటాలియన్‌లోని లెఫ్ట్ కంపెనీలో సైనికుడిగా చేరాడు. అప్పుడు నెలకు 7 డాలర్లజీతం ఇవ్వబడింది.

6 నెలల కాలం ఆ సైన్యంలో సేవలందించిన తర్వాత ఒక్క పోరాటంలో కూడా పాల్గొనకపోవడంతో అసంతృప్తి చెంది దాన్ని వదిలేసాడు. 1916 అక్టోబర్‌లో విద్యార్థుల ఔవుత్సాహిక వాలంటరీ ఆర్మీ అనే దాన్ని హూనాన్‌లో మొదటి నార్మల్ స్కూల్ అనే సైనిక స్కూల్‌ని స్థాపించారు. దీంట్లో మావో చేరాడు. ఇది కూడా ఇరెగ్యులర్ సైన్యమే. కాకపోతే ఇక్కడ దేశభక్తి గురించీ, మిలటరీ స్పిరిట్ గురించి ప్రేరణ ఇచ్చేవారు. అలాగే జాతీయ విద్యావిధానంలో భాగంగా మిలటరీ వ్యూహాన్ని అధ్యయనం చేసేవారు. విద్యార్థి వాలెంటరీలు ఆ స్కూల్లో రెండు కంపెనీలతో కూడిన ఒక బెటాలియన్‌ని నిర్మించారు. మావో దాంట్లో చేరి ఒక కంపెనీకి కమాండర్‌గా ఎన్నికయ్యాడు.

1917 నవంబర్ 20న ఈ వాలంటరీ సైన్యం మావో నాయకత్వంలో ఉత్తర యుద్ధ ప్రభువుల సైన్యాన్ని ఓడించి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నది.

మావో నాయకత్వాన జరిగిన ఆ యుద్ధ చర్యను మావో స్నేహితుడైన జెవోషియావో ఈ క్రింది విధంగా వర్ణించాడు.

"ఉత్తర యుద్ధ ప్రభువుల 8వ డివిజన్‌కు చెందిన సైనికులు జియాంగ్‌టాన్ యుద్ధంలో ఓడిపోయి చాంగ్‌షా వైపు రిట్రీట్

అవుతున్నట్లుగా ఒక రోజు మధ్యాహ్న సయమంలో వాలెంటరీ సైన్యానికి తెలిసింది. ఆ సైనికులు వాలెంటీర్ల స్కూల్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో కోతిరాళ్ళ కొండ దగ్గర ఉన్నట్లు తెలిసింది. ఆ సైనికులు ముందుకు పోవడానికి ధైర్యం చాలక అక్కడున్న రైతుల దగ్గర ఆహారాన్ని తీసుకొని తింటున్నట్లు తెలిసింది. వాళ్ళు ఆకలితో ఉన్నట్లూ, బాగా అలసిపోయి ఉన్నట్లూ, భయకంపితులై ఉన్నట్లు చాంగ్‌షాకు ఇంకా విప్లవ సైన్యం రాని విషయం వారికి తెలియని పరిస్థితిలో ఉన్నట్లు ఆ స్కూల్‌లో ఉన్న సైన్యానికి తెలిసింది. మావో వారి పరిస్థితులను అర్థం చేసుకొని వారిని తేలిగ్గా ఓడించవచ్చనే నిర్ధారణకు వచ్చాడు. వాలెంటరీ సైన్యంలోని 200ల మంది ధైర్యంగా ఉన్నవారిని రోజువారి డ్రిల్ చేసే కట్టే తుపాకులు పట్టుకొని స్కూల్‌కి వెనక ఉన్న మియావోగావో కొండపై కూర్చొనమని చెప్పాడు. మావో స్థానిక పోలీస్టేషన్ నుండి కొంత మందిని ఆయుధాలు పట్టుకొని వచ్చి కొద్ది దూరంలో ఆంబుష్‌కు కూర్చొవాలని పోలీస్టేషన్ అధికారిని అభ్యర్థించాడు. ఆ సాయంత్రం ఉత్తరయుద్ధ ప్రభువుల సైనికులు వీరు ఆంబుష్ కూర్చొన్న వైపుగా ముందుకు ప్రయాణం సాగించారు. ఆ సయమంలో తుపాకులున్న పోలీసులను సైన్యం మీద కాల్పులు జరవవలసిందిగానూ, తుపాకులు లేనివారి(కొండమీద ఉన్నవారిని)ని టపాసులు పేల్చమని ఆదేశించాడు. ఆ తర్వాత "పూ లియాంగ్ జో పారిపోయాడు, గాంగ్‌జీ నగరంలో మా సైన్యం ఉంది. మీ తుపాలకులను మాకు స్వాధీనం చేసి, మీ ప్రాణాలను కాపాడుకోండి" అని పెద్దగా కేకలు పెట్టారు. దీంతో భయోత్పాతానికి గురైన సైనికుల దగ్గరకు ఒక ప్రతినిధిని పంపించి, చర్చించి వారి ఆయుధాలను మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్కూల్‌లోని వాలెంటరీ విద్యార్థులు మొత్తం ఆయుధాలను స్వాధీనం చేసుకొని స్కూల్‌లోకి తీసుకెళ్ళారు. తుపాకులిచ్చిన సైనికులందరిని స్కూల్ ఆట స్థలంలో నిద్రించమని చెప్పారు. ఆ తర్వాత రోజు ఆ నగరంలో ఉన్న వ్యాపార ప్రముఖుని ద్వారా ఆ సైనికులకు డబ్బులిచ్చి పంపించేసారు. ఈ చర్య ద్వారా ధైర్యాన్నీ, పరిస్థితులను ఉపయోగించుకొని శత్రువును ధైర్యంగా దెబ్బకొట్టే ఎత్తుగడలు ఆయనలో ఉన్నాయని రుజువు చేసింది. ఆయన సాధారణ వ్యక్తి కాదనీ, అసాధారణ యోధుడని అక్కడివారు చెప్పుకున్నారు. మావో స్నేహితుడైన చౌ యూన్ చన్ ఆ సైనికులు కాల్పులు జరిపితే ప్రమాదం జరగదా! అని అడిగాడు. దానికి మావో ఈ విధంగా జవాబు చెప్పాడు. "ఓడిపోయిన సైనికులు ఒకవేళ దాడి చేయాలంటే నగరానికి పోవాలి. చేసేవాళ్ళయితే ఆ రాత్రే చేసేవాళ్ళు. అందుకనే వాళ్ళని మైదానంలో పెట్టాము. పైగా వారు అలసిపోయి నిరుత్సాహపూరితంగా వున్నారు. అందుకనే వాళ్ళు వెంటనే సరెండరైపోయారు. మావో తన జీవితంలో మొదటిసారి పాల్గొన్న యుద్ధచర్యలో అసాధారణ తెలివితేటలని ఉపయోగించాడు. ''శత్రువును ప్రధానయుద్ధరంగంలోకి దిగకముందే లొంగదీసుకోవడం" అనేది సుంజు చెప్పిన యుద్ధనీతిలో ఒక అంశం. ఈ అంశాన్ని మావో స్కూల్లో అధ్యయనం చేసి ఆచరణలో అమలు జరిపాడు. క్రీ.శ 383లో తూర్పు జిన్ సామ్రాజ్యానికి చెందిన జీజువాన్‌కూ, క్విన్ రాజ్యానికి చెందిన ఫూజియాన్‌కు మధ్య జరిగిన యుద్ధంలో జీ జువాన్ అనే సైనిక జనరల్ నిర్వహించిన పాత్రకు మావో ప్రేరేపితుడయ్యాడు. క్విన్ నగరాన్ని పట్టుకోవడం కోసం జనరల్ జీ జువాన్ అసాధారణ రీతిలో తన సైన్యాన్ని మోహరించాడు. ఫూజియన్ మరియు అతడి సోదరుడు కలిసి కోట చుట్టూ తమ సైన్యాన్ని మోహరించినప్పటికీ ఎదుటివారి వ్యూహానికి చిత్తైపోయారు. వీరికెదురుగా జీ జువాన్ కొండలమీద చెట్ల పొదలు కూడా శత్రు సైనికుల్లాగా కలిపించేలా చేసాడు. చివరికి ఫూజియన్ అతడి సోదరుడు ఓడిపోయారు. జీ జువాన్ యుద్ధవ్యూహాన్ని మావో నేర్చుకొని మొదటి దాడిలోనే విజయాన్ని సాధించాడు. 1918లో ఉత్తర, దక్షిణ యుద్ధ ప్రభువుల మధ్య యుద్ధం బ్రద్దలైంది. జాంగ్ జింగ్, చాంగ్‌షా నగరాన్ని ఆక్రమించాడు. మావో మరికొంత మంది మద్దతుతో విద్యార్థి వాలెంటీర్ల సైన్యాన్ని సంఘటిత పరిచి ఆ స్కూల్ పరిరక్షణ కోసం నియమించాడు. దానికి తాను కెప్టెన్‌గా ఉన్నాడు. మొదట నగరంలో భయపూరిత వాతావరణం ఏర్పడింది. విద్యార్థులను సంఘటిత పరిచి ఇంకా ఇతర స్కూళ్ళ నుండి విద్యార్థులను జమచేసి శాంతి పరిరక్షణ గార్డులను తయారు చేసి ఉత్తరసైన్యం వచ్చేవరకు నగర వీధులలో పెట్రోలింగ్ చేయించాడు. తర్వాత హూనాన్ నగరంలో యుద్ధం మొదలైన తర్వాత తుపాకీ పేలుళ్ళ శబ్దాలకు ప్రజలు నిద్రలో నుంచి మేల్కొన్నారు. విద్యార్థులు మంచి పట్టుదలతో, సామర్థ్యంతో స్కూళ్ళను కాపాడారు. మధ్య మధ్యలో యుద్ధం ఆగిపోయినప్పుడు వివిధ విభాగాల విద్యార్థుల ఆటపాటలతో ఆనందాన్ని అనుభవించారు.

12వ పేజీ తరువాయి భాగం...

విప్లవోద్యమ అనుభవాలనూ, ప్రస్తుతం కొనసాగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధ అనుభవాలను అధ్యయనం చేయాలి. అవగాహనను పెంచుకోవాలి. యుద్ధాన్ని నడపడంలో చొరవను, నైపుణ్యాన్ని పెంచుకోవాలి. పార్టీ కమిటీలు, కమాండ్లు దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి సంబంధించిన నియమాలను ఇక్కడ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించేదానికి ప్రాధాన్యతనివ్వాలి. 50 సంవత్సరాల మన విప్లవోద్యమ అనుభవాలనూ, ముఖ్యంగా గత 20 సంవత్సరాల గెరిల్లా యుద్ధ చర్యలనూ, రాజకీయ కార్యకలాపాలనూ, ప్రజలలో పని వంటి విషయాలను ఖచ్చితంగా అధ్యయనం చేయాలి. మన శక్తిని కూడగట్టుకొని మారిన పరిస్థితులకనుగుణంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని దేశంలో మూలమూలలకు విస్తరింపజేయాలి. అప్పుడే మనం తాత్కాలిక సెట్‌బ్యాక్ నుండి బయటపడి పెద్దపెద్ద విజయాలు సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది. పీడితవర్గ ప్రజలు, పీడిత సామాజిక సెక్షన్లు, జాతులు మన పార్టీ లక్ష్యాన్ని, ఉద్దేశాలను, రాజకీయ లైన్‌ను అర్థం చేసుకోవాలి. ఒక గొప్ప శక్తిగా మనం తయారవడానికి ఒక నిజమైన ఐక్య సంఘటనలో ప్రజలను ఐక్యం చేయాలి. దేశంలోని 135 కోట్ల ప్రజల విముక్తి కోసం ఇదే ఏకైక మార్గం.

సిద్ధాంత వ్యాసం

# అధికార మార్పిడి తర్వాత దేశ సామాజిక వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు

*ఈ వ్యాసం 'భారతదేశ ఉత్పత్తి సంబంధాలలోని మార్పులు - మన రాజకీయ కార్యక్రమం' అనే దస్తావేజు నుంచి తీసుకోబడింది. ఈ దస్తావేజుని సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ జనవరి 2021లో, తన అధికారిక దస్తావేజుగా విడుదల చేసింది. ఈ దస్తావేజులో చెప్పబడిన అంశాలన్నింటి సంశ్లేషణగా ఈ భాగం రూపొందించబడింది. ఈ భాగా (వ్యాసం)న్ని చదవడం ద్వారా దస్తావేజులో చెప్పబడిన అంశాలను ప్రాథమికంగా అర్థం చేసుకోవచ్చు. తర్వాతనైనా ఆ దస్తావేజును కూలంకషంగా అధ్యయనం చేయాలి.*

*- (తెలుగు దస్తావేజు 190 పేజి నుంచి 206వ పేజి వరకు)*

1970ల ఆరంభం నుంచి సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా సార్వత్రిక సంక్షోభ ప్రభావంలో కూరుకుపోవడం, 1980లలో మరింత తీవ్రతరమైన ప్రపంచీకరణ విధానాలు చేపట్టడం, తన సంక్షోభ భారాన్ని భారతదేశం వంటి అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలపై మోపిన కారణంగా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులు, పీడిత ప్రజలకూ మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతూ వచ్చింది. ఈ డాక్యుమెంటులో విస్తారంగా పేర్కొన్నట్లు సామ్రాజ్యవాదం దిశానిర్దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల ప్రభుత్వాలు 1990ల ముందూ, ఆ తర్వాతా మన దేశంలో అమలు చేసిన విధానాల ఫలితంగా ఆర్థిక సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. పీడిత వర్గాలైన కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువావర్గంపై, మహిళలు, దళితులు, ఆదివాసీలు, మతమైనారిటీలు వంటి పీడిత సెక్షన్లపై, కశ్మీర్, ఈశాన్య జాతులపై దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష తీవ్రరూపం తీసుకున్నాయి. గత ఏడు దశాబ్దాలలో భారత ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పుల ఫలితంగా దేశంలో ఉత్పత్తి శక్తుల స్థితిలో, ఉత్పత్తి సంబంధాలలో, వివిధ వర్గాల మధ్య సంబంధాలలో, వర్గ వైరుధ్యాలలో సంక్షిప్తంగా ఈ కింది మార్పులు చోటు చేసుకున్నాయి:

1. బొంబాయి ప్లాన్‌కు అనుగుణంగా గత ఏడు దశాబ్దాలలో వివిధ కేంద్ర, రాష్ట్రాల్లోని దళారీ ప్రభుత్వాలు సామ్రాజవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు అనుకూలమైన పలు ప్రణాళికలు, విధానాలు చేపట్టాయి. ప్రపంచీకరణ కాలంలో ఈ విధానాలు వ్యవస్థీకృతమయ్యాయి.

   ప్రపంచ ద్రవ్య పెట్టుబడి పలు రంగాలలో భూమండలంపై నివసించే పీడిత జాతుల, ప్రజల వినాశనాన్ని కొని తెచ్చే ఏడు తీవ్ర సంక్షోభాలను సృష్టించింది: ఆర్థిక సంక్షోభం, ఉపాధి సంక్షోభం, పర్యావరణ/జీవావరణ సంక్షోభం, ఇంధన సంక్షోభం, బలవంతపు వలస జనాభా సంక్షోభం, సామాజిక-సాంస్కృతిక సంక్షోభం, రాజకీయ-సైనిక సంక్షోభం. వెనుకబడిన దేశాల పరాధీనతను, బానిసత్వాన్నీ, లూటీని తీవ్రతరం చేసింది. ఆర్థిక అసమానతలు అత్యంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పేదరికం, నిరుద్యోగం, ఆకలి, స్వచ్ఛమైన గాలి, నీరు లభించకపోవడం, మౌలిక హక్కులను, పౌరహక్కులను కాలరాయడం, శిక్షలు, చిత్రహింసల రేటూ పెరిగిపోతున్నది. యుద్ధాల వల్ల, హింసాత్మక ఘర్షణల వల్ల చనిపోయినవారు, గాయపడ్డవారు, నిర్వాసితుల సంఖ్య పదుల లక్షలకు పెరిగింది.

   అందులో భాగంగా దేశీయ పరిశ్రమలలో పూర్తి విదేశీ భాగస్వామ్యాన్ని, అదుపులేని ప్రపంచ ద్రవ్య పెట్టుబడుల రాకపోకలను, వాటిపై సామ్రాజ్యవాద ఎంఎన్‌సీ/సంస్థల నియంత్రణను అనుమతించడం, విదేశీ టెక్నాలజీపై ఆధారపడడం ద్వారా దేశాన్ని మరింత పరాధీనంగా మార్చాయి. సామ్రాజ్యవాద అంతర్జాతీయ గుత్త సంస్థలు, దేశంలో వాటి దళారీ కంపెనీలు ఎగుమతి ఆధారిత, దిగుమతి ఆధారిత పరిశ్రమలలో, ప్రత్యేకించి ఔట్‌సోర్సింగ్ పరిశ్రమల్లో, అగ్రిబిజినెస్ కంపెనీల్లో శ్రమశక్తిని, ఉత్పత్తులను, సేవలను, ప్రత్యేకించి ముడిపదార్థాలను నిరంతరం కొల్లగొడుతున్నాయి. వివిధ సామ్రాజ్యవాద దేశాల ఎంఎన్‌సీలు, టీఎన్‌సీలతో జాయింట్ వెంచర్లు, విదేశీ అనుబంధ పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు, 'సహాయం', గ్రాంటులు, అప్పులు పెరిగిపోయాయి. రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది.

పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అనే దోపిడీ విధానాన్ని మరింత విస్తరించి అమలు చేస్తున్నారు. ఇందులో ఫ్లాగ్‌షిప్ పథకాలు (భారతమాల పథకం, సాగరమాల పథకం, ప్రత్యేక రవాణా కారిడార్ పథకాలు వంటి) అమలవుతున్నాయి. ఇది ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు సృష్టించిన రవాణా-కేంద్రిత అభివృద్ధి అనే భావనలో భాగమే. పీపీపీ ప్రాజెక్టు కంపెనీలతో పాటు స్టార్టప్‌లు, లైట్ అస్సెట్ మోడల్ కంపెనీలను స్థాపించడం ద్వారా అంతర్జాతీయ గుత్త సంస్థలు, వాటి దళారీ కంపెనీలు కార్మికుల్ని తీవ్రంగా దోపిడీ చేస్తూ సూపర్ లాభాలు ఆర్జిస్తున్నాయి.

సంఘటిత రంగంలో, డీ-ఇండస్ట్రియలైజేషన్, డీ-రెగులేషన్, పబ్లిక్ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ పెద్దెత్తున చేస్తుండడంతో ఆ రంగాలు క్షీణించిపోతున్నాయి. అసంఘటిత రంగం, ప్రైవేటురంగం ప్రధాన రంగాలుగా మారాయి. దీంతో కార్మికుల నిజవేతనాలు తీవ్రంగా పడిపోతున్నాయి. వారు పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాచివేయబడుతున్నాయి. కార్మికుల క్యాజువలీకరణ, కాంట్రాక్టీకరణ పెద్దెత్తున పెరిగిపోయాయి. వీరిలో పెద్ద సంఖ్యలో మధ్యయుగాల పనిపరిస్థితులలో కట్టుబానిసలుగా పని చేస్తున్నారు. స్వయంఉపాధి పొందేవారి సంఖ్య 50 శాతానికి మించిపోయిందని లెక్కలు చెబుతున్నప్పటికీ నిజానికి వారంతా అర్ధ-ఉద్యోగితతో సతమతమవుతున్నారు.

అధికార మార్పిడి తర్వాత జీడీపీలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వాటా 50 శాతం నుంచి 14.4 శాతానికి పడిపోయి భారీ వ్యవస్థీకృత మార్పులకు లోనైంది. అదే సమయంలో దేశ జీడీపీలో మాన్యుఫాక్చరింగ్ రంగం వాటా ఆసియా దేశాలన్నింటి కంటే అత్యల్పంగా 31.5 శాతంగా ఉంది. జీడీపీలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వ్యవసాయ కూలీలను ఇముడ్చుకోకుండానే సర్వీసు రంగం అతిగా వాచిపోయి, జీడీపీలో దీని వాటా 54.1 శాతానికి పెరిగింది.

దేశ ఎగుమతుల్లో అత్యధిక భాగం వ్యవసాయోత్పత్తులు, సగం పూర్తయిన సరుకులు ఆక్రమిస్తుండగా, దిగుమతులలో అత్యధిక భాగం అమెరికా, రష్యా, యూరప్, చైనా, జపాన్ తదితర సామ్రాజ్యవాద దేశాల నుంచి పూర్తయిన పారిశ్రామిక ఉత్పత్తులు ఆక్రమిస్తున్నాయి.

2. గ్రామీణ ప్రాంతాలలో వీటి చేతిలో మరింతగా భూమి బంధించబడింది. భూకేంద్రీకరణకి సంబంధించిన గత రూపాలలో మార్పు వచ్చినప్పటికీ అది నూతన రూపాలలో పెరిగింది. ప్రభుత్వ అధికారిక గణాంకాలు చూసినా ఇది స్పష్టమవుతుంది. 1970-71లో యావత్తు వ్యవసాయ కుటుంబాలలో 3.9 శాతంగా ఉన్న భూస్వామ్య కుటుంబాల వద్ద ఐదు కోట్ల హెక్టార్ల లేదా 12.5 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. 2012-13లో 70వ రౌండు జాతీయ సాంపిల్ సర్వే ప్రకారం 7 శాతం గ్రామీణ ధనిక కుటుంబాల చేతిలో దాదాపు సగం సాగుభూమి ఉంది. 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 10 శాతంగా ఉన్న భూస్వాముల చేతిలో 55 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. ఈ ఏడు దశాబ్దాల కాలంలో సామ్రాజ్యవాదంతో కుమ్మక్కైన పాత-కొత్త భూస్వామ్య, దళారీ నిరంకుశ బుర్జువా పాలకవర్గాలు నూతన రూపాల్లో లెక్కకు అందనంతగా కోట్లాది హెక్టార్ల భూమిని కబ్జా చేసుకున్నాయని వివిధ అధ్యయనాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ మూడు మహా పర్వతాలు దేశంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి.

3. దేశంలో బ్రిటీషు కాలంతో పోల్చితే గత ఏడు దశాబ్దాలలో పెట్టుబడిదారీ సంబంధాలు మరింత వికృత రూపం తీసుకున్నాయి. అర్ధభూస్వామ్యంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ సంస్కరణలు, వివిధ విప్లవ, ప్రజాస్వామిక పోరాటాల ఫలితంగా గ్రామాలలో భూస్వామ్య దోపిడీలో, దోపిడీ రూపాలలో, గ్రామీణ వర్గ పొందికలో మార్పు రావడంతో భూస్వామ్యశక్తులలో నూతన శక్తులు వచ్చి చేరడంతో భూస్వామ్య ఆధిపత్య రూపంలో మార్పు వచ్చింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ- సహకార సంస్థ-పంచాయితీ-పోలీసు' వ్యవస్థలు కుమ్మక్కై నూతన భూస్వామ్య రూపం తీసుకుంది. నూతన దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి.

4. అధికార మార్పిడి తర్వాత 'హరిత విప్లవానికీ' ముందు, తర్వాత దళారీ పాలకవర్గాలు అమలు చేసిన సామ్రాజ్యవాద ప్రాయోజిత ఆర్థిక విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాలు తీవ్ర సంక్షోభానికి గురయ్యాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు గత ఏడు దశాబ్దాలలో చెప్పుకోదగిన ప్రాంతాలలో అమలులోకి వచ్చాయి. యంత్రాల వినియోగం పెరిగింది. అయితే ఇవి ఏవీ వీటన్నింటి ఫలితంగా వ్యవసాయంలో అర్ధభూస్వామ్య సంబంధాలపై ఆధారపడి సామ్రాజ్యవాదుల, దళారీ పాలకుల దోపిడీ, పీడన, అణచివేత మరింత పెరిగాయి. సామ్రాజ్యవాదపు పట్టు పెరగడంతో దేశ పరాధీనత మరింత పెరిగింది. వ్యవసాయం కోలుకోలేని సంక్షోభంలో పడింది. ఈ కారణంగా రోజు రోజుకూ వ్యవసాయ భూకమతాల విభజన జరుగుతూ వాటి సంఖ్య పెరుగుతున్నది. 1970-71లో యావత్తు భూకమతాలూ 7.1 కోట్లు ఉండగా 1980-81లో అది 8.89 కోట్లకు పెరిగింది. 1990-91లో 10.53 కోట్లకు పెరిగింది. 2002-03లో ఎన్ఎస్ఎస్ 59వ రౌండ్ సర్వేలో ఇవి వరుసగా 10,72,28,000 హెక్టార్లు (మొత్తం భూమి), 0.725 హెక్టార్ (సగటు భూకమతం)గా ఉండేవి. 2012-13లో ఎన్ఎస్ఎస్ 70వ రౌండ్ గణాంకాల ప్రకారం మొత్తం అంచనా వేయబడిన భూమి 9,23,69,000 హెక్టార్లకు, వ్యవసాయ కుటుంబాలు సగటున కలిగి వున్న భూమి 0.592 హెక్టార్‌కు తగ్గింది. నిరంతరం చిన్న భూకమతాల సంఖ్య, వ్యవసాయ రంగంలో సాధారణ పంటల ఉత్పత్తి పెరుగుతూ ఉంది.

పెద్ద భూకమతాలలో కూడా పెట్టుబడిదారీ దేశాలతో పోల్చితే ఉత్పాదకత చాలా తక్కువగా వుంది. ఇది అర్ధభూస్వామ్య సంబంధాలకు, వెనుకబడిన అర్ధభూస్వామ్య ఉత్పత్తి విధానానికి ఒక ముఖ్యమైన గీటురాయి. ఇది పెట్టుబడిదారీగా పరివర్తన చెందడం సాధ్యం కాదు. ఎందుకంటే లెనిన్ చెప్పినట్లుగా, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి ఇటువంటి పెద్ద భూకమతాలను సృష్టించడానికి, వాటి ద్వారా చెల్లాచెదురుగా వున్న శ్రమను సామాజీకరించడానికి సంబంధించిన ఎటువంటి ప్రక్రియ కూడా మన దేశంలో వ్యాప్తిలో లేదు.

5. గత ఏడు దశాబ్దాలలో గ్రామీణ భారతదేశంలో రైతాంగం వర్గ పొందికలో చెప్పుకోదగిన మార్పులు చోటు చేసుకున్నాయి. 1961లో మొత్తం భూమిలేని వ్యవసాయ కూలీల సంఖ్య 24.04 శాతం. ఈ సంఖ్య 1991 నాటికి 46 శాతానికి పెరిగిపోయింది. ప్రపంచీకరణ తర్వాత సామ్రాజ్యవాద దాడి ఫలితంగా రైతాంగం భూములు కోల్పోయి, వ్యవసాయ కూలీలుగా, వలస అర్ధ-కార్మికులుగా, 'గ్రామీణ నిరుద్యోగ రిజర్వు'గా మారిపోతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. ఇది 2001లో 57 శాతానికి చేరుకుంది. వీరి సంఖ్య 2002-03లో 60.1 శాతం నుంచి 2012-13లో 66.1 శాతానికి పెరిగింది. భూమిలేనివారి సంఖ్య కొన్ని చోట్ల చాలా అధికంగా ఉంది. 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 54.38 శాతం కుటుంబాలకు ఏ పూటకు ఆ పూట గడవడమే గగనంగా ఉంది. 'దున్నేవారికే భూమి' ఇప్పటికీ వీరి తక్షణ డిమాండ్, రణనినాదంగా ఉంది. పేద, మధ్యతరగతి కౌలుదార్లు కూడా ఇందులో ముందువరసలో ఉంటారు.

గత ఏడు దశాబ్దాలలో వ్యవసాయంలో, వ్యవసాయానుబంధ రంగాల్లో వేతనశ్రమ పెరిగింది. వేతనంపై పనిచేసే వ్యవసాయ కూలీల, అర్ధ-కార్మికుల సంఖ్య పెరిగింది. దీంతో పైపైన చూసేవారికి గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య దోపిడీ పెట్టుబడిదారీ రూపం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. నిజానికి ఇక్కడ అర్ధ-కార్మికులు పొందే వేతనాలకు, పరిశ్రమల్లో ఆధునిక కార్మికవర్గం పొందే వేతనాలకు ఏమాత్రం పొంతన లేదు. ఏ వేతన సంఘ సిఫార్సులు వ్యవసాయ రంగంలోని వేతన కార్మికులకు/ అర్ధ-కార్మికులకు వర్తించడం లేదు. కనుక ఈ మార్పు ప్రస్తుతం ఉనికిలో వున్న అర్ధభూస్వామ్య దోపిడీని ఏమాత్రం తక్కువ చేయలేదు. ఎందుకంటే ఆధిపత్య కుల భూస్వామికీ, దళిత భూమిలేని శ్రామికుడికి మధ్య వేతన శ్రమ కాంట్రాక్టు అర్ధభూస్వామ్య మూలాన్ని కలిగి ఉంది. ఇది ఒకే సమయంలో ఆర్థిక, ఆర్థికేతర దోపిడీ, పీడనకు ఆధారంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఈ కుల-వర్గ పీడన ఇప్పటికీ ప్రబలంగా ఉంది.

వ్యవసాయానుబంధ రంగాలలో పనిచేసే వివిధ రకాల అర్ధ-కార్మికులు, వృత్తి నిపుణులు, ఉద్యోగులు, స్వయంఉపాధిని పొందేవారు సైతం దేశీయ మార్కెట్ సంక్షోభానికి గురికావడం వల్ల ఉపాధి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు.

శ్రమజీవులుగా, రైతులుగా మహిళలు, దళితులు, ఆదివాసులు ఈ మూడు మహా పర్వతాల కారణంగా తీవ్రమైన దోపిడీ, పీడన, వివక్షలకు గురవుతున్నారు. అదే సమయంలో వారు ఇప్పటికీ పలు తీవ్రమైన సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అవి వర్గ పోరాటంతో, నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే ముడిపడి ఉన్నాయి.

అధికార మార్పిడి తర్వాత ఈ ఏడు దశాబ్దాల కాలంలో దళారీ పాలకులు చేపట్టిన విధానాలు కేవలం విదేశీ ఎంఎన్‌సీలు, వాటితో కుమ్మక్కైన దేశీయ కార్పొరేట్ కంపెనీల, బడా భూస్వాముల ప్రయోజనాలు మాత్రమే నెరవేరుస్తుండడం, వ్యవసాయంలో ఆహార పంటలు తగ్గిపోయి, వ్యాపార పంటలకు ప్రాధాన్యత పెరగడం వలన సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలు, అగ్రిబిజినెస్ కంపెనీలు, వాటి దళారీ కంపెనీల దోపిడీ, వ్యవసాయ మార్కెట్లలో ముందస్తు మార్కెట్ల (ఫార్వార్డ్ లేదా ఫ్యూచర్ ట్రేడింగ్) ప్రాబల్యం, దళారీల దోపిడీ తీవ్రరూపం దాల్చింది. రైతు చేతికి పంట వచ్చినప్పుడు రేటు తక్కువగా, వ్యాపారుల చేతిలోకి పంట పోయినప్పుడు రేటు అనేక రెట్లు అధికంగా ఉంటున్నది. భూమి సమస్య, కౌలుదారీ సమస్య, పంటలకు గిట్టుబాటు ధర సమస్య, బలవంతపు విస్థాపన సమస్య, వ్యవసాయానుబంధ రంగాల సమస్య మొదలైనవి వ్యవసాయాన్ని కోలుకోలేని సంక్షోభంలో నెట్టివేసాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం కంటే పేద, మధ్యతరగతి రైతు కుటుంబాల సగటు నెలసరి ఆదాయం తక్కువగా ఉంటున్నది. ఫలితంగా మధ్యతరగతి రైతాంగం దివాలాతీస్తున్నది. వారి సంఖ్య నానాటికీ తగ్గిపోతున్నది. అదే విధంగా ధనిక రైతులపై సైతం వ్యవసాయ సంక్షోభం ప్రభావం తీవ్రంగా ఉంది. ఫలితంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గిడసబారిపోవడంతో పాటు అవి పెద్దెత్తున ధ్వంసం అవుతున్నాయి. ఏ ప్రాంతంలో వ్యాపార పంటలు అధికంగా విస్తరించాయో అక్కడే నిరంతరం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో 74 శాతం గ్రామీణ జనాభాగా ఉంది. 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. అంటే ఉత్పత్తిదారులలో రైతులు, వ్యవసాయ కూలీలు, అర్ధ-కార్మికులు మెజారిటీగానూ, పారిశ్రామిక కార్మికులు మైనారిటీగానూ ఉండడం, ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఉత్పత్తి శక్తులు ధ్వంసం అవుతూ ఉండడాన్ని (పరిశ్రమల మూసివేత, వ్యవసాయ సంక్షోభం, ప్రత్యేకించి రైతుల ఆత్మహత్యలను) బట్టి భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ వెనుకబడిన అర్ధభూస్వామ్య స్థితిలోనే ఉందని స్పష్టమవుతుంది.

బ్రిటీషు సామ్రాజ్యవాదుల వలస పాలనలో ధ్వంసమైన చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, తదితరాలను పునరుద్ధరించేందుకు అధికార మార్పిడి తర్వాత దళారీ

పాలకులు చేపట్టిన పథకాలు పైపై మెరుగులకే పరిమితమయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉపాధిని కల్పిస్తూ ముఖ్యమైన పాత్ర పోషిస్తూ వచ్చిన చేతివృత్తులు ఈ ఏడు దశాబ్దాల కాలంలో మరణావస్థకు చేరుకున్నాయి.

6. అధికార మార్పిడి తర్వాత కౌలు నిర్మూలనా చట్టాలు, ఇతర సంస్కరణ కార్యక్రమాలు సాధించింది ఏమీ లేదు. గతంలో ప్రత్యక్ష కౌలు దోపిడీ రూపాలు నేటికీ కొనసాగుతున్నాయి. కొన్ని రూపంలో మారినా సారాంశంలో మారలేదు. ప్రత్యేకించి సంస్కరణానంతర కాలంలో "కౌలుదారీ విధానం పునరుద్ధరించబడడం" కనపడుతుంది. నానాటికీ 'గ్రామీణ నిరుద్యోగ రిజర్వు'లో చేరిపోతున్న పేద, మధ్యతరగతి రైతులు తమ బతుకుతెరువుకు కౌలు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అనివార్యంగా కౌలు వ్యవసాయం చేయాల్సి రావడం, అర్ధభూస్వామ్య వ్యవస్థలో రాజ్యాధికారం గ్రామంలోని భూస్వామ్య శక్తులు, ప్రభుత్వ-పోలీసు-న్యాయ అంగాలతో పెనవేసుకొని ఉండడంతో భూస్వామ్య దోపిడీ, వెట్టి క్రూరంగా కొనసాగుతున్నది. మరోవైపు భూస్వాములు, ధనిక రైతులు భూములను 'రివర్స్ కౌలు'కు పేద రైతాంగాన్ని దోపిడీ చేసే నూతన రూపం ఇప్పుడు విస్తృతంగా అమలులో ఉంది.

7. ప్రపంచీకరణకు ముందు రైతాంగంపై అమలులో ఉన్న భూస్వామ్య ఆర్థికేతర దోపిడీ రూపాలు నేటికీ అమలులో ఉన్నాయి. ప్రత్యేకించి దళితుల వెట్టి, అర్ధ-వెట్టి, నయా-వెట్టితో వివిధ రూపాలలో కొనసాగుతున్నది. కుల ఆధారిత బ్రాహ్మణవాదం ఇప్పటికీ సజీవంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండడం, ప్రత్యేకించి దళితులు దీని వల్ల తీవ్ర దోపిడీ పీడనలకు గురవుతున్నారు.

   తీవ్రమైన వడ్డీ వ్యాపార దోపిడీ వివిధ రూపాలలో కొనసాగుతున్నది. రుణాల పేరుతో కేవలం భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, మార్కెట్ వ్యాపారులే కాకుండా, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర ఫైనాన్స్ సంస్థలు, మొదలైనవి కూడా రైతాంగాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయి. నయా ఉదారీకరణ కాలంలో ప్రభుత్వ మదుపు, వ్యవసాయానికి ప్రభుత్వ రుణం తగ్గుతూ వస్తోంది. ఇది వడ్డీ వ్యాపారానికి మరింత అవకాశాన్ని ఇచ్చింది.

8. కాంట్రాక్టు-కార్పొరేట్ వ్యవసాయం క్రమంగా విస్తరిస్తోంది. యావత్తు రైతాంగ భూములను కబ్జా చేసి రైతులను తమ భూములలో వ్యవసాయ కూలీలుగా మార్చడం సామ్రాజ్యవాదుల, వారి దళారీ అగ్రిబిజినెస్ కంపెనీల లక్ష్యంగా ఉంది.

9. గత ఏడు దశాబ్దాల కాలంలో బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదం దేశంలో పెద్దెత్తున పెచ్చరిల్లింది. 1947లో దేశ విభజన సందర్భంగా లక్షలాది ముస్లిం ప్రజల ఊచకోత నుంచి మొదలుకొని, అహ్మదాబాద్ (1969), భివండి, మహారాష్ట్ర (1970), తెల్లచ్చేరి, కేరళ (1971), జెంషెడ్‌పూర్, ఝార్ఖండ్ (మునుపటి బిహార్) (1979), భాగల్పూర్, బిహార్, మీరట్, ఉత్తరప్రదేశ్ (1980), తమిళనాడు (1982), బాబ్రీమసీదు కూల్చివేత (1992), గుజరాత్ (2002), కంధమాల్, ఒడిశా (2008), ఉత్తరప్రదేశ్ (2013), హిందుత్వ శక్తులు 2000లో మొదటిసారి, 2014లో రెండవసారి, 2019లో మూడవసారి కేంద్రంలో అధికారంలోకి రావడం, ముస్లిములపై, దళితులపై, ఆదివాసులపై క్రూరమైన మోబ్ లించింగ్ హత్యలు, బాబ్రీమసీదు స్థలంలో 2019 నవంబర్‌లో రామాలయ నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం వరకూ అది అనేక హత్యాకాండలను, అత్యాచారాలను, అగ్నికాండలను, ఆస్తుల ధ్వంసాన్ని, లూటీని సాగించింది. ప్రత్యేకించి దీని ఉన్మాదపూరితమైన హింసాత్మక దాడుల్లో ముస్లిం మతమైనారిటీలు అధికంగా నష్టపోయారు. దళితులు, ఆదివాసులు, మహిళలు, అలాగే క్రిస్టియన్లు సైతం తీవ్రంగా నష్టపోయారు. ముస్లిముల స్థితిగతులపై సచ్చర్ కమిషన్ నివేదికను కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బుట్టదాఖలు చేసాయి. దేశాన్ని హిందుత్వ రాజ్యంగా మార్చే లక్ష్యంతో హిందుత్వ శక్తులు ఇప్పటికే చాలా ముందుకుసాగాయి. ఇదంతా ప్రపంచ ద్రవ్య పెట్టుబడి నిర్దేశితమైనదేననేది ఇక్కడ గుర్తుంచుకోవాలి. దేశంలో ఫాసిజాన్ని బలోపేతం చేసి దేశంలో అన్ని రంగాల్లో ఫాసిస్టు భావజాలాన్ని, దాని ఆధిపత్యాన్ని నెలకొల్పడం ద్వారా తన దోపిడీకి మార్గాన్ని సుగమం చేసుకోవడమే ద్రవ్య పెట్టుబడి లక్ష్యం.

10. బ్రాహ్మణవాద హిందుత్వ భావజాలంపై ఆధారపడిన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ భారత అర్ధభూస్వామ్య సంబంధాలలో అంతర్భాగంగా ఉంది. దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య శక్తుల నాయకత్వంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పీడక కులాలు మనుధర్మాన్ని అమలు చేస్తూ పీడిత,దళిత కులాలపై,ఆదివాసులపై అమలు చేసే అణచివేత, పీడన, వివక్ష, అంటరానితనం, సాంఘిక బహిష్కరణ రూపాలు, ప్రత్యక్ష హింస, హత్యాకాండలు, సజీవ దహనాలు, మహిళలపై లైంగిక అత్యాచారాలు, గృహదహనాలు, ఆస్తుల విధ్వంసం, లూటీ సర్వసాధారణంగా నేటికీ కొనసాగుతున్నాయి. బెల్చి (బిహార్), కిల్వెన్‌మణి (తమిళనాడు), బథానీటోల (బిహార్), ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, నీరుకొండ, చుండూర్‌ల నుంచి సోంపేట వరకు, మహారాష్ట్రలో ఖైర్లాంజి, జీవ్‌ఖేడ వంటి ఘటనలు, భీమాకోరేగావ్ ముందు, తర్వాతా హత్యాకాండలు, గుజరాత్‌లో ఉనా అత్యాచారం ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రాథమిక స్థాయి నుంచి అత్యున్నత స్థాయి విద్యా సంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో బ్రాహ్మణీయ శక్తుల జులుం కొనసాగుతున్నది. పాఠ్య ప్రణాళికలు బ్రాహ్మణీకరిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు, దాభోల్కర్, పన్సారే, కల్‌బుర్గి, గౌరీలంకేష్ వంటి ప్రగతిశీల, లౌకికవాదులపై బెదిరింపులు, హత్యలు, దాడులు జరుగుతున్నాయి. రోహిత్ వేముల ఆత్మహత్య తర్వాత

దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసన వెల్లువ, ఇలాంటి పలు నిరసనలు బ్రాహ్మణీయ హిందుత్వ పాశవికతను ఎండగడుతున్నాయి.

11. విద్య, ఆరోగ్యం, నివాసం, పని/శ్రమ విభజన, పీడిత కులాల సామాజిక హోదా, సంపదపై యాజమాన్యం, మొదలైనవాటిలో వివక్ష, మహిళలపై పితృస్వామ్యం ఇప్పటికీ స్పష్టంగా కనపడుతుంది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' పేరుతో దేశాన్ని బ్రాహ్మణీయ హిందుత్వ రాజ్యంగా మార్చి 'అఖండ భారత్'ను స్థాపించే బృహత్ లక్ష్యంతో మత మైనారిటీలపై ప్రత్యేకించి ముస్లిములపై, క్రిస్టియన్లపై, జాతి విముక్తి ఆకాంక్షలతో పోరాడుతున్న కశ్మీర్, ఈశాన్య జాతులపై నిరంతరం సాగిస్తున్న దాడులు ఇందులో భాగమే. బ్రాహ్మణీయ హిందుత్వ ఆధిపత్యానికీ, అత్యాచారాలకు వ్యతిరేకంగా పీడిత/దళిత కులాలలో, ఆదివాసులలో, మైనారిటీలలో, పీడిత జాతులలో పెరుగుతున్న ప్రగతిశీల, ప్రజాస్వామిక చైతన్యాన్ని చూసి సహించలేని, ఆధిపత్య కులాల భూస్వామ్య శక్తుల ఉన్మాదపూరిత హింసాత్మక దాడుల కారణంగా పలు సందర్భాల్లో అణచివేత, పీడన, వివక్షలు తీవ్ర రూపం తీసుకున్నాయి.

**వర్గపోరాటం ఫలితంగా జరిగిన మార్పులు :**

భారతదేశంలో 1947 అధికార మార్పిడి తర్వాత వివిధ రంగాలలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరిగాయి. అలాగే గత ఐదు దశాబ్దాల కాలంగా మన పార్టీ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాలతో పాటు సామ్రాజ్యవాద, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు తీవ్ర స్థాయిలో జరిగిన ఫలితంగా వివిధ విప్లవోద్యమపు రాష్ట్రాల్లో/ప్రాంతాలలో గణనీయ మార్పులు చోటు చేసుకున్నాయి. 1960 దశకం రెండవ భాగంలో, 1970ల దశకం మొదటి భాగంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ వెల్లువలో భాగంగా దేశవ్యాప్తంగా సాగిన భూస్వామ్య వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటాలు దేశ సామాజిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసాయి. ఆ తర్వాత 1970ల దశకం చివరి నుంచి మరోసారి ఇలాంటి సాయుధ రైతాంగ పోరాట వెల్లువ బద్దలయింది. ఇందులో భాగంగా భూస్వామ్య సంబంధాలు బలంగా వున్న బిహార్ రాష్ట్రంలో, ఝార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలలో, తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర, దక్షిణ కోస్తాలలోని, పశ్చిమ బంగ్, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలలో జరిగిన వర్గ పోరాటాల స్వభావం, జరిగిన మార్పుల స్వభావం దాదాపు ఒకేలాంటివి. అలాగే ఝార్ఖండ్ రాష్ట్రంలో, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, తూర్పు గోదావరి మన్యం ఏజెన్సీ, తెలంగాణ, పశ్చిమ బంగ్, ఒడిశాలలోని ఆదివాసీ ప్రాంతాలలో సామాజిక పరిస్థితి, టెర్రయిన్ స్థితి గానీ, ఇక్కడ జరిగిన వర్గ పోరాటాల స్వభావం, జరిగిన మార్పుల స్వభావం గానీ మూలంలో ఒకేలాంటివి.

భూస్వామ్య సంబంధాలు బలంగా వున్న ప్రాంతాలలో బలంగా జరిగిన భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాల ఫలితంగా నూతన భూస్వామ్య వర్గం పుట్టుకు వచ్చింది. పాత భూస్వాములు తమ ఆస్తులను, పెట్టుబడులను పట్టణ ప్రాంతాలకు తరలించారు. పాత భూస్వామ్య కుటుంబాల్లో చాలా మంది పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈ ప్రాంతాల్లో క్రమంగా వ్యవసాయం మీద ఆధారపడే భూస్వాముల సంఖ్యా, గ్రామీణ జీవితంలో వారి పాత్ర తగ్గిపోయి వారి స్థానంలో వ్యవసాయ, వ్యవసాయేతర గ్రామీణ పెత్తందార్ల ఆధిపత్యం ఏర్పడింది. భూమి ప్రధానంగా వారి చేతుల్లోనే కేంద్రీకరించబడింది. వీరి ఆధ్వర్యంలో రైతాంగాన్ని పీల్చిపిప్పిచేసే పలు నూతన దోపిడీ పద్ధతులు/విధానాలు ముందుకొచ్చాయి. గతంలో అనేక రకాల ఆర్థికేతర దోపిడీ రూపాలతో పాటు అక్రమ శిస్తుల వసూళ్ల ద్వారా, పలు రకాల భూములు హస్తగతం చేసుకోవడం తదితర రూపాల ద్వారా భూస్వామ్య వర్గం రైతాంగాన్ని దోపిడీ చేసి మిగులు దక్కించుకునేది. సామాజికంగానూ, వర్గ పోరాట ఫలితంగానూ మారిన పరిస్థితులలో, ముందే వివరించినట్లుగా, పై రూపాలు బలహీనపడి వాటి స్థానంలో అనేక నూతన దోపిడీ రూపాలు ముందుకొచ్చాయి. గ్రామాల వర్గపొందికలో గణనీయ మార్పులు వచ్చి, ఉత్పత్తిలో వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరిస్తున్నాయి. అర్ధ భూస్వామ్య సంబంధాలు సాపేక్షికంగా బలహీనపడినాయి. 90వ దశకానికి ముందు గ్రామాల్లో సాధారణంగా పీడక కులాల భూస్వాములు, అందులో ఒకరిద్దరు పెద్ద భూస్వాములు, వారి ప్రాపకం కింద ఉండే కొన్ని పీడక కులాల కుటుంబాలు, వారి దళారులు ఒకవైపు తక్కిన విశాల ప్రజారాశులు మరోవైపు వుండి వర్గపోరాటం సాగేది. ఆ తర్వాత కాలంలో దాదాపుగా అలాంటి స్థితి లేదు. గత భూస్వాముల్లో, ధనిక, మధ్య తరగతి రైతుల్లో కొంత మంది నేడు నూతన భూస్వాములుగా ఎదిగి గ్రామాధిపత్యం చెలాయిస్తున్నారు. వీరు, సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు కలిసి రాజ్యం దన్నుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని మిగులును కొల్లగొడుతున్నారు. దీంతో నేడు వర్గ పోరాటాన్ని ఈ విప్లవ ప్రతీఘాతుక కూటమికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

విప్లవోద్యమం బలంగా కొనసాగిన ఆదివాసీ ప్రాంతాల్లో వర్గ పోరాటంలో భాగంగా అటవీ భూముల్ని స్వాధీనం చేసుకోవడం, గైరాదివాసీ, ఆదివాసీ భూస్వాముల, దుష్ట పెత్తందార్ల వద్దనున్న అదనపు భూముల్ని స్వాధీనం చేసుకోవడం, ప్రజా వ్యతిరేకులుగా, వర్గ శత్రువులుగా, విప్లవోద్యమ వ్యతిరేకులుగా ఉన్న కొద్దిమంది భూస్వాములను, దుష్ట తెగ పెద్దలను, పెత్తందార్లను, ఇన్‌ఫార్మర్లను అణచివేయడం, ప్రభుత్వ, ఫారెస్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల దోపిడీ పీడనలను దెబ్బతీయడం జరిగింది. తెగ పెద్దలకు, పెత్తందార్లకు ప్రజలు చేసే వెట్టి పనులు రద్దయ్యాయి. వడ్డీ వ్యాపారాల్ని, సంత వ్యాపారుల దోపిడీని నియంత్రించారు. భూస్వామ్య-తెగ పెద్దల దోపిడీని తగ్గించారు. జీతగాళ్ళ పద్ధతులు చాలా వరకు తగ్గిపోయాయి. మరో వైపు అదే సమయంలో గత రెండు-రెండున్నర దశాబ్దాల కాలంలో ఇలాంటి వివిధ ప్రాంతాల్లో సామ్రాజ్యవాదుల, ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడికీ, రాజ్యానికీ, వీరి దళారులకు వ్యతిరేకంగా పోరాటాలు పెరుగుతూ వచ్చాయి. అదే సమయంలో విప్లవ రైతాంగ కమిటీలు/రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు (ఆర్‌పీసీ) నిర్మాణమయ్యి, సంఘటితపడి, విస్తరిస్తున్న క్రమంలో

భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, ధనిక రైతుల, తదితర దోపిడీ శక్తుల దోపిడీ, పీడనలను అరికట్టడం, నియంత్రించడంతో ఈ ప్రాంతాలలో వర్గ సంపుటిలో కొన్ని గణనీయమైన మార్పులు జరిగాయి. ఉద్యమం బలంగా వున్న ప్రాంతాల్లో ఆర్‌పీసీలు అమలు చేసిన ఆర్థిక, రాజకీయ విధానాల వల్ల భూస్వాములు లేని లేదా వారి సంఖ్య గణనీయంగా తగ్గిన స్థితి ఏర్పడింది. రాజ్యం దన్నుతో పాత–కొత్త భూస్వాములతో, సామ్రాజ్యవాదులతో, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులతో పెనవేసుకుపోయిన నూతన విప్లవ ప్రతీఘాతుక కూటమి ఆవిర్భవించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని పేద రైతాంగపు సంఖ్య తగ్గి మధ్యతరగతి రైతాంగం సంఖ్య పెరిగింది. అయితే వర్గసంపుటిలో ఇప్పటికీ పేద రైతాంగమే అధికంగా వుంది. ప్రపంచీకరణ విధానాల ఫలితంగానూ వర్గ పోరాటం–ప్రజా రాజ్యాధికార అమలు ఫలితంగానూ, మధ్యతరగతి–విద్యార్థి–ఉద్యోగులతో కూడిన పెటీ బూర్జువా సెక్షన్ పెరిగింది. మరోవైపు వలస కార్మికులు, అసంఘటిత కార్మికులు పెరుగుతున్నారు. వ్యాపారస్థుల దోపిడీ పెరుగుతోంది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపు దోపిడి, పీడనలు పెరుగుతున్నాయి.

దేశ సామాజిక వ్యవస్థలో సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబడిన ప్రాంతాలంతటా, ప్రత్యేకించి ప్రపంచీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత జరిగిన, జరుగుతున్న మార్పులను, వర్గ పోరాట ఫలితంగా చోటు చేసుకుంటున్న మార్పులను విడదీసి చూడలేం. అయితే వర్గ పోరాటం తీవ్రస్థాయిలో జరిగిన చోట, అది సామాజిక వ్యవస్థలోని వివిధ రంగాలలో జరిగే మార్పులపై కీలకమైన ప్రభావాన్ని వేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసిన విప్లవ ప్రతిఘాతక దాడులతో పాటు, మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తగిన ఎత్తుగడలతో మనం వర్గపోరాటాన్ని నడపడంలో జరిగిన లోపాల వల్ల గతంలో వర్గపోరాటం తీవ్రంగా కొనసాగిన ప్రాంతాల్లో విప్లవోద్యమం తాత్కాలికంగా బలహీనపడింది. ఇలాంటి ప్రాంతాలలో నూతన భూస్వామ్యవర్గం, నూతన దోపిడీ శక్తులు పుట్టి పెరుగుతూ ఆధిపత్యం వహించే క్రమం వేగంగా పెరుగుతున్నది. కనుక గత ఏడు దశాబ్దాలలో సామాజిక పరిస్థితులలో జరిగిన మార్పులను, ప్రత్యేకంగా మన పార్టీ మన పార్టీ నాయకత్వాన జరిగిన వర్గ పోరాటాల ఫలితంగా చోటు చేసుకున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని పాత, కొత్త దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ప్రస్తుతం విప్లవోద్యమ ప్రాంతాలలో నిర్దిష్టంగా మనం తగిన ఎత్తుగడలతో వర్గపోరాట కార్యక్రమాన్ని రూపొందించుకుని అమలు చేయడం తక్షణ అవసరం.

### అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడమే తక్షణ కర్తవ్యం:

భారతదేశంలో కొనసాగుతున్న ఉత్పత్తి విధానాన్ని సంశ్లేషించుకునే ముందు మూడు మహా పర్వతాలు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల గురించి మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ (2007) ఆమోదించిన 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు' డాక్యుమెంట్ (18వ పేజీలో) చెప్పిన ఈ వాక్యాలను చూద్దాం:

"సామ్రాజ్యవాదం దేశంలోని భూమి, శ్రమ, ముడిపదార్థాలు తదితర సహజ వనరులను కొల్లగొడుతుంది. వివిధ మార్గాల ద్వారా దారుణమైన దోపిడిని సాగించి అది సూపర్ లాభాలను ఆర్జిస్తుంది. అది మొత్తం భారత ఆర్థిక వ్యవస్థను, రాజకీయ వ్యవస్థను, సైనిక వ్యవస్థను, సంస్కృతిని తన చెప్పుచేతల్లో ఉంచుకుంటుంది. దేశీయ పరిశ్రమను ప్రత్యేకించి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అది నాశనం చేస్తుంది. లక్షలాది కార్మికుల్ని అది వీధులలోకి గెంటేస్తుంది. జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వతంత్రమైన, స్వేచ్ఛాయుతమైన అభివృద్ధిని అది అడ్డగిస్తుంది.

దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంతో మిలాఖతవుతుంది, భూస్వామ్య విధానంతో జత కూడుతుంది. అది కార్మికవర్గం, రైతాంగం తదితర శ్రమజీవి ప్రజారాశులను మాత్రమే గాక, జాతీయ బూర్జువావర్గాన్ని కూడా పీడిస్తుంది.

కులపునాదిపై ఉన్న బ్రాహ్మణవాద భూస్వామ్య విధానం భారత ప్రజానీకంలోని అత్యధికులను వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకే కట్టిపడవేసి వుంచడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సంకెలగా పనిచేస్తుంది. ఆర్థికంగా అది ప్రజలలోని అత్యధికులను కటిక దారిద్ర్యంలో, దయనీయమైన స్థితిలో వుంచేస్తుంది. వారి కొనుగోలుశక్తిని కుంచిపజేస్తుంది. తద్వారా అది దేశీయ మార్కెట్టు వృద్ధిని పరిమితం చేస్తుంది. పారిశ్రామికాభివృద్ధిని కుంటుపరిచి పెద్దెత్తున నిరుద్యోగానికి, ఆర్థిక వ్యవస్థలో ప్రతిష్టంభనకు దారితీస్తుంది. రాజకీయంగా అది ప్రజారాశుల ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తుంది. కొన్ని ప్రాంతాలలో అది 'రాజ్యంలో మరో రాజ్యాన్ని' సృష్టిస్తుంది. అంటే గ్రామీణ ప్రాంతాలలో తమ సొంత ప్రైవేటు సైన్యాలను కలిగి వున్న లేదా రాజ్యపు కిరాయి సాయుధ మూకల మద్దతు గల ఒక సమాంతర భూస్వామ్య రాజ్యాన్ని సైతం సృష్టిస్తుంది. అది రైతాంగాన్ని శాశ్వతమైన దాస్యానికి, వెట్టికి గురిచేస్తుంది. బ్రాహ్మణవాదమూ, కులవ్యవస్థా సమాజపరంగానూ, సిద్ధాంతపరంగానూ కింది కులాలపై, దళితులపై ఇంకా అదనపు పీడనను కలగజేస్తాయి. దళితుల విషయంలో అది అంటరానితనం అనే అమానుష రూపం తీసుకుంటుంది. ఇవి భూస్వామ్య శక్తులకు మిగులు(సర్‌ప్లస్)ను దండుకోవడంలో ఆర్థికేతర (extra-economical) బలప్రయోగ సాధనాలుగా కూడా ఉపకరిస్తాయి.

నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణం కోసం భారత ప్రజల మూపులపై వుండి వారిని కుంగదీస్తున్న ఈ మూడు మహా పర్వతాలను నాశనం చేయాలి".

ప్రస్తుత ఈ డాక్యుమెంటులో దేశంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రత్యేకించి 1990ల నుండి నేటి వరకు దేశ సామాజిక వ్యవస్థలో, ప్రత్యేకించి వ్యవసాయిక గ్రామీణ రంగంలో అన్ని రంగాలలో చోటు చేసుకున్న మార్పుల గురించి ఇప్పటి వరకూ వివరంగా చూసాం. ఈ పరిణామాలను, మార్పులను సంశ్లేషించుకుంటే పై ఉల్లేఖన నేటికీ పూర్తిగా సరైందని స్పష్టమవుతుంది.

గత ఏడు దశాబ్దాలలో జరిగిన మార్పులను బట్టి భారత ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీగా గానీ, పెట్టుబడిదారీగా పరివర్తన చెందే మార్గంలో గానీ ఎంతమాత్రమూ లేదనీ, అటువంటి ప్రజాస్వామిక ధోరణి ఏదీ దేశంలో లేదనీ, అయితే ఇందుకు భిన్నంగా,

అర్ధభూస్వామ్య సంబంధాలు సాపేక్షంగా బలహీనపడ్డాయనేది నిస్సందేహం. విశాల గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ భూమి సమస్యే ప్రధాన సమస్యగా, దున్నేవారికి భూమి ప్రాతిపదికన విప్లవ భూ సంస్కరణలు చేపట్టడం అనేది ఎంతో ప్రాధాన్యత, ప్రాసంగిత కలిగిన అంశంగా ఉంది. సగటు వ్యవసాయ గణాంకాలు, విద్యావేత్తల గ్రామ సర్వేలు అన్నీ ఈ అంశాలనే ఎత్తిచూపుతున్నాయి. భూమి కోసం దేశవ్యాప్తంగా విప్లవ, ప్రజాస్వామిక శక్తుల నాయకత్వంలో అత్యధిక రాష్ట్రాలలో ఉధృతంగా సాగిన, సాగుతున్న రైతాంగ పోరాటాలు ఇందుకు తిరుగులేని నిదర్శనం. కార్మికవర్గ నాయకత్వాన పీడితవర్గాల నియంతృత్వం కింద నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించి, మూడు మహా పర్వతాల దోపిడీని రూపుమాపకుండా భూసంస్కరణలను, కౌలు సంస్కరణలను చేసినా వాటికి పరిమితి ఉంటుందని పశ్చిమ బెంగాల్ అనుభవం తెలియజేస్తున్నది.

గత ఏడు దశాబ్దాలలో సామ్రాజ్యవాదం మన దేశంలోని అర్ధవలస, అర్ధభూస్వామ్య ఆర్థిక వ్యవస్థను స్వతంత్రంగా అభివృద్ధి చెందనీయకుండా అడ్డుకుంటున్నది. మన దేశాన్ని మరింత ఎక్కువగా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థకు అనుబంధ ఆర్థిక వ్యవస్థగా మార్చివేసింది. అధికార మార్పిడికి ముందు మన దేశానికి సామ్రాజ్యవాద దేశాలతో ఉన్న వలస, ద్రవ్య ఆర్థిక సంబంధాలు మరింతగా విస్తరించాయి. సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యవర్గాలు కుమ్మక్కై దేశ ప్రకృతి సంపదలను, పీడిత ప్రజల శ్రమశక్తిని పెద్దెత్తున దోచుకుంటున్నాయి. సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి పెద్ద భూతంలా పెరిగిపోయింది. అది పారిశ్రామిక, వ్యవసాయ, సర్వీసు రంగాల్లోని మిగులులో ఒక పెద్ద భాగాన్ని కబ్జా చేసుకుంటున్నది. ప్రత్యేకించి వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీసు రంగాలలోని అసమాన వర్తకం, ప్రత్యక్ష పెట్టుబడులు, అప్పుల ద్వారా ఆర్థిక వ్యవస్థపై తమ అదుపును నిలుపుకుంటున్నది. విదేశీ ఎంఎన్‌సీలు, దళారీ పాలకవర్గాలు టీ, కాఫీ, రబ్బరు, చెరకు, కొబ్బరి ప్లాంటేషన్లలో కార్మికుల, ఉద్యోగుల చౌక శ్రమశక్తి నుంచి మాత్రమే కాక ముడి పదార్థాలను ఎగుమతి చేయడం, సామ్రాజ్యవాద దేశాల నుంచి దిగుమతి చేసుకున్న సరుకులను అమ్మడం, తమ వ్యవసాయ భూములను కౌలుకు ఇవ్వడం ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తున్నాయి. అవి సాగించిన లావాదేవీలన్నీ కొన్ని పెద్ద తేలికపాటి తయారీ కంపెనీలు మినహాయించి మాన్యుఫాక్చరింగ్‌లో కాక వర్తక సంబంధ విషయాల చుట్టూనే ఉన్నాయి. ఆ తేలికపాటి తయారీ పరిశ్రమలు సైతం 'మేక్ ఇన్ ఇండియా'పై కాక 'అసెంబుల్డ్ ఇన్ ఇండియా'పై అంటే దిగుమతులపై ఆధారపడిన పరిశ్రమలే. వీటన్నింటిని బట్టి వస్తుగతంగా తేలేదేమంటే, భారతదేశం బ్రిటీషు పాలనలో లాగానే ఇప్పటికీ సామ్రాజ్యవాద మార్కెట్‌గానే ఉంది. ఇవన్నీ అర్ధవలస, అర్ధభూస్వామ్య లక్షణాలే.

వ్యవసాయంలో సృష్టించబడిన మిగులులో అధిక భాగం బ్యాంకుల/సహకార సంస్థల, వడ్డీ వ్యాపారుల, షావుకార్ల, వివిధ ఫైనాన్స్ సంస్థల నిరంకుశ అదుపులో ఉండడం వల్ల పెట్టుబడి సంచయనానికి ఆటంకం ఏర్పడుతోంది. పెట్టుబడిదారీ పునరుత్పత్తి షరతు అమలు ఊసే ఉండడం లేదు. అర్ధభూస్వామ్య సంబంధాలు కింది స్థాయి నుంచి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాకుండా అడ్డుకుంటున్నాయి. వడ్డీ వ్యాపార, వాణిజ్య పెట్టుబడి రైతుల వ్యవసాయోత్పత్తులను/సరుకును కబ్జా చేసుకుంటుంది కానీ ఉత్పత్తి ప్రక్రియను కాదు. ఈ ప్రక్రియ రైతులను అర్ధభూస్వామ్య సంబంధాలలో బంధించి ఉంచుతున్నది. వారి శ్రమశక్తిపై నియంత్రణ సంపాదించి వారిని కార్మికులుగా మార్చదు, వారు పెట్టుబడిదారులుగా మారేందుకు సైతం అవకాశం ఇవ్వడం లేదు.

దళారీ పాలకవర్గాలు దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నామనీ, పెద్దెత్తున విదేశీ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా అభివృద్ధి చేస్తున్నామనీ, దేశ స్థూల జాతీయోత్పత్తి ఎంతగానో పెరిగిందనీ పెద్దెత్తున చేస్తున్న ప్రచారంలో ఎంతమాత్రమూ వాస్తవం లేదు. పెట్టుబడిదారీ విధానంలో సమాజంలో సంపదంతా పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతుంది, మిగతా శ్రామిక జనావళి నుంచి అత్యధికంగా అదనపు విలువను పిండుకుంటుంది, సూపర్ లాభాలు ఆర్జించుతుంది తప్ప కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాలకు అది ఎటువంటి అభ్యుదయాన్నీ కొనితేలేదు, కేవలం కష్టాలను, కడగండ్లను, దుర్భర దారిద్ర్యాన్ని మాత్రమే వారికి మిగుల్చుతుంది – ఇదీ పెట్టుబడిదారీ విధాన చరిత్ర. కనుక దళారీ పాలకుల ప్రకారం పెట్టుబడిదారీ అభివృద్ధి ఏదైనా జరిగినప్పటికీ – అది ఎంత వికృత రూపంలో ఉన్నప్పటికీ – పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప శ్రామిక జనావళి ప్రయోజనాలు ఏమాత్రం నెరవేరవు.

లెనిన్, పెట్టుబడిదారీ పరివర్తనకు సంబంధించిన రెండు అవకాశాలను సూత్రీకరించారు. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ (పై నుంచి పెట్టుబడిదారీ విధానం) పరివర్తన ఫలితంగా గానీ లేదా భూస్వామ్య ఎస్టేట్లను (కింద నుంచి పెట్టుబడిదారీ విధానం) రూపుమాపడం ద్వారా గానీ పెట్టుబడిదారీ పరివర్తన చోటు చేసుకుంటుంది. కానీ భారతదేశంలో ఈ రెండింటిలో ఏ మార్గంలోనూ పెట్టుబడిదారీ పరివర్తన చోటు చేసుకోలేదు. అందువల్ల భారతదేశం 'పై నుంచి పెట్టుబడిదారీ'గా పరివర్తన చెందిందనీ, భారత పాలకవర్గాలు స్వతంత్రమైనవనీ, వారు సామ్రాజ్యవాద దేశాలతో 'రాజీ, బేరం' అనే పద్ధతిని అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థపై పట్టును పెంచుకుంటున్నాయనే వాదనకూ భౌతిక వాస్తవికతకూ ఏమాత్రం పొంతనలేదు. భారతదేశ దళారీ పాలకవర్గాల కంటే ప్రపంచ ద్రవ్య పెట్టుబడి అనేక వేల రెట్లు శక్తివంతంగా ఉందనేది భౌతిక వాస్తవం. వారికీ ప్రపంచ ద్రవ్య పెట్టుబడితో గల చారిత్రక మిలాఖత్తు ఒక నిర్వివాదమైన వాస్తవం.

భారతదేశంలో బ్రిటీషు వలసవాదం తన ప్రయోజనాలకు అనుగుణంగా భూస్వామ్య విధానాన్ని పరిరక్షించి, దానికి సామాజిక దన్నుగా ఉపయోగించుకుంది. విశాల రైతాంగ ప్రజారాశులపైన భూస్వామ్య విధానపు రక్కసిపట్టును మౌలికంగా మార్చకుండానే, తాను కూడా వారిని పీల్చిపిప్పి చేస్తూనే అది పెట్టుబడిదారీ సంబంధాలను ప్రవేశపెట్టింది. దీని ఫలితంగా అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రత్యక్ష వలసపాలన అంతమైన తర్వాత కూడా ఈ అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు కొనసాగాయి. సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం రెండింటినీ భారతదేశంపై తమ నయావలస తరహా పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీలను కొనసాగించేందుకు ఉపయోగించుకుంటున్నది. దేశీయ మార్కెట్‌ను ధ్వంసం చేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసింది. గత ఏడు

దశాబ్దాలలో జరిగిన పరిణామాలను, మార్పులను సంశ్లేషించుకుంటే, దేశ ప్రజలకు శత్రువులైన ఈ మూడు మహా పర్వతాల కారణంగా ఇప్పటికీ విస్తారమైన గ్రామీణ ప్రాంతంలో విశాల ప్రజాబాహుళ్యంపై భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, వర్తక వర్గాల దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోందని స్పష్టమవుతుంది.

అలాగే భారత ఆర్థిక వ్యవస్థను "అంచుల్లో ఉన్న పెట్టుబడిదారీ విధానమనీ", "అర్ధ-పెట్టుబడిదారీ విధానమనీ", "పరివర్తనలో ఉన్న పెట్టుబడిదారీ విధానమనీ" సూత్రీకరించడం సరైంది కాదు. ఇలా సూత్రీకరించడం అంటే మన దేశంలో ఇప్పటికీ రాజ్యాధికారాన్ని చెలాయిస్తూ బలంగా నిర్ణయాత్మకంగా ఉన్న అర్ధభూస్వామ్య విధానం అప్రధానమైందిగా మారిపోతుంది. సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగంలో జాతీయ ప్రజాస్వామిక విప్లవాల సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక కర్తవ్యాలు కూడా అదే విధంగా అప్రధానం అవుతాయి. అంతిమంగా వ్యవస్థ సమూల మార్పు కోసం పోరాడే విప్లవశక్తులు ఏ పంథాను అనుసరించాలి, ఎలాంటి ఎత్తుగడలను చేపట్టాలనే విషయంలో గందరగోళంలో పడేస్తుంది. అందువల్ల పై సూత్రీకరణలు సరైనవి కావు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఎనలేని హాని చేస్తాయి.

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి సాగించే సూపర్ లాభాల వేటలో యావత్తు కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువా తదితర పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నది, వాటిపై క్రూరంగా దాడి చేస్తున్నది. ఇందుకోసం వెనుకబడిన దేశాలలో ఫాసిస్టు పార్టీలను అధికారంలోకి తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలోనే మన దేశంలో బ్రాహ్మణవాద హిందుత్వ భావజాలం కలిగిన ఫాసిస్టు బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారాన్ని చేపట్టి గత ఆరేళ్లుగా ప్రజలపై ఫాసిస్టు దాడిని తీవ్రంగా కొనసాగిస్తున్నది. ప్రజలకు, ఆస్తులకు భద్రతను కల్పించే పేరుతో పలు నిఘా (సర్వైలెన్స్) ఉత్పత్తుల కోసం, దేశవ్యాప్తంగా సీసీ టీవీ నిఘా కెమెరాలను ఏర్పాటు చేయడం కోసం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నది. అన్ని రకాల డాటాను సమీకరిస్తున్నది. కమ్యూనికేషన్స్‌ను మోనిటరింగ్ చేస్తున్నది. విప్లవోద్యమాలను, ప్రజాస్వామిక ఉద్యమాలను, ప్రజా నిరసనలను అణచివేసే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులు అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నారు. పోలీసు బలగాలను మిలిటరీకరిస్తున్నది. పోలీసులను, పారామిలటరీ, కమాండో, సైనిక బలగాలను మోహరించి ఉద్యమాలపై క్రూరంగా దాడులు చేస్తున్నది. తమిళనాడులో స్టెరలైట్ ప్లాంటుకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనపై జరిపిన పోలీసు కాల్పులు, కశ్మీర్‌ను నిర్బంధ శిబిరంగా మార్చివేయడం, దళితులపై, రైతులపై, విద్యార్థులపై దేశంలో పలు ప్రాంతాలలో కాల్పులు ఇందుకు ఇటీవలి ఉదాహరణలు. రాజస్థాన్, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో దళితులపై దాడులు, ఆదివాసీలపై, ఈశాన్య రాష్ట్రాలలో, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఎక్కువగా జరుగుతున్నాయి. సామ్రాజ్యవాదులకు, వారి దళారీ ఫాసిస్టు పాలకులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా, మన దేశంలోనూ పీడిత ప్రజలు పెద్దెత్తున నిరసనలకు దిగుతున్నారు. ప్రపంచీకరణ రాజకీయాలకు, అర్థశాస్త్రానికీ గల సంబంధాన్ని అర్థం చేసుకోలేని ఉదారవాద ప్రజాస్వామికవాదులు పోస్టుమాడర్నిజాన్ని ప్రబోధిస్తూ వాటిని వేరువేరుగా చూస్తున్నారు. ఎన్‌జీఓ (ప్రభుత్వేతర సంస్థలు) సంస్థలు చట్టబద్ధవాదాన్ని, సంస్కరణవాదాన్ని, ఆర్థికవాదాన్ని ముందుకు తెస్తూ ప్రజల పోరాట చేవపై నీళ్లు చల్లుతున్నారు. రకరకాల రివిజనిస్టులు రూపాన్ని చూసి సారాన్ని చూడనిరాకరిస్తూ ప్రజలను రాజకీయంగా తప్పుదారి పట్టిస్తున్నారు, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్యవ్యతిరేక పోరాటాలను నీరుగారుస్తున్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ సమూల మార్పు ఆవశ్యకతను మరుగుపరుస్తున్నారు.

నిజానికి గత ఏడు దశాబ్దాలలో మన దేశంలో నాలుగు మౌలిక వైరుధ్యాలు - 1. సామ్రాజ్యవాదానికి భారత ప్రజలకు మధ్య ఉన్న వైరుధ్యం, 2. భూస్వామ్య విధానానికి, విశాల ప్రజారాశులకు మధ్య ఉన్న వైరుధ్యం, 3. పెట్టుబడికి శ్రమకూ మధ్య ఉన్న వైరుధ్యం, 4. పాలకవర్గాల మధ్య ఉన్న అంతర్గత వైరుధ్యాలు మరింత తీవ్రమయ్యాయి. ఇందులో మొదటి రెండు వైరుధ్యాలే నేటికీ భారత సమాజంలోని మౌలిక వైరుధ్యాలుగా ఉన్నాయి. తిరిగి ఈ రెండు మౌలిక వైరుధ్యాలలో భూస్వామ్య విధానానికి విశాల ప్రజారాశులకు మధ్య ఉన్న వైరుధ్యం నేటికీ ప్రధాన వైరుధ్యమే. భారత సమాజంలో కులసమస్య, మహిళా సమస్య, ఆదివాసీ సమస్య, మతమైనారిటీల ప్రత్యేకించి ముస్లిం ప్రజల సమస్య, జాతుల సమస్య ఇతర వైరుధ్యాలుగా ఉన్నాయి. పర్యావరణ సమస్య, లఘు పరిశ్రమల సమస్య, కాంట్రాక్టు లేబర్ సమస్య, బాలకార్మిక సమస్య, నిరుద్యోగ సమస్య, రిజర్వేషన్ సమస్య, విద్యా-వైద్య సమస్యలు, వెనుకబడిన ప్రాంతాల సమస్య, పౌరహక్కుల సమస్య, వృద్ధులు-అనాథలు-శారీరక, మానసిక లోపాలున్నవారు, ఇతరత్రా లోపాలున్నవారి సమస్య, నదీజలాల వాటాల సమస్య, సరిహద్దు సమస్యలు తదితరమైనవి ఇతర ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ వైరుధ్యాలను గానీ కీలకమైన సమస్యలను గానీ శిథిలమవుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ పరిష్కరించలేదు, దేశాన్ని అభివృద్ధి చేయలేదు.

కనుక భారతదేశంలో ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోయిన జాతీయ ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేసి దేశంలో సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడానికి దేశంలో కాలంచెల్లిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసి, భారత ప్రజల మూపులపై వుండి వారిని కుంగదీస్తున్న మూడు మహా పర్వతాల - సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడన, అణచివేతలను తప్పనిసరిగా రూపుమాపాలి. ఇందుకు దున్నేవారికి భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గం. ఇది దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను అనుసరిస్తుంది. కార్మికవర్గం ఈ విప్లవానికి నాయకత్వం వహిస్తుంది. రైతాంగం ఇందులో ప్రధాన శక్తిగా ఉంటుంది. మధ్యతరగతి (పెటీబూర్జువా) వర్గం నమ్మకమైన మిత్రశక్తిగా ఉంటుంది. జాతీయ బూర్జువావర్గం ఊగిసలాడే మిత్రశక్తిగా ఉంటుంది. కేవలం ఈ విప్లవం ద్వారానే సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, నిరంకుశ దళారీ బడా పెట్టుబడి దోపిడి నుంచి భారతదేశం విముక్తిని సాధించగలుగుతుంది.

# శత్రు గూఢాచార వ్యవస్థ

## అనుభవాలు-3

ఈ సారి కూడా మనం తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మరో సంఘటననే చెప్పుకోవాలి. అయితే ఈ సంఘటన మనకు చెప్పలేనంత నష్టాన్నీ, దుఃఖాన్ని కల్గించింది. ఈ సంఘటనలో, శత్రువు అత్యంత మోసపూరితమైన పథకాలద్వారా, మనల్ని తప్పుదోవ పట్టించాడు. మన కామ్రేడ్‌పైనే మనకు నమ్మకం పోయేలా చేసి, మనచేతనే ఆయనను శిక్షించేలా చేసాడు. ఇక వివరాల్లోకి వెళ్తే, 1980ల ప్రారంభానికి మహబూబ్‌నగర్ జిల్లా, అచ్చంపేట మండలంలో, మన పార్టీ నేతృత్వంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం ప్రారంభమైంది. ఆ ప్రాంతం నల్లమల అడవిలో భాగం కావడం వలన ఎత్తైన పర్వతాలతోనూ, దట్టమైన అడవితోను ఉండేది. అక్కడ చెంచు ఆదివాసీలు నివసిస్తూ ఉండేవారు. పార్టీ ఆ ప్రాంతాన్ని అప్పర్‌ప్లాట్, నల్లమల స్క్వాడ్ ఏరియాలుగా విభజించి, విప్లవోద్యమ నిర్మాణానికి రెండు దళాలను ఆ ఏరియాలకు పంపింది. ఆ ప్రాంతాలలో నివసిస్తున్న చెంచులు మూల ఆదివాసీలు కావడంతో, ప్రభుత్వ సంస్థలైన ఐ.టీ.డీ.ఏ, జీ.సీ.సీలు అక్కడ పని చేస్తుండేవి. ఈ క్రమంలో, 1980ల చివరికి అప్పర్‌ప్లాట్, నల్లమల ఏరియాలలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం తీవ్రరూపం తీసుకుంది. పార్టీ నేతృత్వంలో చెంచు ఆదివాసీలు భూస్వాముల నుండి భూములు స్వాధీనం చేసుకొన్నారు. దీంతో కొంత మంది భూస్వాములు గ్రామాలను వదిలి పారిపోయారు. ఈ పోరాటం కేవలం భూస్వాములకు వ్యతిరేకంగా మాత్రమే జరగలేదు, ఫారెస్టు అధికారుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా కూడా జరిగింది. దరిమిలా ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలు అంతమవటమే కాకుండా, ఫారెస్టుశాఖ అడవికి రావడం పూర్తిగా బంద్ పెట్టుకుంది. ఇటువంటి పరిస్థితులలో, అంటే ఉద్యమం పురోగమిస్తున్న క్రమంలో పార్టీకి మధ్యతరగతి ప్రజలనుంచి కూడా అనేక సంబంధాలు వచ్చాయి. ఈ సంబంధాలలో భాగంగానే స్థానిక ఐ.టీ.డీ.ఏలో పని చేస్తున్న వీరయ్య అనే కామ్రేడ్ మన పరిచయంలోకి వచ్చాడు. ఈయన స్థానిక ఆదివాసీలతో మంచి సంబంధాలను కలిగి ఉండేవాడు. అక్కడ ఆదివాసీలు ఈయనను గౌరవంగా 'వీరయ్యసార్' అని పిలుచుకునేవారు.

కామ్రేడ్ వీరయ్యసార్ మన పార్టీ పరిచయాలలోకి వచ్చినది మొదలు, పార్టీ ఇచ్చిన ఏ పనినైనా అత్యంత బాధ్యతగా నిర్వహించేవాడు. సప్లై పని మొదలు కొరియరింగ్ పని వరకు, ఏ పనినైనా శత్రుదృష్టి పడకుండా నైపుణ్యంగా నిర్వహించేవాడు. 1990ల వెసులుబాటు కాలంలో పార్టీ నల్లమల అటవీ ప్రాంతంలో నిర్వహించిన, రాజకీయ, మిలటరీ శిక్షణా తరగతులకూ, క్యాంపులకు అవసరమైన సప్లైలను ఐ.టీ.డీ.ఏ స్టోర్ నుంచి సమకూర్చాడు. ఇంకా అనేక సహాయ సహకారాలను అందించాడు. 1991 నాటికి రాష్ట్రంలో వెసులుబాటు పరిస్థితి పోయి, నిర్బంధం తీవ్రతరం అవటం ప్రారంభమైంది. 1992 నాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన జనార్ధన్‌రెడ్డి, పార్టీపైనా, కొన్ని వర్గ, సెక్షనల్ సంఘాలపైన నిషేధం విధించాడు. చివరికి పార్టీ సానుభూతిపరులపైన కూడా నిఘా పెట్టడం, అకస్మాత్‌గా సోదాలు జరపడం వంటి వేధింపు చర్యలు తీవ్రతరం చేసాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రభుత్వ క్రూర నిర్బంధంలో రాష్ట్రం 'కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపు'లా మారింది.

ఈ పరిస్థితులలో కామ్రేడ్ వీరయ్యసార్‌పై కూడా పోలీస్ నిఘా, వేధింపులు పెరిగాయి. అయినా ఆయన పార్టీతో తన సంబంధాలను వదులుకోలేదు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పార్టీ సంబంధాలను కొనసాగిస్తూ వచ్చాడు. దీంతో శత్రువు ఆయనను నల్లమల అటవీ ప్రాంతంలో లేకుండా చేయాలనే దురుద్దేశంతో, ఆయనపై అవినీతి ఆరోపణలు చేసి ఉద్యోగం నుంచి సస్పెన్షన్ చేయించాడు. అయినా వీరయ్యసార్ శత్రువు చేసిన కుట్రపూరిత దాడులను అర్థం చేసుకుంటూ, శత్రువుకు లొంగేందుకు సిద్ధపడలేదు. పార్టీ పక్షాన, ప్రజల పక్షాన నిలిచేందుకే నిర్ణయించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు, స్వశక్తితో వ్యవసాయం చేసేందుకు సిద్ధమైనాడు. ఈ నిర్ణయానికి అనుగుణంగా తన మకాంను శ్రీశైలంకు వెళ్ళే ప్రధాన రహదారిపై ఉన్న 'వటవారిపల్లి' గ్రామానికి మార్చుకున్నాడు. ఈ కాలంలోనే కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆయనకున్న ఒక్కగానొక్క కొడుకు పోలీసు ఉద్యోగంలో చేరాడు.

అక్కడ పోలీసు అధికారులు అతడిని ఇంటలిజెన్స్ (ఎస్.ఐ.బీ) విభాగానికి కేటాయించారు. ఎస్.ఐ.బీ విభాగం అంటే, అది విప్లవోద్యమ నిర్మూలనకు, దోపిడీ పాలకవర్గాలచే ఎక్కుపెట్టబడిన అత్యంత నేరపూరిత సంస్థ. ఈ సంస్థలో తన కొడుకు పని చేయడాన్ని వీరయ్యసార్ పూర్తిగా వ్యతిరేకించాడు. ఈ విషయం తనకు తెలియగానే పార్టీతో సంప్రదించి, కొడుకును పోలీసు ఉద్యోగం చేయవద్దనీ, ఇంటికి రమ్మని కబురు చేసాడు. కానీ కొడుకు పోలీసు ఉద్యోగం మానేందుకు సిద్ధపడలేదు. అయితే ఎస్.ఐ.బీ నుంచి ట్రాఫిక్ పోలీస్‌గా బదిలీ అయ్యాడు. ఈ క్రమంలోనే ప్రభుత్వ నిర్బంధం తీవ్రతరం కావడంతో, ఆయనకు పార్టీతో సంబంధాలు తెగిపోయాయి.

1999 నాటికి పార్టీలో దిద్దుబాటు ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో భాగంగానే భూ పంపకాలపైన సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో వీరయ్యసార్ భూముల ప్రస్తావన వచ్చింది. ఆయన సాగు చేసుకుంటున్న 10 ఎకరాల భూమి స్థానిక ఆదివాసీలు అడవి కొట్టి ఇచ్చిన భూమేననీ, కనుక ఆభూమిలో కొంత భాగం ఆదివాసులకు ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని పార్టీ వీరయ్యసార్‌కు తెలియజేసింది. దీనికి సమాధానంగా వీరయ్యసార్ 'పార్టీ తీసుకునే ఏ నిర్ణయానికైనా, తాను కట్టుబడి ఉంటానని' తెలియచేసాడు. అయితే స్థానిక ఆదివాసీలు పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. వీరయ్యసార్ చేస్తున్న భూమి అంతా పండేది కాదనీ, అందులో వచ్చే 'మాలు' ఆయన కుటుంబ అవసరాలకు మాత్రమే సరిపోతుందనీ, కనుక ఆయన భూమి తీయవద్దని పార్టీ ముందు చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్న పార్టీ, వీరయ్యసార్ నుంచి భూమిని తీయలేదు. ఈ సంఘటన తర్వాత తిరిగి వీరయ్యసార్‌తో పార్టీ, తన రెగ్యులర్ సంబంధాలను పునరుద్ధరించుకొంది.

వీరయ్యసార్ తిరిగి ఎప్పటిలాగానే పార్టీ ఇచ్చిన పనులను బాధ్యతగా నిర్వహిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆయన ఒకరోజు తన కుటుంబ స్నేహితుడి ఇంట్లో జరుగుతున్న పెళ్ళికి వెళ్ళాడు. అక్కడ సంతోష్‌రెడ్డి అనే ఎస్.ఐ పరిచయమయ్యాడు. అది మొదలు సంతోష్‌రెడ్డి ప్రతి ఆదివారం పిలవకపోయినా వీరయ్యసార్ ఇంటికి భార్యా సమేతంగా వస్తుండేవాడు. వచ్చినప్పుడల్లా సాధారణ విషయాలను ముచ్చటిస్తూనే స్థానిక పార్టీ నాయకత్వం గురించి తప్పుడు సమాచారం ఇస్తుండేవాడు. వీరయ్యసార్ మాత్రం ఎస్.ఐ చెప్పే విషయాలను మౌనంగా వింటూ, ఆ చర్చలోకి వెళ్ళకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేవాడు. ఎస్.ఐ వచ్చిపోగానే వీరయ్యసార్ స్థానిక దళాన్ని కలిసి ఎస్.ఐ చెప్పిన విషయాలను పూసగుచ్చినట్లు చెప్పేవాడు. అయితే పార్టీ ప్రారంభం నుంచే ఎస్.ఐతో సంబంధాలు కట్ చేసుకోవాలని వీరయ్యసార్‌కు చెప్తూ వచ్చింది. వీరయ్యసార్ కూడా పార్టీ డైరెక్షన్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించాడు. ఎస్.ఐతో 'మా ఇంటికి రావద్దని' సూటిగా చెప్పలేకపోయినప్పటికీ, వేరు వేరు పద్ధతుల్లో వాడితో సంబంధాన్ని తెంచుకొనేందుకు ప్రయత్నించాడు. అయినా ఎస్.ఐ మాత్రం వీరయ్యసార్‌తో సంబంధాన్ని తెంచుకోకుండా కొనసాగిస్తూనే వచ్చాడు.

ఈ క్రమంలోనే 2001లో, వటవారిపల్లికి కొంత దూరంలో, మన పీ.ఎల్.జీ.ఏ కామ్రేడ్స్‌కూ, పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో మన కామ్రేడ్స్‌కు నష్టమేమి జరగనప్పటికీ, ఆహార సమస్య ముందుకొచ్చింది. దీంతో అదే రోజు రాత్రి డివిజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ సుదర్శన్ నేతృత్వంలో ఒక టీం బాగా చీకటి పడిన తర్వాత ఎవరికంటా పడకుండా వీరయ్యసార్ ఇంటికి వెళ్ళింది. అయితే సుదర్శన్ అకస్మాత్‌గా ఇంటికి రావడం వీరయ్యసార్‌నూ, కుటుంబ సభ్యులను మొదట కొంత ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఎందుకుంటే పోలీస్‌స్టేషన్ వటవారిపల్లికి సమీపాన ఉన్న మన్ననూర్‌లో ఉంది. పోలీసులు అప్పుడప్పుడు నైట్ పెట్రోలింగ్‌కు వటవారిపల్లి దాకా వస్తుంటారు. అయితే సుదర్శన్ ఆ రోజు పగలు జరిగిన ఎన్‌కౌంటర్ సంగతి చెప్పి, భోజనం తయారు చేయవలసిన అవసరాన్ని చెప్పగానే, ఇంటిల్లిపాది రంగంలోకి దిగి ఒకగంటలో పీ.ఎల్.జీ.ఏ కామ్రేడ్స్ అందరికీ ఆహారాన్ని సమకూర్చారు. సుదర్శన్ ఆ ఆహారాన్ని తీసుకొని ఒంటరిగానే ఇంట్లో నుంచి బయటకు వచ్చి, మిగిలిన కామ్రేడ్స్‌ను కలిసేందుకు నడక ప్రారంభించాడు. అంతే, కొద్ది నిమిషాలలోనే మాటుగాసి ఉన్న నరహంతక పోలీసు బృందం సుదర్శన్‌పై పడి పట్టుకొని, అక్కడే కాల్చేసారు. సెంట్రీలో ఉన్న కామ్రేడ్స్‌పై మరో పోలీసు బృందం కాల్పులు చేసింది. ఈ హటాత్పారిణామం నుంచి సెంట్రీ కామ్రేడ్స్ తేరుకొని, చాకచక్యంగా తప్పుకున్నారు.

ఈ సంఘటనలో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ శ్రేణుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన జరిగి కొద్ది రోజుల తర్వాత పార్టీ వీరయ్యసార్‌ను పిలిచి ప్రశ్నించింది. వీరయ్యసార్ తనకేమి తెలియదని బదులిస్తూ, ఆ రోజు జరిగిన సంఘటనను వివరించాడు. 'పార్టీకి ఎటువంటి పరిస్థితుల్లోనూ నష్టం చేయననీ, అటువంటి ఆధారాలుంటే కాల్చేయమని' కన్నీటి పర్యంతమయ్యాడు. పార్టీ నాయకత్వం కూడా వీరయ్యసార్ ఇచ్చిన వివరణకు కొంతమేరకు సమాధానపడి ఆయనను వదిలివేసింది. వీరయ్యసార్‌ను పార్టీ ఇంటరాగేషన్ చేసిందన్న విషయం స్థానిక ఆదివాసీ రైతుకూలీసంఘం కామ్రేడ్స్‌కు తెలిసి వీరయ్యసార్‌ను అనుమానించాల్సిన అవసరం లేదని పార్టీ ముందు మాట్లాడారు. అయితే వీరయ్యసార్ ఇంట్లో సహాయకుడిగా ఉంటున్న తమ సామాజిక గ్రూపు (చెంచు)కు చెందిన వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేసారు. అతడెప్పుడూ వీరయ్యసార్ ఇంట్లోనే ఉంటాడనీ, ఆసంఘటన జరిగిన రోజు కూడా వీరయ్యసార్ ఇంట్లోనే వున్నాడని చెప్పారు. గతంలో ఈ చెంచువ్యక్తి ఒకసారి పోలీసుస్టేషన్ వద్ద అనుమానాస్పద స్థితిలో కన్పించినప్పుడు తాము పార్టీ దృష్టికి తెచ్చినప్పటికీ, పార్టీ పట్టించుకోలేదన్న విషయాన్ని కూడా కూడా గుర్తు చేస్తూ విమర్శనాపూర్వకంగా మాట్లాడారు.

ఈ పరిణామాలన్నీ జరుగుతున్న క్రమంలోనే స్థానిక ప్లాటూన్ కమాండర్ క్రమశిక్షణారాహిత్యంగా, అరాచకంగా వీరయ్యసార్‌ను పిలిచి కాల్చేసాడు. ఈ చర్యను స్థానిక ఆదివాసీ ప్రజానీకమంతా తీవ్రంగా వ్యతిరేకించింది. మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ కమిటీ కూడా ప్లాటూన్ కమాండర్‌పై క్రమశిక్షణా చర్య తీసుకోవాలని నిర్ణయించింది. వీరయ్యసార్ మరణంతో అప్పటిదాక ఇంట్లో సహాయకుడిగా ఉన్న చెంచువ్యక్తి పరారై, వేరే గ్రామంలో తలదాచుకొన్నాడు. ఈ విషయం స్థానిక ప్రజలకు అర్థమై అతడిని పట్టుకొనేందుకు పార్టీకి సహకరించారు. పార్టీ ఆ చెంచు వ్యక్తిని పట్టుకొని ఇంటరాగేషన్ చేసింది. ఈ సందర్భంగా అతడు జరిగిన విషయాన్నంతా పార్టీ ముందుంచాడు. ఈ రిపోర్ట్ ప్రకారం ఎస్.ఐ సంతోష్‌రెడ్డి వీరయ్యసార్ ఇంటికి వస్తున్న క్రమంలోనే, ఆ ఇంట్లో సహాయకుడిగా ఉన్న ఈ చెంచు వ్యక్తిని డబ్బుఆశ చూపి లోబరుచుకున్నాడు. అప్పటి నుంచి ఇతను వీరయ్యసార్‌కు మరింత నమ్మకమైన వ్యక్తిగా రాత్రింబవళ్ళు సేవచేస్తూ, ఎప్పటికప్పుడు వీరయ్యసార్ చేస్తున్న పార్టీ పనులను తెలుసుకొని, ఎస్.ఐకి తెలియజేస్తుండేవాడు. వీరయ్యసార్‌కు ఏ మాత్రం అనుమానం రాకుండా చూసుకునేవాడు. వీరయ్యసార్‌కు కూడా అతడిపై ఏ మాత్రం అనుమానం కలగలేదు. అయితే ఒకసారి స్థానిక సంఘం కామ్రేడ్స్‌కు ఇతడి వ్యవహారంపై అనుమానం వచ్చి పార్టీకి తెలియజేసినప్పటికీ, అతడి వర్గ సంపుటినీ, సామాజిక గ్రూపును దృష్టిలో ఉంచుకొని, అతడిని పార్టీ అనుమానించలేదు. నిర్దిష్ట సమస్యను నిర్దిష్టంగా చూడకుండా సాధారణ విశ్లేషణ నుంచి పార్టీ అతడిని అనుమానించలేదు. పర్యావసానంగా వీరయ్యసార్‌ను అనుమానించాల్సి వచ్చింది. చివరకు చెంచువ్యక్తి నుంచి వాస్తవాలన్నింటిని రాబట్టిన తర్వాత అతడిని ప్రజలలో విచారించి శిక్షించడం జరిగింది. ఈ క్రమంలోనే ప్లాటూన్ కమాండర్ తనపై వస్తున్న విమర్శలను భరించలేక, పార్టీ తీసుకొనే క్రమశిక్షణా చర్యకు సిద్ధపడక ఒకరోజు రాత్రి భార్యనూ, కొంత డబ్బును తీసుకొని పారిపోయాడు.

ఈ ఘటనలో శత్రువు 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలు' అన్న చందంగా, ఒకే మోసపూరిత పథకంతో కామ్రేడ్ సుదర్శన్‌ను వాడే చంపాడు. కామ్రేడ్ వీరయ్యసార్‌ను మనచేత చంపించాడు. పార్టీ వీరయ్యసార్ మరణానికి పశ్చాత్తాపపడుతూ కుటుంబాన్ని పిలిచి తాము చేసిన తీవ్రమైన తప్పును ఒప్పుకుంటూ, బాధనూ, దుఃఖాన్ని వ్యక్తపరుస్తూ, వారి ముందు ఆత్మవిమర్శ చేసుకున్నది. వీరయ్యసార్ కుటుంబం పార్టీ చేసుకున్న ఆత్మవిమర్శతో కొంతమేరకు సమాధానపడుతూ దుఃఖం నుంచి తేరుకున్నది. ఈ తప్పు మన పార్టీ చరిత్రలో సరిదిద్దుకోలేని తప్పుల్లో ఒకటిగా మిగిలింది. అత్యంత బాధకరమైన చేదు అనుభవంగా హృదయభారాన్ని పెంచింది. ఈ సందర్భంగా కామ్రేడ్ మావో చెప్పిన ఈ కింది సూక్తిని మన కార్యాచరణకు మార్గదర్శిగా ఎంచుకొని ఇటువంటి ఘోరమైన తప్పిదాలను జరగకుండా నివారించకోవాలి. శత్రువులను శిక్షించే సమయంలో "ఒక దోషి మన నుండి తప్పించుకున్నా పరవాలేదు, ఒక నిర్దోషిని మాత్రం ఎటువంటి పరిస్థితులలోను శిక్షించరాదు".

**"సిద్ధాంతం అనేది, జనాల మీద పట్టు సాధించినప్పుడే అది ఒక భౌతిక శక్తి అవుతుంది. సిద్ధాంతం, జనాలపై ఎప్పుడు పట్టు సాధిస్తుందంటే, అది వారి ప్రయోజనాలను ప్రదర్శించినప్పుడు. అది, జనాల ప్రయోజనాలను ఎప్పుడు ప్రదర్శిస్తుందటే, అది 'రాడికల్' (సమూలమైన మార్పును కలిగించేది) అయినప్పుడు. అది, 'రాడికల్' కావాలీ అంటే, 'విషయంలోని మూలాన్ని' గ్రహించాలి".**

– (మార్క్స్, ఆన్ రెలిజియన్, పే.46, మాస్కో, 1975)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర రీజినల్ బ్యూరో

**పత్రికా ప్రకటన**

*అక్టోబర్ 15, 2020*

విప్లవ మేధావి, ప్రజాస్వామికవాది, పౌరహక్కుల ఉద్యమనేత, ప్రజల శ్రేయోభిలాషి కామ్రేడ్ శేషయ్యసార్ మరణానికి మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాం. ఆయనకు మా విప్లవ జోహార్లు.

కామ్రేడ్ శేషయ్యసార్ మరణంపట్ల ఆయన కుటుంబానికీ, మిత్రులకు మా పార్టీ కేంద్ర రీజినల్ బ్యూరో ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది. ఆయన కొద్దిరోజులుగా అస్వస్థతతో ఉంటూ, 2020 అక్టోబర్ 10న, తన 64వ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం దేశంలో విప్లవ, ప్రజాస్వామిక, పౌరహక్కుల, ప్రగతిశీల, పీడిత జాతుల ఉద్యమాలకూ, ప్రజాహితం కోసం జరుగుతున్న ఉద్యమాలకు తీవ్రమైన నష్టం. ఈ నష్టం వెంటనే పూడ్చుకోలేనిది కూడ.

శేషయ్య విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడైనాడు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రభంజనంలా ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న విప్లవకర విద్యార్థి ఉద్యమానికి నేతృత్వం వహించిన రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి, అనతికాలంలోనే దాని తొలి ఉపాధ్యక్షుడయ్యాడు. 'ఆర్.ఎస్.యు'కు నేతృత్వబాధ్యత చేపట్టిన శేషయ్య, ఆనాటి విద్యార్థి ఉద్యమాన్ని కేవలం విద్యార్థి సమస్యలకే పరిమితం చేయకుండా, మొత్తం సమాజంలో మౌలిక మార్పుకోసం జరిగే ఉద్యమంగా మలచడంలో కూడా ముఖ్యమైన భూమికను పోషించాడు.

శేషయ్య తన చదువు పూర్తి అయిన తర్వాత, తన సొంత జిల్లా కర్నూల్‌ను వదిలి, అనంతపూర్‌లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో డీన్‌గా కొలువులో చేరాడు. ఆయన ఆచార్య (ప్రొఫెసర్) వృత్తిని చేపట్టిన తర్వాత కూడా తన సామాజిక బాధ్యతను ఒక్క క్షణం కూడా మరచిపోలేదు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక ఉద్యమంగా కొనసాగుతున్న పౌరహక్కుల ఉద్యమంలో చేరి, అందులో చురుకైన పాత్రను నిర్వహించాడు. క్రమంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలకమైన బాధ్యతలు చేపట్టాడు.

1990 దశకంలో రాష్ట్ర పౌరహక్కుల ఉద్యమంలో, ముఖ్యంగా హక్కుల దృక్పథంలో తలెత్తిన మితవాద వైఖరులను ఎదుర్కోవడంలో నాయకత్వ పాత్రను పోషించాడు. అంతేకాదు, హక్కుల దృక్పథాన్ని సమాజంలోని ఆధిపత్య వ్యవస్థలుగా ఉన్న భూస్వామ్యం, వక్రీకరించిన పెట్టుబడిదారీ విధానం, కుల వ్యవస్థ, పితృస్వామ్యం వంటి వాటితోపాటు, వీటికి సేవచేస్తూ, మద్దతుగా ఉన్న రాజ్యవ్యవస్థకు వ్యతిరేకంగా నిలబెట్టి అభివృద్ధి పరిచాడు. సమాజంలోని ఆధిపత్య వ్యవస్థలతోపాటు, రాజ్యవ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలకు మద్దతుగా, వాటితో విడదీయరాని ఉద్యమంగా పౌరహక్కుల ఉద్యమాన్ని మలిచాడు. దోపిడీ పునాదులపై ఏర్పడిన మనదేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజాన్నీ, దాని రాజ్యాంగ యంత్రాన్ని సామరస్య ధోరణిలో ప్రజాస్వామికరించవచ్చనే లిబరల్ ప్రజాస్వామిక దృక్పథం నుంచి స్పష్టమైన విభజనరేఖ గీసి, పౌరహక్కుల ఉద్యమానికి పోరాట దృక్పథాన్ని ఏర్పరిచాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కామ్రేడ్ శేషయ్య నేతృత్వంలో పౌరహక్కుల ఉద్యమం స్పృశించని సమస్య లేదంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. రాయలసీమ ఫ్యాక్షన్ సమస్య మొదలు, నీరు, దళిత, ఆదివాసీ, మైనార్టీ, మహిళా, రాజ్యహింసవరకు అనేక సమస్యలపై పౌరహక్కులసంఘం పీడిత ప్రజల పక్షాన దృఢంగా నిలిచింది. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజా సమస్యలపై, రాజ్య నిర్బంధంపై ఏర్పడిన అనేక ఐక్యవేదికలకు పౌరహక్కుల సంఘం నేతృత్వం వహించింది. అంతేకాదు దేశ వ్యాపితంగా ఏర్పడిన హక్కుల సంఘాల ఐక్యవేదిక (సి.డి.ఆర్.ఒ)లో కీలకమైన పాత్ర పోషించింది. ప్రస్తుతం అదే భూమికను పోషిస్తున్నది. సంస్థ నిర్వహిస్తున్న ఈ మొత్తం ప్రగతిశీల, ప్రజాస్వామిక కార్యచరణలో సంస్థ నాయకుడుగా శేషయ్య నిర్వహించిన పాత్ర అత్యంత కీలకమైనది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శేషయ్య రెండు రాష్ట్రాల కో-ఆర్డినేషన్ కమిటీకి జాతీయ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి, పౌరహక్కుల ఉద్యమాన్ని మరింతగా పటిష్టం చేసేందుకు కృషి చేసాడు. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్యం దెబ్బతిని తుదిశ్వాస విడిచారు.

దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం రోజు రోజుకు పెచ్చరిల్లుతూ, ప్రజల ప్రజాస్వామిక, పౌరహక్కులకు మరింతగా విఘాతం కలిగిస్తున్న పరిస్థితుల్లో కామ్రేడ్ శేషయ్య మరణం, దేశంలోని ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమాలతోపాటు, అన్ని ప్రజా ఉద్యమాలకు తీవ్రమైన నష్టమే. ఇటువంటి పరిస్థితులలోనే కామ్రేడ్ శేషయ్య స్ఫూర్తితో నేడు దేశంలో తీవ్రతరమవుతున్న మోడి నేతృత్వంలోని బ్రాహ్మణవాద హిందూ ఫాసిజానికీ, అది సేవ చేస్తున్న సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో భాగం కావాల్సిందిగా మా కేంద్ర రీజినల్ బ్యూరో ప్రజాస్వామిక వాదులకూ, ప్రగతిశీలకాముకులకూ, ప్రజల శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేస్తున్నది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు),
కేంద్ర రీజినల్ బ్యూరో.

# ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

*తేది : ఏప్రిల్ 25, 2021*

పత్రికా ప్రకటన

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రహార్‌దాడితో, గుండెజారిన జలంధర్‌రెడ్డి పాలకవర్గాల పంచన చేరి, పరమ నీచమైన అబద్ధాలతో విప్లవోద్యమంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం!

జలంధర్ రెడ్డి మార్చి, 2021లోనే తన తోటి పార్టీ క్యాడర్లకుగానీ, కిందిస్థాయి పార్టీ శ్రేణులకుగాని ఏ మాత్రం చెప్పకుండా పిరికితనంతో పారిపోయాడు. ఈ విషయం అర్థంకాగానే ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ ఆయనను ఎలాగైనా కలిసి మాట్లాడాలని ప్రయత్నించింది. కానీ, జలంధర్ రెడ్డి నేరుగా పోలీసుల చెంతకు చేరి, వారితో మంతనాలు జరిపి, ఏప్రిల్ 20న లొంగుబాటు అవతారాన్ని ప్రదర్శించాడు. జలంధర్ రెడ్డి పీడిత ప్రజలకూ, విప్లవోద్యమానికి చేసిన ద్రోహాన్ని పీడిత ప్రజలు, విప్లవ శ్రేణులు ఎన్నటికీ మరచిపోలేరు. తగిన గుణపాఠం చెబుతారు.

జలంధర్ రెడ్డి 1998లోనే పార్టీలోకి భర్తీ అయ్యాడు. గడిచిన ఈ 23 సంవత్సరాల కాలంలో, ఆయనలో విప్లవ కార్యాచరణతోపాటు, బలహీనతలు కూడా తీవ్రంగా కొనసాగుతూ వచ్చాయి. ఈ రెండు దశాబ్దాల కాలంలో సెక్టేరియనిజం ఆయనలో ఒక జబ్బుగానే కొనసాగుతూ వచ్చింది. ఫలితంగా అనైక్యతలకు కేంద్రబిందువుగా ఉంటూ వచ్చాడు. సస్పెన్షన్లకూ, డిమోషన్‌కు గురయ్యాడు. అయితే పార్టీ ఆయనలో కొనసాగుతున్న తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతూ, ఆయన దృక్పథంలో సమూల మార్పు తెచ్చేందుకు కృషి చేసింది. కానీ పార్టీ అందించిన సహకారాన్ని అందుకోలేక, పాత బలహీనతల ఊబిలోకి మరింతగా కూరుకుపోతూ, ప్రభుత్వదాడి తీవ్రతరమైన నేపథ్యంలో అతడిలో విప్లవతత్వం పూర్తిగా నశించింది. బలహీనతలు తీవ్రస్థాయికి చేరి ప్రాణభీతితో, స్వార్థంతో పలాయనం చిత్తగించాడు. పైగా అత్యంత హేయమైన అవకాశవాదంతో తాను వచ్చినప్పటిలాగా ఉద్యమ పరిస్థితులు ప్రోత్సహకరంగా లేవనీ, ప్రజల మద్దతు లేదనీ, భర్తీ రావడం లేదనీ, ప్రభుత్వ సంస్కరణల వలన ప్రజలకు మేలు జరుగుతున్నదని పరమనీచంగా ఆత్మవంచన చేసుకుంటూ అబద్ధాలను అలవోకగా మాట్లాడుతూ విప్లవోద్యమంపై దాడి చేసాడు. జలంధర్ రెడ్డి పోలీసుల సమక్షంలో విప్లవోద్యమంపై చేసిన అసత్య ప్రకటననూ, వక్రీకరణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. విప్లవోద్యమం ఈ రెండు దశాబ్దాల కాలంలో అభివృద్ధి చెందిందేగానీ, దెబ్బతినలేదు. విప్లవోద్యమానికి ప్రజల మద్దతు పెరుగుతూ వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. పోరాడుతున్న ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో మా పార్టీ ప్రజలవైపు దృఢంగా నిలబడి వారికి నాయకత్వం వహిస్తున్నది. ఈ వాస్తవాలను చూడ నిరాకరించడం వల్లనే, తన శేష జీవితాన్ని బూర్జువా పాలకవర్గాలకు సేవచేస్తూ తరించాలనే ప్రగాఢమైన కోరిక ఉండటంవల్లనే జలంధర్ రెడ్డి ప్రభుత్వానికి లొంగిపోయాడు.

ప్రభుత్వం జలంధర్ రెడ్డికి రివార్డు కింద 20 లక్షల రూపాయలు ఇస్తున్నట్లుగా ప్రకటించింది. ఈ 20 లక్షలు ప్రజాధనమే. ప్రజల రక్తం నుంచీ, స్వేదం నుంచి తయారైనవే. ఇటువంటి ప్రజాధనాన్ని అనుభవిస్తూ, తిరిగి ప్రజలపై దాడి చేసేందుకు ప్రభుత్వంతో అంటకాగుతున్న జలంధర్ రెడ్డి ద్రోహపూరిత చర్యను ప్రజలు క్షమించరు. జలంధర్ రెడ్డి ప్రభుత్వం నుంచి 20 లక్షల రూపాయలను రివార్డుగా తీసుకోవడాన్ని పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

జలంధర్ రెడ్డి పార్టీలో ఉన్నప్పుడు ముఖ్యంగా ఎమ్.కె.బి డివిజన్ సెక్రటరీగా ఉన్నప్పుడు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టుదాడి తీవ్రమైన నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చెబుతూ, డివిజన్ కమిటీ తరపున ప్రజలనుద్దేశిస్తూ ఒక లేఖ విడుదల చేసాడు. అందులో ఉద్యమ అభివృద్ధిపై చాలా స్పష్టమైన రిపోర్టు ఉంది. అలాగే దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా తెగించి పోరాడాల్సిన ఆవశ్యకతను కూడా ఆ లేఖ తెలియజేస్తుంది. ఈ లేఖలో పొందుపరిచిన వాస్తవాలనూ, సత్యాలను పూర్తిగా వక్రీకరిస్తూ, అవకాశవాదం మూర్తిభవించిన జలంధర్ రెడ్డి పార్టీపై దాడి చేస్తున్నాడు. అతను పోలీసుబాస్‌లతో కలిసి మాట్లాడే అబద్దాలను బహిర్గతపరిచేందుకూ, వాస్తవాలను అర్థం చేసుకునేందుకు ఆ లేఖను కూడా మా ప్రకటనకు జత చేస్తున్నాం.

**గణేష్ (అధికార ప్రతినిధి),**

Ganesh

**ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ,

**తేది: ఏప్రిల్ 25, 2021**

పత్రికా ప్రకటన

## తెలంగాణాలో 16 ప్రజాసంఘాలపై
## కే.సీ.ఆర్ ప్రభుత్వం విధించిన నిషేధం అప్రజాస్వామికం!
## 16 ప్రజాసంఘాలపై విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం!!

ఏప్రిల్ 23న తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ సమస్యలపై పోరాడుతున్న 16 ప్రజా సంఘాలపై తొలిసారిగా నిషేధం విధించింది. వీటిలో విరసం, పౌరహక్కుల సంఘం మొదలుకొని తెలంగాణ ప్రజాఫ్రంట్, గోండు గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న తుడుందెబ్బ వంటి ప్రజా సంఘాలున్నాయి. ఇవి నిషేధిత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కి అనుబంధంగా పని చేస్తూ, చట్టవ్యతిరేక, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనీ, కార్యకర్తలను ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ఉసిగొల్పుతున్నాయని ప్రభుత్వం ఆరోపించింది. అందుకే వీటిని 'చట్ట విరుద్ధ సంఘాలు'(అన్ లాఫుల్ అసోసియేషన్స్)గా గుర్తించి నిషేధం విధిస్తున్నామని ప్రకటించింది. దీనికి సంబంధించి ప్రభుత్వ కార్యదర్శి శోమేష్ కుమార్ ఉత్తర్వుల(జీ.వో నెం. 73)ను జారీ చేసాడు. మార్చి 30 నుంచి ఏడాదిపాటు, ఈ నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటాయనీ, రాష్ట్రంలో 33 జిల్లాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రభుత్వం తెలిపింది.

కే.సీ.ఆర్ నేతృత్వంలోని టీ.ఆర్.ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని 16 ప్రజాస్వామిక సంస్థలపై విధించిన నిషేధాన్ని అత్యంత క్రూరమైన ఫాసిస్టు చర్యగా భావిస్తున్నాము. కే.సీ.ఆర్ ప్రభుత్వం ఆ సంస్థలపై చేసిన ఆరోపణలన్నీ ఉద్దేశపూర్వకంగా రూపొందించిన కట్టుకథలనీ, హేయమైన అబద్ధాలని తెలియచేస్తున్నాం. ఇప్పటిదాకా కనీసం 'చట్టబద్ధపాలన' ముసుగునైనా కప్పుకున్న కే.సీ.ఆర్ ప్రభుత్వం నేడు ఆ ముసుగును కూడా తొలగించుకొని బరితెగించి ప్రజాస్వామిక ఉద్యమాలపైనా, సంస్థలపైనా, వ్యక్తులపైన ఫాసిస్టుదాడికి దిగింది. ప్రభుత్వ ప్రకటనలో మరో విచిత్రమైన అంశం కూడా ఉంది. అది ఏమిటంటే ఈ 16 సంఘాలు భీమా కోరేగావ్ కేసు, ఉపాచట్టం కింద అరెస్టయిన విరసంనేత వరవరరావు, జీ.ఎన్ సాయిబాబ, రోనావిల్సన్ తదితరులను విడుదల చేయాలంటూ డిమాండ్ చేస్తున్నాయనీ, ఇది కూడా చట్టవ్యతిరేక చర్యేనని మరో ఆరోపణను కూడా చేర్చింది. నిజంగానే ఇది చట్టవ్యతిరేక చర్యే అయినట్లయితే, దీనికి ప్రతిక్రియగా నిషేధమే విధించాల్సి వస్తే రాహుల్‌గాంధీ, చిదంబరం వంటి ప్రముఖ బూర్జువా నాయకులు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీని మొదలుకొని వామపక్ష పార్టీలనూ, అనేక ప్రజాస్వామిక సంస్థలను నిషేధించాల్సి ఉంటుంది. కానీ వాటేటిని నిషేధించకుండా తెలంగాణలో ప్రజల ప్రయోజనాలకు అంకితమై, వారి పక్షాన దృఢంగా నిలిచి పోరాడుతున్న 16 ప్రగతిశీల, పురోగామి, విప్లవకర సంస్థలను మాత్రమే కే.సీ.ఆర్ ప్రభుత్వం నిషేధించింది. వాస్తవంగా ఆ సంఘాలు చేపట్టిన చట్టవ్యతిరేక విధ్వంసకర కార్యకలాపాలేమి లేవు. ప్రభుత్వం కూడా అవి అటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా ఎప్పుడూ, ఎక్కడా కూడా రుజువు చేయలేదు. అవి చేస్తున్నదల్లా ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక రాజకీయాలను వేరు వేరు సంస్థల రూపంలో, వేరు వేరు కార్యక్షేత్రాలలో ప్రజల వద్దకు తీసుకెలుతున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న టీ.ఆర్.ఎస్ పార్టీతోపాటు ఇతర బూర్జువా, వామపక్ష పార్టీలతోనూ, ఇతర ప్రజా సంస్థలతోను ఈ సంఘాలు కలిసి పని చేసాయి. ప్రస్తుతం కూడా ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రజా పోరాటాలను నిర్వహిస్తున్నాయి. కానీ కే.సీ.ఆర్ ప్రభుత్వం ఈ సంస్థలు నిర్వహిస్తున్న ప్రజాస్వామిక కార్యకలాపాలనూ, వాటి రాజకీయ స్వేచ్ఛను ఏ మాత్రం భరించలేకపోతున్నది. రాష్ట్రంలో ఈ పాటి రాజకీయ స్వేచ్ఛను కూడా లేకుండా చేసేందుకే చౌకబారు ఎత్తుగడలతో, అబద్ధాలతో, కట్టుకథలతో ప్రణాళికాబద్దంగా ఈ నిషేధపు ఉత్తర్వులను వండివార్చింది.

ఇక్కడ మేము చెప్పదలచుకున్నది ఒక్కటే, రాజకీయ స్వేచ్ఛ ఒకరిస్తే పుచ్చుకునేది కాదు, ఒకరు తీసేస్తే పోయేది కాదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇప్పటికే మరింత స్పష్టతను ఇచ్చింది. ఒక వ్యక్తికి సంబంధించిన రాజకీయ భావనలకూ, ఆలోచనా రీతులకూ, దృక్పథానికి ఎటువంటి నిషేధమూ ఉండరాదని తేల్చి చెప్పింది. ఈ తీర్పు ప్రకారం వ్యక్తులు గానీ, సంస్థలు గాని మార్క్సిజం–లెనినిజం–మవోయిజాన్ని ఒక దృక్పథంగా స్వీకరించడం, ప్రచారం చేయడం సైతం చట్టవిరుద్ధమేమి కాదు. కానీ కే.సీ.ఆర్ ప్రభుత్వం ఆ 16 సంఘాలకు చెందిన ప్రజాస్వామిక, విప్లవకర మార్గదర్శక ఆలోచనల(గ్రైడింగ్ థాట్‌ల)పైనే నిషేధం విధించింది. మరోవైపు వాటికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)తో సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని నిషేధానికి ఒక సాకుగా చూపిస్తున్నది.

కే.సీ.ఆర్ ప్రభుత్వం తెలంగాణలో 16 ప్రజాస్వామిక సంఘాలపై నిషేధం విధించడానికి ఒక రాజకీయ నేపథ్యం కూడా ఉంది. తెలంగాణలో రెండవసారి కూడా అధికారంలోకి వచ్చిన కే.సీ.ఆర్ నేతృత్వంలోని టీ.ఆర్.ఎస్ పార్టీ, ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలను ఏ మాత్రం నెరవేర్చలేకపోయింది. ఇది కూడా పాత పాలకపార్టీల మాదిరిగానే బ్రాహ్మణవాద హిందూత్వ ఫ్యూడలిజానికీ, సామ్రాజ్యవాదానికి సేవ చేయడంలోనే తరించిపోతున్నది. ప్రజల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నది. ఇదే సమయంలో కరోనా విపత్తు రెండవసారి ప్రబలటంతో కే.సీ.ఆర్ ప్రభుత్వం ప్రజల గోడును ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే కే.సీ.ఆర్ పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారి, ప్రజల సమస్యలు తీవ్రతరమైనాయి. ఈ పరిస్థితులలో ప్రజల ఆవేదననూ, అసంతృప్తిని ఒక ప్రజాస్వామిక మార్గంలో పోరాట చైతన్యంగా మార్చడంలో ఈ 16 సంఘాలు కీలకంగా పని చేస్తున్నాయి. అంతేకాదు, ప్రజల ముందు ఒక ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ రాజకీయాలను ఉంచుతున్నాయి. ఈ ప్రత్యామ్నాయ రాజకీయాలనే కే.సీ.ఆర్ ప్రభుత్వం భరించలేకపోతున్నది. ఈ రాజకీయాలను తన మనుగడకు ప్రమాదంగా భావిస్తున్నది. అందుకే కే.సీ.ఆర్ ప్రభుత్వం 16 సంఘాలపై నిషేధాన్ని విధించింది. తెలంగాణాలో తిరిగి చీకటిపాలనకూ, పోలీసురాజ్యానికి తెరలేపింది.

అయితే ఈ క్రూరమైన ఫాసిస్టు నిషేధపు ఉత్తర్వులో కేంద్ర ప్రభుత్వ పాత్ర లేదనుకోవల్సిన అవసరం లేదు. కేంద్రంలో నిరంకుశ పాలన కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ నిషేధం ప్రకటించబడింది. కేంద్రానికీ, రాష్ట్రాలకు మధ్య ప్రజలను దోపిడీ చేసి, సంపదను దక్కించుకునే విషయంలో కొన్ని వైరుధ్యాలున్నప్పటికీ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా నయాఉదారవాద విధానాలను అమలు చేయడంలోనూ, ఈ అమలును సజావుగా కొనసాగించేందుకు పునాదిగా ఉన్న బ్రాహ్మణవాద హిందూత్వ ఫ్యూడలిజాన్ని కాపాడటంలోనూ, సంఘటితపర్చడంలోను ఈ పార్టీల మధ్య వైరుధ్యాలేమి లేవు. అలాగే వీటి దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ముందుకు వస్తున్న, పురోగమిస్తున్న ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు ఫాసిస్టు విధానాలను అమలు చేసే విషయంలో కూడా వీటి మధ్య వైరుధ్యం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉపావంటి క్రూరమైన చట్టాన్నీ, ఎన్.ఐ.ఏ వంటి ప్రతీఘాతుక సంస్థను ముందుకు తెచ్చి దేశవ్యాపితంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, దళితులు, మత మైనారిటీలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ఇలా అన్ని పీడిత వర్గాలపైనా, పీడిత సెక్షన్‌లపైన దాడిని ప్రారంభించి, ఉధృతం చేస్తున్నది. ఈ ఫాసిస్టుదాడి పథకంలో భాగంగానే మొదటిసారిగా 16 ప్రజాస్వామిక సంఘాలపై నిషేధం విధించబడింది. ఈ నిషేధం నెమ్మదిగా ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, హర్యానా ఇలా అనేక రాష్ట్రాలలోని ప్రజాస్వామిక సంస్థలపైన మోపబడి విస్తరించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

***ప్రియమైన ప్రజలారా, ప్రజాస్వామికవాదులారా!***

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణలో 16 ప్రజాసంఘాలపై విధించిన ఈ నిషేధానికి వ్యతిరేకంగా, రాజకీయ స్వేచ్ఛకోసం ఉద్యమించాల్సిందిగా దేశవ్యాపితంగా ఉన్న ప్రజాస్వామిక సంస్థలకూ, వ్యక్తులకూ, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. దేశంలోనూ, రాష్ట్రాలలోను కొనసాగుతున్న ఫాసిస్టుపాలనలను సంఘటిత పోరాటాల ద్వారానే ఎదుర్కోగలుగుతాం. గత చరిత్ర ఈ విషయాన్ని ఇప్పటికే రుజువు చేసింది. కనుక ఇటువంటి క్లిష్ట సమయంలోనే ప్రజల ప్రయోజనాలవైపు మరింత దృఢంగా నిలబడాలి. అరెస్టులకూ, చిత్రహింసలకు సిద్ధపడాలి. త్యాగాలకు వెరవకూడదు. 'సమరశీలంగా పోరాడటం ద్వారానే, పోరాటం ద్వారా మాత్రమే' రాజకీయ స్వేచ్ఛనూ, ఇతర హక్కులను కాపాడుకోగలుగుతాం!

Abhay

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# ఆంధ్రా ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

తేది : 18-6-2021

## పత్రికా ప్రకటన

జూన్ 16, బుధవారం తెల్లవారురుఝామున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా, కొయ్యూరు మండలం, యూచీడిపాలేం పంచాయితీ, తీగలమెట్ట గ్రామ పరిసరాలలో గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు అకస్మాత్తుగా చేసిన సాయుధదాడిలో మా కామ్రేడ్స్ ఆరుగురు అమరులైనారు.

1. కామ్రేడ్ రణదేవ్ (మాడి ముఖేష్) ఎమ్.కే.వీ.బీ డివిజన్ కమిటీ సభ్యుడు, గ్రామం: పెద్దటేకుగూడ, పంచాయితీ: బొడిగడ్డ, బ్లాక్: కలిమెల, (మల్కనగిరి జిల్లా, ఒడిశా రాష్ట్రం)
2. కామ్రేడ్ అశోక్ (సందె గంగయ్య) ఎమ్.కే.వీ.బీ డివిజన్ కమిటీ సభ్యుడు, గ్రామం: గుంపుల, మండలం: ఓదేల (పెద్దపల్లి జిల్లా, తెలంగాణ రాష్ట్రం)
3. కామ్రేడ్ అంజన్న (సన్ను), (ఏ.సీ.ఎమ్) గ్రామం: కర్కవాడ, పంచాయితీ: కిర్పి, బ్లాక్: బోపాల్‌పట్నం, ఏరియా: నేషనల్ పార్క్, పశ్చిమ్ బస్తర్ డివిజన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం)
4. కామ్రేడ్ కడితి పాయికే (పీ.ఎమ్, సప్లై దళం), గ్రామం: తిమ్మెం, ఏరియా, బ్లాక్: బైరన్‌గడ్, పశ్చిమ్ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం)
5. కామ్రేడ్ లలిత (పీ.ఎమ్, గాలికొండ దళం) గ్రామం: ఫేములగొంది, పంచాయితీ: గుమ్మిరేవుల, మండలం: గూడెం కొత్తవీధి, (విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం)
6. మడకం చైతే (పీ.ఎమ్) గ్రామం: గోర్నాం, బ్లాక్: బీజాపూర్, పశ్చిమ్ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం)

వీరందరికీ ఏ.ఓ.బీ స్పెషల్ జోనల్ కమిటీ తరపున తలవంచి వినమ్రంగా జోహార్లు తెలియజేస్తున్నాము.

ఈ దాడి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కోవర్టు ఆపరేషన్స్‌లో స్పెషలిస్టయిన డీ.జీ.పీ గౌతమ్‌సవాంగ్ నేతృత్వంలో జరిగింది. ఈ నష్టం మాకు తీవ్రమైనదే. అయితే పీడిత ప్రజల ప్రయోజనాలకోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన స్వప్రయోజనాలను కాపాడుకొనేందుకు ముఖ్యంగా హైకోర్టులో తనపై అవినీతి, మోసం, ఛీటింగ్ వంటి కేసులలో జరుగుతున్న విచారణలో, మోడీని ప్రసన్నం చేసుకునేందుకు కేంద్రానికి తొత్తులా వ్యవహరిస్తున్నాడు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రూపొందించిన ప్రజావ్యతిరేక చట్టాలైన కశ్మీర్ స్వయం ప్రతిపత్తికి చెందిన 370 ఆర్టికల్ మొదలు, సీ.ఏ.ఏ, ఎన్.ఆర్.సీ, రామజన్మభూమి విషయంలో సుప్రీంకోర్టు తీర్పు, నూతన విద్యావిధానం వరకు ఎటువంటి విమర్శ లేకుండా వంతపాడుతున్నాడు. మరోవైపు రాష్ట్రంలో నవరత్నాల ముసుగులో పీడిత ప్రజలను మోసం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడంతోపాటు, అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకూ, తన ఆశ్రితులైన బడా కాంట్రాక్టర్లకు రాష్ట్ర సంపదను దోచిపెడుతున్నాడు.

ప్రధానంగా విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలలో పరుచుకొని ఉన్న తూర్పు కనుమలనూ, విశాల అటవీ ప్రాంతాన్నీ, కార్పొరేట్ సంస్థలకూ అప్పనంగా అప్పజెపుతూ, బాక్సైట్ గనులు తవ్వేందుకు లోపాయికారి ప్రయత్నాలు చేస్తునే ఉన్నాడు. ప్రజల స్వాధీనమైన వందలాది హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్లను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చేందుకు పోలీసులు పథకాలు రూపొందిస్తూనే ఉన్నారు. రెండవ రౌండ్ కరోనా వ్యాప్తి సందర్భంగా ఈ ప్రాంత ఆదివాసీల ఇక్కట్లను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ విషయాలన్నింటిపై మా పార్టీ, పీ.ఎల్.జీ.ఏలు ప్రజలను అంటిపెట్టుకొని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు పోరాడుతున్నాయి. ఈ విషయాలే జగన్ ప్రభుత్వానికి కంటగింపు అయ్యాయి. అందుకే మా పార్టీపైనా, పీ.ఎల్.జీ.ఏపైనా, పీడిత ప్రజలపైన 'సమాధాన్' వ్యూహంలో భాగంగా ఈ దాడి చేపట్టాడు.

జగన్‌ది నియంతల కుటుంబ వారసత్వం. ఆయనకు ప్రజాస్వామ్యం అంటే పోలీసుస్వామ్యం అనే తెలుసు. అందుకనే చట్టబద్ధ ప్రజాస్వామిక సంస్థలకు చెందిన అనేక మందిని జైలుపాలు చేసాడు. పత్రికారంగం మొదలుకొని ప్రతిపక్షాలను సైతం వదలకుండా వేధింపులపాలు చేస్తున్నాడు. ఈ నియంతకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజానీకం సమైక్యంగా పోరాడాలని పిలుపునిస్తున్నాం.

ఈ దాడిలో అమరులైన కామ్రేడ్స్ కుటుంబాల దు:ఖంలో భాగస్వాములవుతూ, ఈ దేశ పీడిత ప్రజల విముక్తి కోసం బ్రాహ్మణవాద హిందుత్వ, భూస్వామానికీ, సామ్రాజ్యవాదానికీ వీటికి రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ, జగన్ ప్రభుత్వాలకూ, ఇంకా ఇతర బూర్జువా పార్టీలకూ, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మా సాయుధ పోరాటం కొనసాగుతుందని తెలియజేస్తున్నాం. అమరుల ఆశయ సాధనకోసం పీడిత ప్రజలు మరింతగా ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

గణేష్ (అధికార ప్రతినిధి)

Ganesh

ఆంధ్ర ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ,

## పత్రికా ప్రకటన

తేది: జూలై 7, 2021

### ఫాదర్ స్టాన్‌స్వామిది సాధారణ మరణం కాదు, అది రాజ్యం చేసిన హత్య

స్టాన్ స్వామి మృతి పట్ల సీ.పీ.ఐ (మావోయిస్టు) తీవ్ర దిగ్భ్రాంతినీ, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నది. 84 ఏళ్ళ ఈ ప్రజాస్వామికవాది, సామాజిక ఉద్యమకారుడు జార్ఖండ్ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల హక్కులకోసం, సమస్యల పరిష్కారానికి పోరాడాడు. ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో బీమాకోరేగావ్ కేసుకు సంబంధించి యు.ఏ.పీ.ఏ (ఊపా) కింద కుట్రపూరిత ఆరోపణలు మోపి జైలుకు పంపింది. అక్కడ ఆయన పార్కిన్‌సన్స్‌తోపాటు, ఇతర అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నా, హైకోర్టు తగిన రీతిలో స్పందించలేదు. ఇక ఎన్.ఐ.ఏ, జైలు అధికారులు క్రూరంగా వ్యవహరించారు. ఆయన అనారోగ్యం గురించి ఆందోళన పడిన ప్రజాస్వామికవాదుల, మేధావుల విజ్ఞప్తులను బేఖాతరు చేసారు. అందుకే స్టాన్‌స్వామిది సాధారణ మరణం కాదు, అది రాజ్యం చేసిన హత్య.

స్టాన్‌స్వామి ఆదివాసీల హక్కులకోసం అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈ పోరాటాలలో ఆదివాసీలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. స్టాన్‌స్వామి చట్టబద్ధ, ప్రజ్వామిక పోరాటం నిర్వహించినప్పటికీ, అది కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకం కావడంతో రాజ్యం కన్నెర్రకు కారణమైంది. ఈ ఉదాంతాన్ని బట్టి మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నదని మరోసారి రుజువైంది. అందుకే బీమాకోరేగావ్ సంఘటనలో స్టాన్‌స్వామిని ఇరికించి ఆయనపై తప్పుడు కేసు బనాయించి, అది కేవలం ఆరోపణల స్థితిలో ఉండగానే, కక్షపూరితంగా బెయిల్ ఇవ్వకుండా అనేక రూపాల్లో హింసించి మోడీ ప్రభుత్వం ఆయనను హత్య చేసింది.

ఈ సంఘటన భారత రాజ్యం 'ఉదారవాద ప్రజాస్వామిక రాజ్యం' అని భావించేవాళ్ళ కళ్ళు తెరిపించాలి. వాస్తవానికి ఇది సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు రాజ్యం. ఇక్కడ ఎన్.ఐ.ఏ నుంచి, జైళ్ళు, చివరకు న్యాయవ్యవస్థ సైతం రాజ్యాంగ సంస్థలన్నీ ఫాసిజీకరించబడ్డాయి. కనుక ఈ ఫాసిస్టు రాజ్యం, స్టాన్‌స్వామి హత్యతోనే ఆగదు, దీని హత్యల పరంపర విప్లవకారులు, ప్రజాస్వామికవాదులు, సెక్యులరిస్టులు, హేతువాదులు, మైనారిటీలు, పర్యావరణవాదులు ఇలా తన ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడేవారెవరినైనా నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తుంది.

భారతదేశం నేడు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఫాసిజానికి వ్యతిరేకంగా ఒక బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాలి. ముఖ్యంగా ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఈ కింది డిమాండ్‌లతో ఉద్యమించాలి.

***డిమాండ్స్ :***

- **స్టాన్‌స్వామి హత్యకు కారకులైన వారిని శిక్షించాలి.**
- **బీమకోరేగావ్ కేసులో స్టాన్‌స్వామితోపాటుగా నేరం మోపబడినవారందరిని బేషరతుగా విడుదల చేయాలి.**
- **అంగవైఖల్యంతో బాధపడుతున్న ప్రొఫెసర్ సాయిబాబాపై అక్రమకేసులు బనాయించి దుర్మార్గంగా జైలుపాలు చేయడాన్ని నిరసించాలి. ఆయన బేషరతు విడుదలకు డిమాండ్ చేయాలి. రాజకీయ ఖైదీలందరిని కూడా బేషరతుగా విడుదల చేయాలి.**
- **యూ.ఏ.పీ.ఏ (ఊపా) చట్టం రద్దుకోసం ఉద్యమించాలి.**

**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

Abhay

**కేంద్ర కమిటీ,**


**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# విప్లవ సాహిత్య కృషి

ఈ కాలంలో ఏ.ఓ.బీ ఎస్.జెడ్.సీ రెండు పుస్తకాల (వాళ్ళు తూర్పు కనుమల ప్రజ్వలనం, నేను గెరిల్లానెందుకయ్యానంటే?)ను ప్రచురించింది. మొదటిది 2016 నవంబర్ నుండి 2021 ఏప్రిల్ వరకు అమరులైన కామ్రేడ్స్ జీవిత చరిత్రలపై రాసిన పుస్తకం, రెండవది ఐదుగురు కామ్రేడ్స్, తామెందుకు విప్లవ గెరిల్లాలుగా తయారయ్యామనే విషయాన్ని వారి మాటల్లోనే చెప్పబడిన పుస్తకం. ఈ పుస్తకాల సారాన్ని అర్థం చేసుకునేందుకు, వాటికి రాసిన ముందుమాటలు దోహదపడ్డాయి. కనుక ఇక్కడ ఆ ముందుమాటలను వేస్తున్నాం. ఈ ముందుమాటలు ఆ పుస్తకాల పఠనావశ్యకతను తెలుపుతాయి.

## వాళ్ళు
## తూర్పు కనుమల ప్రజ్వలనం

ఈ పుస్తకం మనకు ఒక వర్గపోరాట శాస్త్రంలా ఉపయోగపడుతుంది. 'బూర్జువా, పెటీ బూర్జువా భావాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే మార్క్సిజం అభివృద్ధి చెందుతుంది, పోరాటం ద్వారా మాత్రమే అభివృద్ధి చెందుతుంది' అనే వర్గపోరాట నియమాన్ని తమ జీవిత సర్వస్వంగా భావించిన కామ్రేడ్స్ జీవిత చరిత్రలే ఈ పుస్తకం. అందుకే వర్గపోరాటంలో పాల్గొంటున్న పార్టీ, పీ.ఎల్.జీ.ఏ కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజానీకానికి ఈ పుస్తకం ఒక గైడ్‌గా ఉపయోగపడుతుంది.




అక్టోబర్ 24, 2016లో రాంగూడ వద్ద రాజ్యం జరిపిన విప్లవ ప్రతీఘాతుక దాడిలో 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు. ఈ సంఘటన తర్వాత జరిగిన వివిధ ఘటనలలో అమరులైన కామ్రేడ్స్ జీవిత చరిత్రలు ఈ పుస్తకంలో ఉన్నాయి. చివరి ఘటనగా ఏప్రిల్ 25, 2020న నేతల్‌నార్ ఘటన ప్రస్తావించబడింది. ఈ ఘటన సందర్భంగా పోలీసులు కామ్రేడ్ నగేష్‌ను నేతల్‌నార్ బ్రిడ్జివద్ద అరెస్టు చేసి, తీవ్రంగా హింసించి హత్య చేసారు. ఈ మొత్తం కాలంలో 15 ఘటనలు జరిగాయి. 35 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో ఇద్దరు మినహా, మిగిలినవారందరూ ఆదివాసీ సమాజం నుండి వచ్చినవారే. వీరిలో మెజారిటీగా

వ్యవసాయ కూలీ, పేదరైతాంగానికి చెందినవారు కాగా, కొద్దిమంది దిగువ మధ్యతరగతికి చెందినవారు. మహిళలు 17 మంది అయితే, పురుషులు 18 మంది ఉన్నారు. ఈ అమరుల్లో 16 ఏళ్ళ కామ్రేడ్ ఉయిక తిమ్మో (గీత) నుంచీ, 45 ఏళ్ళ కామ్రేడ్ బృందా (కాంత) వరకు ఉన్నారు. సప్లై దళానికి చెందిన కామ్రేడ్ అడ్మాల్ మినహా, మిగిలినవారు శతృదాడుల్లో అమరులైనారు. కామ్రేడ్ అడ్మాల్ విద్యుత్ తీగ తగిలి ప్రమాదవశాత్తు అమరుడైనాడు.

వీరిలో కామ్రేడ్ ప్రమీల (మీనా), కామ్రేడ్ కామేశ్వరి (రింకీ)లు మినహా, మిగిలినవారంతా లోతట్టు అటవీ ప్రాంతంలోని, వెనకబడిన గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగారు. కామ్రేడ్ ప్రమీల తెలంగాణలో ఫ్యూడలిజం బలంగా ఉండే వరంగల్ జిల్లాలోని పోచన్నపేట గ్రామంలో పుట్టి పెరిగింది. కామ్రేడ్ కామేశ్వరి తండ్రి నాలుగోతరగతి ఉద్యోగస్తుడు కావడంతో, ఆయన ఉద్యోగరీత్యా పట్టణాలు తిరగాల్సి వచ్చేది. దీంతో కామేశ్వరి పట్టణాలలోనే పుట్టి పెరిగింది. వీరు పుట్టిపెరిగిన పరిస్థితులను ఈ పుస్తకం ద్వారా అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, ఈ కామ్రేడ్స్ పుట్టిపెరిగిన పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా భారతదేశపు సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఒక పార్శ్వాన్ని కూడా అవగతం చేసుకోవచ్చు.

వీరిలో ఒక్కరిది మినహా, మిగిలిన వారందరిదీ వ్యవసాయ కుటుంబాలే. భూమి చుట్టూ జీవితం అల్లుకుపోయిన కుటుంబాలే. వీరు అటవీ ఉత్పత్తులపై కొంత మేరకు ఆధారపడినా, వీరికి భూమే సర్వస్వం. వీరు భూమికోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలు వెళ్ళారు. వీరు ప్రధానంగా జీతగాళ్ళుగా, కూలీలుగా, పేదరైతులుగా జీవించారు. గ్రామాలలో భూస్వాముల, క్రూరమైన తెగపెద్దల దోపిడీ పీడనల్లో మగ్గిపోయారు. ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలకు బలయ్యారు. పాత వ్యవస్థల అభివృద్ధి నిరోధక ఆచార వ్యవహారాలకూ, రీతీరివాజులకు కట్టివేయబడి అంధకారంలో అలమటించారు. దేశానికి వచ్చిన 'స్వాతంత్ర్యం', ఆ తర్వాత జరిగిన 'అభివృద్ధి', 'నవీకరణ'లు ఈ ప్రాంతాల్లో ఏ మాత్రం మార్పు తేలేకపోయాయి. ఈ ప్రాంతాలు విద్యా, వైద్యం, రహదారులు వంటి కనీస సౌకర్యాలను కూడా నోచుకోలేదు. ఈ కారణం రీత్యానే కామ్రేడ్ కామేశ్వరి మినహా, మిగిలినవారెవరూ చదువుకోలేకపోయారు. వీరంతా పార్టీలోకి వచ్చిన తర్వాతే చదువుకున్నారు. ఈ పరిస్థితులన్నీ భారతదేశపు వెనకబడిన అర్ధభూస్వామ్య స్వభావానికి నిర్దిష్టమైన సాక్ష్యాలుగా ఉంటాయి.

ఇక ఈ పుస్తకం అమరుల జీవితానికి సంబంధించిన మరో ముఖ్యమైన కోణాన్ని కూడా మనకు తెలియజేస్తున్నది. ముఖ్యంగా వీరిలో విప్లవోద్యమం తెచ్చిన ప్రగతిశీల మార్పులను, ఈ పుస్తకం మనకు కళ్ళకు కడుతుంది. ఈ కామ్రేడ్స్ అందరూ విప్లవోద్యమం పురోగమిస్తున్న కాలంలోనే పుట్టి పెరిగారు. విప్లవోద్యమం తెస్తున్న మార్పులను ఆకళింపు చేసుకున్నారు. పాత వ్యవస్థపైనా, పాత భావాలపైన పోరాడటం నేర్చుకున్నారు. కార్మికవర్గ దృక్పథాన్ని తమ ప్రాపంచిక దృక్పథంగా మలుచుకునేందుకు కృషి చేసారు.


అందుకే చిన్నతనం నుంచి ఏదో ఒక విప్లవ ప్రజానిర్మాణంలో సభ్యులుగా ఉంటూ వచ్చారు. వర్గపోరాటంలో ప్రజలవైపు దృఢంగా నిలిచారు. ప్రజల రాజ్యాధికార లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు గల వర్గశతృవులతోనూ, రాజ్యంతోను సమరశీల పోరాటాలలో పాల్గొన్నారు. ఈ వర్గపోరాటాన్ని విస్తరింపజేసి, దేశాన్ని విముక్తి చేసే లక్ష్యంతో పురోగమిస్తున్న విప్లవోద్యమ అవసరాలకు అనుగుణంగా తమని తాము మలుచుకున్నారు. ఉద్యమ అవసరాలు ఎక్కడంటే అక్కడికి తమ కన్న తల్లిదండ్రులనూ, సొంతఊరును వదిలి వెళ్ళారు. అమరులైన 35 మంది కామ్రేడ్స్‌లో 18 మంది దండకారణ్యం నుంచి వచ్చారు.

ఏ.ఓ.బీలో పని చేసిన ఈ కామ్రేడ్స్ అందరూ ఇక్కడి ఉద్యమ అవసరాలకనుగుణంగా తమని తాము మలుచుకున్నారు. ఇక్కడి తూర్పు కనుమలు దట్టమైన అటవీ ప్రాంతంతో, ఎత్తైన కనుమలతో కూడుకొని ఉంటుంది. ఇటువంటి కఠినమైన భౌగోళిక పరిస్థితులకనుగుణంగా తమ శరీరాలను మలుచుకున్నారు. ఈ ప్రాంతంలో అనేక తెగల ప్రజలుండటంతో వారు వివిధ రకాల భాషలు మాట్లాడతారు. ఈ ప్రజలను విప్లవీకరించడంలో భాగంగా ఈ కామ్రేడ్స్ ఒడియా, తెలుగు, కువ్వి, కోయ భాషలను నేర్చుకున్నారు. ఉద్యమ అవసరాలకనుగుణంగా తమ సమర్థతలను పెంచుకున్నారు. వీరు మంచి ఆర్గనైజర్లుగా, సాహసవంతమైన కమాండర్లుగా, టెక్నీషియన్లుగా, డాక్టర్లుగా రూపొందారు.

ఈ మార్పులన్నీ తమ వర్గానికి సేవ చేయాలనే రాజకీయ నిజాయితీ ఉంటేనే సాధ్యం. ఈ విషయాన్ని ఆకళింపు చేసుకున్నారు కనుకనే, ఈ కామ్రేడ్స్ నిజమైన కార్మికవర్గ ప్రతినిధులుగా మారారు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే, వీరి జీవితం కార్మికవర్గ నిజాయితీ, విప్లవ సమర్థతల మేలు కలయికగా చెప్పాలి. ఇంకా లోతుగా చెప్పుకోవాలంటే, ఈ కామ్రేడ్స్ జీవితం వర్గపోరాటంతో పెనవేసుకుపోయింది. ఫ్యూడల్ భావాలకూ, బూర్జువా, పెటీ బూర్జువా భావాలకు వ్యతిరేకంగా పోరాటం, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం, దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం ఇలా వీళ్ళ జీవితమే ఒక పోరాటంగా చెప్పాలి. ఈ పోరాటం ద్వారానే తమని తాము మంచి కమ్యూనిస్టులుగా తీర్చి మలుచుకున్నారు, ప్రజలను చైతన్యపరిచారు, రాజ్యాధికార లక్ష్యంతో వర్గశతృవుపై పోరాడేలా వారిని సాయుధుల్ని చేసారు, ఎన్నో విజయాలు సాధించారు. ఈ మహత్తరమైన విప్లవ ప్రస్థానంలో ఈ కామ్రేడ్స్ ఉన్నతమైన పోరాట చైతన్యంతోనే తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారు. వాళ్ళ ఆశయం తప్పక నెరవేరుతుంది. చరిత్ర పురోగమనం అనివార్యం.

# నేను గెరిల్లానెందుకయ్యానంటే?

ఈ పుస్తకం (నేను గెరిల్లానెందుకయ్యానంటే?) ఆదివాసీ ప్రాంతాలలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపుతుంది. ఇందులో ఐదుగురు కామ్రేడ్స్ గెరిల్లాలుగా మారిన క్రమాలు ఉన్నాయి. వీరందరూ మహిళా కామ్రేడ్సే. వీరు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీష్ఘడ్ రాష్ట్రాలలోని విశాఖ, కొరాపుట్, మల్కనగిరి, బీజాపూర్ జిల్లాలకు చెందినవారు. వీళ్ళందరి జీవితాలలో కొన్ని సారూప్యతలూ, సామీప్యతలు ఉన్నాయి. సాధారణ అంశాలుగా చూసినప్పుడు వీరు ఆదివాసీ మహిళలు కావడంతోపాటు, వీరి బాల్యం ఉద్యమ ప్రాంతాలలోనే గడిచింది. వీరందరి కుటుంబాలు పేద రైతాంగానికి చెందినవే. ఈ కుటుంబాలు గ్రామాలలో మున్సబుల, పెద్దాల్‌ల ఆధిపత్యానికీ, అణచివేతకు బలైనాయి. వీరి కొద్దిపాటి భూములను ఆయా గ్రామాల మున్సబులు, పెద్దాల్‌లు బలవంతంగా గుంజుకొని దౌర్జన్యంగా వీరిని సొంత గ్రామాల నుంచి గెంటేసారు. ఈ పరిణామాలు ఆదివాసీ సమాజంలో కూడా వర్గాలు ఏర్పడ్డాయనే వాస్తవాన్ని చాలా స్పష్టంగా ధృవీకరిస్తున్నాయి. ఇలా గెంటివేయబడ్డ కుటుంబాలకు భూమే సర్వస్వం. అది లేకపోతే జీవితమే లేదు. అందుకే భూమి కోసం, తమ జీవిక కోసం వలసబాట పట్టారు. భూమి కోసం జరిగిన ఈ వెతుకులాటలో నిద్రలేమి రాత్రులు, పస్తులు, అవమానాలు వీరిని వెన్నంటే ఉన్నాయి. ఈ సమయానికి ఈ ఐదుగురు కామ్రేడ్స్ చిన్నవారే అయినప్పటికీ, ఈ చేదు జ్ఞాపకాలన్నీ వాళ్ళ చిన్న బుర్రలో నిక్షిప్తమైపోయి ఉన్నాయి. కొన్ని విషయాలను ఇంట్లో పెద్దవాళ్ళు చెబుతుంటే కూడా జ్ఞాపకం పెట్టుకున్నారు. ఈ భూమి వాళ్ళ జీవితంలో ఎంత కీలకమైన అంశమంటే, అది ఉంటేనే ఎంతో కొంత సంతోషం. లేకుంటే అంతా దుఃఖమే, అన్ని సమస్యలే. భూమిని కోల్పోయిన ఈ కుటుంబాలన్నీ తీవ్రమైన ఆకలిని ఎదుర్కొన్నాయి. అనేక రోజులు పస్తులతో గడిపాయి. వీరి జీవితాలలో విషజ్వరాలు, అసహజ మరణాలు సర్వసాధారణం. వీరికి చెట్ల మందులు తప్పితే, ఇంగ్లీషు మందులు (అలోపతి) దొరకటం అసాధ్యం. ఇటువంటి పరిస్థితులలో ఈ కామ్రేడ్స్ మెజారిటీగా తమ తల్లినో, తండ్రినో కోల్పోయారు. ఇక చదువనేది వారికి అందని ద్రాక్షే. ప్రభుత్వ బడులు అక్కడక్కడ ఉన్నా, గురుజీలు బడులకు రావడంకానీ, పిల్లలకు చదువులు చెప్పడం కాని ఉండదు. ఈ సమస్యలకు తోడు వెనకబడిన ఆదివాసీ రీతీరివాజులు వీరికి పీడగానే దాపురించాయి. ముఖ్యంగా ఈ కామ్రేడ్స్ అంతా మహిళలు కావడంతో ఆదివాసీ సమాజంలో పితృస్వామ్యాన్ని తీవ్రంగానే ఎదుర్కొన్నారు. కొద్దిమంది బలవంతపు పెళ్ళిళ్ళ సమస్యను ఎదుర్కొన్నారు. వారు ఎదుర్కొన్న ఈ సమస్యల్నీ, కష్టాల్ని లోతుగా అర్థం చేసుకోవాలంటే ఈ పుస్తకంలో పొందుపరిచిన వారి మాటలను చదవాల్సిందే.




అయితే వారి చీకటి జీవితాల్లో విప్లవం కొత్త వెలుగును ప్రసరింపజేసింది. నిర్లిప్తమైన, నిస్తేజమైన జీవితాల్లో విప్లవం నూతన ఉత్సాహాన్ని నింపింది, కొత్త శక్తిని ఇచ్చింది. విప్లవం వాళ్లకు భూమిని ఇచ్చింది. అధికారా(ప్రజాస్వామ్యం)న్ని ఇచ్చింది. ఇంకా విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు, రహదారులు వంటి సౌకర్యాలను విప్లవ సంస్కరణల రూపంలో సమకూర్చింది. ఇలా ఎన్నో అవసరాలను తీర్చింది. ఇక్కడ విప్లవం అంటే ఎవరో చేసిపెట్టింది కాదు. పార్టీ అందించిన రాజకీయాలతో ప్రజలు నిర్వహించిన మహత్తర ప్రక్రియనే విప్లవం. విప్లవ ప్రక్రియ అంటేనే సాయుధవర్గ పోరాటం. నిర్దిష్టంగా చెప్పాలంటే గెరిల్లాయుద్ధ రూపంలో జరుగుతున్న ప్రజాయుద్ధమే. ఈ పోరాటం, యుద్ధం గ్రామస్థాయి వర్గశత్రువుల నుంచి వారికి అండగా వచ్చే రాజ్యానికి వ్యతిరేకంగా జరిగింది, జరుగుతున్నది కూడా. రాజ్య ప్రయోజిత జల్వాజుడుం, శాంతి సంఘాలను ఈ ప్రజాయుద్ధం ఢీకొన్నది. ఇలా విప్లవ ప్రజానీకం పార్టీ నేతృత్వంలో ఒక బలమైన శత్రువుతో భీకరమైన పోరాటం చేస్తూ, రక్తతర్పణ చేస్తూ భూమినీ, అధికారాన్ని సాధించుకుంటున్నారు. కొన్ని విజయాలను సాధించుకొన్నారు. నేడు ఈ అనుభవాల పునాదిపైనే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే కృషి కొనసాగుతున్నది.

ఇటువంటి వాతావరణంలో ఈ కామ్రేడ్స్ అంతా బాలలసంఘం నుంచి మొదలుకొని సాంస్కృతిక సంఘం, మిలీషియా... ఇలా అనేక నిర్మాణాలలో చురుగ్గా పని చేసారు. చిన్న వయస్సులోనే నూతన భావాలతో కొత్త చైతన్యాన్ని సంతరించుకొని విప్లవోద్యమంలో ఎదురయ్యే ఆటుపోటులన్నింటినీ ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత వ్యవస్థలో పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని ఆధిపత్యాలనూ, బంధనాలను ధ్వంసం చేయాలంటే సాయుధవర్గ పోరాటం తప్ప, మరోమార్గంలేదనే చారిత్రక వాస్తవాన్ని అర్థం చేసుకొని సాయుధులయ్యారు, గెరిల్లాలయ్యారు. ఈ విషయాలన్నింటినీ ఈ పుస్తకంలో వారు నేరుగా వ్యక్తపరిచిన అభిప్రాయాలను చదవడం ద్వారా తెలుసుకోవడం గొప్పస్ఫూర్తిని కల్పిస్తుంది. ఈ క్రమం ఈ ఐదుగురికి సంబంధించిందే కాదు, ఈ దేశంలో 90%గా ఉన్న పీడిత ప్రజానీకానికి కూడా ఒక అనివార్య క్రమమే.

# కేంద్రకమిటీ సభ్యుడు, అమరుడు

# యూప నారాయణ (లక్మా, హరిభూషణ్)

# విప్లవ స్వప్నాలను సాకారం చేద్దాం!

కామ్రేడ్ లక్మ 1960 చివరలో ఉమ్మడి వరంగల్ జిల్లా (వర్తమాన మహబూబాబాద్) గంగారం మండలం, మడగూడెం గ్రామంలో యాప రంగయ్య, పున్నమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించాడు. ఆయనకు తల్లిదండ్రులు నారాయణ అని పేరు పెట్టుకున్నారు. ఆయన ప్రాథమిక విద్యను స్థానికంగా పూర్తి చేసి, ఉన్నత విద్యాభ్యాసానికి నర్సంపేట్ డిగ్రీ కళాశాలకు వెళ్ళి అక్కడ విద్య, బుద్ధులతోపాటు, విప్లవ రాజకీయాలను అభ్యసించాడు. వారి గ్రామం నుండి తొలి ఆదివాసీ గ్రాడ్యుయేట్‌గా నారాయణ అందరిలో మంచి గుర్తింపుతో పాటు, గౌరవ మర్యాదలు పొందాడు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన పిదప ఆయనకు ఐ.టీ.డీ.ఏలో ఉద్యోగం కుదిరింది. ఐ.టీ.డీ.ఏ ఉద్యోగిగా ఆయన ఆ ప్రాంతంలో ఆదివాసీలకు అవకాశం ఉన్న మేరకు వారి హితోభిలాషిగా నిజాయితీతో కూడిన సేవలందిస్తూ వారితో తన సంబంధాలను రాజకీయంగా పెంచుకొని పటిష్టం చేసుకున్నాడు.

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న నారాయణకు పీడిత ప్రజలు ముఖ్యంగా పేద ఆదివాసీలు తమ జీవితాలలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ దోపిడీ వ్యవస్థే కారణమనీ, దానిని మార్చకుండా ప్రజల జీవితాలలో మౌలిక మార్పు ఉండదని తన విప్లవ రాజకీయాల వెలుగులో అర్థం చేసుకున్నాడు. అప్పటికే వరంగల్ జిల్లాలో విద్యార్థి ఉద్యమంతోపాటు, గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తీవ్ర అణచివేత చర్యలను ఎదుర్కొంటునే పట్టణాలలో, పల్లెల్లో విప్లవోద్యమం బలంగా కొనసాగుతుంది. విప్లవోద్యమం గురించి ఆలోచిస్తున్న నారాయణకు ఆ వాతావరణం మరింత ప్రోత్సాహించింది. మరోవైపు మహబూబాబాద్ ప్రాంతంలో మితవాద ప్రజాపంథావారి దివాళాకోరు రాజకీయాలు, వారి ప్రజా వ్యతిరేక, దైర్జన్యకర పద్ధతులు ఆయన్ని పీపుల్స్‌వార్ రాజకీయాల వైపు మరింత దృఢంగా, ఐక్యంగా కావడానికి తోడయ్యాయి. ఆ రకంగా ఆయన 1988 తన ఉద్యోగాన్ని వదిలి విప్లవ రాజకీయాలలోకి పూర్తికాలం విప్లవకారుడిగా సిద్ధమై వచ్చాడు. తొలుత ఆయన రెండు సంవత్సరాలు రాడికల్ యువజన సంఘంలో పని చేసాడు. పిదప 1990లో పార్టీలో చేరి వ్యవసాయ విప్లవ రాజకీయాలతో సాయుధ విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా చేరిన కామ్రేడ్ హరిభూషణ్‌గా తొలుత పాండవ దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజల మధ్యకు వెళ్ళాడు. ఆయనతో ఆ దళం నూతనంగా పురుడు పోసుకుంది. ఆ ప్రాంత ప్రజలతో ముందు నుండే లోతైన



సంబంధాలు కలిగి ఉండడంతో ఆయనకు అక్కడ పని చేయడం సులువైంది. విప్లవోద్యమ విస్తరణలో, సంఘటితీకరణలో అవి చాలా తోడ్పడినాయి. 1992లో పార్టీ నిర్వహించిన తొలి గెరిల్లా సైనిక శిబిరంలో ఆయన విద్యార్థిగా పాల్గొన్నాడు. పెంపొందుతున్న ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం నుండి 1995 నాటికి విడిగా ప్రత్యేక గెరిల్లా జోన్ కర్తవ్యాలతో ముందుకు వచ్చిన ఉత్తర తెలంగాణలో జరిగిన మహసభలో ఏరియా కమిటీ కార్యదర్శి స్థాయిలో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నాడు.

కామ్రేడ్ హరిభూషణ్ అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఒక మంచి ఆర్గనైజర్‌గా ఎదిగిరావడంతో 1996లో

పార్టీ ఆయనకు డివిజన్ స్థాయి కామ్రేడ్‌గా పదోన్నతి కల్పించి నూతనంగా ఏర్పడిన ప్లటూన్ కమాండర్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతలలో ఆయన పలు సైనిక చర్యలలో పాల్గొని జయప్రదం చేసి, మంచి అనుభవం గడించాడు. ఆయన నిజాయితీ, పట్టుదల, నైపుణ్యం, దృఢసంకల్పం అర్థం చేసుకున్న స్పెషల్ జోనల్ కమిటీ ఆయనని ప్రోత్సహించి కేంద్రకమిటీ నూతనంగా ఏర్పడిన రక్షణ ప్లటూన్ కమాండర్‌గా ఎంపిక చేసింది. కామ్రేడ్ లక్మూ ఎంతో ఉత్సాహంలో ఆ బాధ్యతలు చేపట్టాడు. ఆ బాధ్యతల్లోకి మారిన వెంటనే ఆయన పేరును దండకారణ్య ఆదివాసీ సాంప్రదాయాలకు తగినట్లు లక్మూగా మార్చుకొన్నాడు. ఆ బాధ్యతలలో కొనసాగిన దాదాపు 5 సంవత్సరాలలో అత్యంత విశ్వసనీయ కామ్రేడ్‌గా, నైపుణ్యం గల కమాండర్ రాణించిన కామ్రేడ్ లక్మూ కేంద్రకమిటీ విశ్వాసాన్ని మరింత చూరగొన్నాడు. పార్టీ ఆ సమయంలో ఏర్పర్చిన కేంద్ర సైనిక ప్రశిక్షకుల బృందంలో కామ్రేడ్ లక్మూ సభ్యుడయ్యాడు. కామ్రేడ్ లక్మూ తన ప్లటూన్‌కు తగిన సైనిక శిక్షణనందిస్తూ మంచి సైనిక క్రమశిక్షణను అభ్యసించేలా కృషి చేసాడు. పార్టీ నిర్ణయించిన చోటికి తన బృందంతో వెళ్ళి పీ.ఎల్.జీ.ఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం) గెరిల్లాలకు శిక్షణ గరిపాడు.

2003 నాటికి ఆటు పరిస్థితిలోకి వెళ్ళిన తెలంగాణ విప్లవోద్యమాన్ని తిరిగి పునర్వికసింప చేయాలనే తపన, పట్టుదల కామ్రేడ్ లక్మూలో మెండుగా ఉంటాయి. భారత విప్లవోద్యమంలో తెలంగాణకు గల ప్రాధాన్యత నేపథ్యంలో కేంద్రకమిటీ అక్కడ పని చేయడానికి కామ్రేడ్ లక్మూ ఒక సమర్థుడైన కామ్రేడ్ అని భావించింది. అందుకు కామ్రేడ్ లక్మూ కూడా సంసిద్ధంగా ఉండడంతో ఆయన కోరికను అనుసరించి ఆయన్ని 2005 చివరలో తిరిగి తెలంగాణకు రాష్ట్ర కమిటీ సభ్యుడి స్థాయిలో బదిలీ చేసింది. 2005 నుండి 2021 జూన్ 20 నాడు ఉదయం 9 గంటలకు తుది శ్వాస విడిచే వరకు ఆయన తెలంగాణ విప్లవోద్యమ పునర్వికాసానికి అహర్నిషలు పాటుపడ్డాడు.

2007లో జరిగిన తెలంగాణ మూడవ స్పెషల్ జోన్ మహాసభలో చేపట్టిన పునర్వికాస కర్తవ్యాల అమలుకు ఆయన అలుపెరుగని కృషి చేసాడు. అందుకు 2009లో బద్దలైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజనోద్యమ రెండవ అల చాలా ఉపయోగపడింది. భౌగోళిక తెలంగాణ సాధన కోసం జరుగుతున్న ఉధృతమైన ప్రజా ఆందోళన ముందు పార్టీ ప్రజాస్వామిక తెలంగాణ సాధన వైఖరిని మరోసారి సుస్పష్టంగా ముందుంచడంతో కామ్రేడ్ లక్మూ ఆ కర్తవ్య సాధన దిశలో విప్లవ ప్రజా సంఘాలనూ, సంయుక్త కార్యాచరణను ఉత్తర తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గైడ్ చేయసాగాడు. వాటికి భారతదేశంలో జాతుల విముక్తిపై పార్టీ అవగాహనను పెంపొందించడంలో అవిరళ కృషి చేసాడు. తుదకు ఆ మహా ప్రభంజనం 2014 జూన్ 2 నాడు భౌగోళిక తెలంగాణ సాధించింది. ఆ ప్రజా విజయాన్ని ఎత్తిపడుతూ ప్రజాస్వామిక తెలంగాణ సాధన దిశలో మరింత చొరవ, పట్టుదలతో పని చేయాల్సిన అవశ్యకతను గుర్తించిన రాష్ట్ర కమిటీ 2015లో కామ్రేడ్ లక్మూను ఆ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకుంది. ప్రత్యేక తెలంగాణ సాధనతో ఉత్తర తెలంగాణ ప్రత్యేక జోనల్ కమిటీ తెలంగాణ ప్రజల ఆకాంక్షల వెలుగులో యావత్ తెలంగాణకు నాయకత్వాన్ని అందించసాగింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సాధించిన ప్రజా విజయాలను సంఘటితం చేసుకుంటూ, 2015 నుండి యావత్ తెలంగాణలో విప్లవోద్యమ పునర్వికాసానికి నూతన తరహాలో ప్రత్యేక కృషి సలిపాడు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముందుకు వచ్చిన అనేక ప్రజా సంఘాలలో నుండి విప్లవ చైతన్యం ప్రదర్శిస్తున్న వారిని ఎంపిక చేసుకొని, వారిని విప్లవ రాజకీయాలవైపు తీసుకురావడానికి చాలా కృషి చేసాడు. అందుకు ఆయనకు ప్రజలతో ముఖ్యంగా ఆదివాసీ ప్రజాసంఘాలతో, యువతతో, విద్యార్థి-ఉద్యోగులతోగల అనుభందం చాలా తోడ్పడింది. వారిని శతృవుకు అభేద్యమైన రీతిలో విప్లవ నిర్మాణాలలో సంఘటితం చేసే ప్రక్రియ మొదలైంది. తత్ఫలితంగా, విప్లవోద్యమంలోకి నూతన క్యాడర్ల భర్తీ మొదలై తెలంగాణ విప్లవోద్యమ పునర్నిర్మాణ కృషి వేగవంతమైంది. అంతే కాకుండా ఆ క్యాడర్లలో నుండి ఎంపిక చేసిన వారిని పార్టీ ఇతర అవసరాలు తీర్చడానికి కూడా కేటాయించసాగారు. ఉద్యమంలో సాధిస్తున్న ప్రగతిని మూడేళ్ళకోసారి జరుపుకుంటున్న పార్టీ ప్లీనాలలో సమగ్రంగా అంచన వేసుకుంటూ, పరిస్థితులకు తగినట్లు నూతన కర్తవ్యాలను చేపట్టసాగారు. పర్యవసానంగా, 2020 చివరి నాటికి తెలంగాణ ఉద్యమం వెనుకంజ నుండి బయటపడుతున్న స్థితికి చేరిందని కేంద్రకమిటీ అంచనా వేసింది. ఆ యావత్ కృషితో కామ్రేడ్ లక్మూ అగ్రశ్రేణిలో నిలిచాడు. అంతేకాదు, 2018 చివరి నాటికి ఆయన పార్టీ అత్యున్నత కమిటీలో సభ్యుడిగా ఎదిగివచ్చాడు.

సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన భారత దోపిడీ పాలకవర్గాలు ముఖ్యంగా 2014లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన హిందుత్వ శక్తులు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ను సమూలంగా నిర్మూలించి, మావోయిస్టు రహిత నూతన భారతాన్ని నిర్మించాలనే పథకాలు వేసుకుంటున్నారు. విప్లవోద్యమంపై తీవ్రమవుతున్న బహుముఖ దాడులతో వరుసగా పార్టీకి జరుగుతున్న నష్టాల నుండి పార్టీని విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ పురోగమింపజేయడానికి పార్టీ కేంద్రకమిటీ 2019లో పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చింది. మరోవైపు 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్ తొమ్మిదవ కాంగ్రెస్ తర్వాత ఎదురైన భారీ నష్టాల నుండి క్రమంగా సీ.సీ బయటపడుతూ మొదట తనని తాను పటిష్టం చేసుకోవడంలో భాగంగా 2013లో నూతన శక్తులను కమిటీలోకి కో-ఆప్ట్ చేసుకంది. ఆ తర్వాతి క్రమంలో 2017లో మరి కొందరిని కేంద్రకమిటీలోకి కో-ఆప్ట్ చేసుకుంది. పిదప 2018 చివర్లో జరిగిన 6వ సీ.సీ మీటింగ్‌లో కామ్రేడ్ లక్మూతో పాటు, మరి కొందరిని సీ.సీ.లోకి కో-ఆప్ట్ చేసుకుంది. మధ్య రీజియన్ నుండి సీ.సీలోకి ఎదిగివచ్చిన తొలి ఆదివాసీ కామ్రేడ్ ఆయన. వ్యూహాత్మక ప్రాంతాలలోని ప్రజలలో ఉద్యమ ఎదుగుదలకు అది ఒక స్పష్టమైన సంకేతాన్నిస్తుంది.

తెలంగాణ ఉద్యమ వెనుకంజకు గురైన తదుపరి దానిని పునర్వికసింప చేయడానికి జరిగిన కృషిలో దానికి వెనుకతట్టు ప్రాంతంగా ఎదిగివచ్చిన దండకారణ్యం తన వంతు పాత్ర అది నిర్వర్తించింది. ఆ క్రమంలో కామ్రేడ్ లక్మూ దాదాపు దశాబ్దంన్నర కాలం దండకారణ్య ఉద్యమంతో పూర్తిగా తాదాత్మ్యం చెందాడు. ఆ ఉద్యమానికి రాజకీయ, ప్రచార, పాదార్థిక రూపాలలో అన్ని రకాల సహాయాన్ని అందించడానికి కృషి చేసాడు. రెండు ప్రాంతాల మధ్య సమన్వయం కోసం ఏర్పడిన కమిటీలో ఆయన సభ్యుడిగా కొనసాగాడు.

తరువాయి భాగం 45వ పేజీలో...

# విప్లవోద్యమ పోరుకెరటం

# కామ్రేడ్ మల్లాల్

కామ్రేడ్ మల్లాల్ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, సుకుమ జిల్లా, దొర్నపాల్ ఏరియా, దుబ్బం గ్రామంలో 30 సంవత్సరాల క్రితం పుట్టాడు. అయితే చిన్నప్పటి నుండి కామ్రేడ్ మల్లాల్ కలిమెల ఏరియా, ఎద్దుగొండ గ్రామంలో ఉన్న తన చిన్నాన్న దగ్గర పెరిగాడు. 1980 నుంచి 1995 దాకా దండకారణ్య ఉద్యమంలో భాగంగా ఉన్న కలిమెల ఏరియా, అనేక పోరాటాలకు కేంద్ర బిందువుగా ఉండేది. తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా ఏ.ఓ.బీలో ఆ ఏరియా భాగమయ్యింది. ప్రజలు అనేక వర్గ సంఘాల్లో భాగమవుతూ, దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తూ వచ్చారు. ప్రతి గ్రామంలో మిలీషియా నిర్మాణాలు ఏర్పాటు చేసుకొని, అనేక ప్రతిఘటన కార్యక్రమాలు చేపట్టారు. అలాంటి ప్రాంతంలో కామ్రేడ్ మల్లాల్ చిన్నప్పటి నుండీ మిలీషియా నిర్మాణంలో భాగమవుతూ, అనేక ప్రతిఘటన కార్యక్రమాలు చేపట్టాడు. మరోవైపు పార్టీ అవసరాల రీత్యా డీ.కేకు ఏ.ఓ.బీకి మధ్య కొరియరింగ్ పని చేశాడు. శత్రువు దాడుల మధ్యనే కొరియరింగ్ పనిని కామ్రేడ్ మాల్లాల్ సమర్థవంతంగా నిర్వహించాడు.

కామ్రేడ్ మల్లాల్ మిలీషియాలో పని చేస్తూనే, కొరియరింగ్ పనిని కూడా కొనసాగిస్తూ, 2005 సంవత్సరంలో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు. 2008 చివరి వరకు కలిమెల ఏరియాలో పని చేసాడు. 2009లో, జోన్ సెక్రటరీకి రక్షణ ఇస్తున్న ప్రొటక్షన్ స్క్వాడ్‌లో సభ్యుడయ్యాడు. విప్లవం ఎడల అంకితభావం, కార్మికవర్గ నిజాయితీ కలిగిన కామ్రేడ్ మల్లాల్, పార్టీ అంచనాలకు అనుగుణంగానే, గార్డు విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించాడు. అయితే గతంలో బూబీట్రాప్ ఆక్సిడెంటల్ ఫైర్ అయిన ఒక ఘటనలో మల్లాల్ తలకు తీవ్రమైన గాయమైంది. చెవులు వినబడకుండా పోయాయి. ఈ గాయాలు తగ్గినప్పటికీ, ఎక్కువ దూరం నడిచినప్పుడు స్పృహ తప్పి పడిపోయేవాడు. వినికిడి కూడా పూర్తిగా దెబ్బతినడం జరుగుతుండేది. ఈ పరిస్థితిలో కామ్రేడ్ మల్లాల్ ప్రొటక్షన్ స్క్వాడ్‌లో ఉంటూ, సుదూర ప్రయాణాలు చేయడం కష్టంగా మారింది. పార్టీ, కామ్రేడ్ మల్లాల్‌ను రిలీవ్ చేసి, బైఫర్‌గూడ ఏరియాలో ఆర్గనైజేషన్ అవసరాల కోసం పంపింది. బైఫర్‌గూడ ఏరియాలో అనేక గ్రామాల్లో ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి కృషి చేసాడు. సహజంగానే ప్రజలతో కలిసిపోవడంలో చాలా చొరవగా ఉండేవాడు. స్థానిక ఒడియా భాషపై పట్టును సంపాదించాడు. 2013 జోన్ ప్లీనం తర్వాత కామ్రేడ్ మల్లాల్‌ను కొరాపుట్ ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ బదిలీ చేసింది. అమరుడు కామ్రేడ్ శ్యాంతో పాటు, సివిల్‌లో తిరుగుతూ, అనేక గ్రామాలను ఆర్గనైజ్ చేసాడు. స్థానికంగా కువ్వి, కొండదొర, ఒడియా ప్రజలతో మమేకమయ్యేవాడు. స్థానికంగా భూమి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చేసేవాడు. కొరాపుట్ జిల్లా, నందపూర్



ఏరియాలో కామ్రేడ్ మల్లాల్‌కు తెలియని గ్రామం, ప్రజలు లేరంటే అతిశయోక్తి కాదు.

పెద్దగొల్లూరు గ్రామంలో స్థానిక పెత్తందార్లకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి, 50 ఎకరాలకు పైగా భూములను స్వాధీనం చేసుకొని, స్థానిక భూమిలేని ప్రజలకు పంపిణీ చేసిన పోరాటంలో కామ్రేడ్ మల్లాల్ పాత్ర ముఖ్యమైనది. కామ్రేడ్ శ్యాం, కామ్రేడ్ దుంబ్రిలను పోలీసులకు పట్టించిన మునగలవలస గ్రామ పెత్తందార్లపై ప్రజలతో కలిసి దాడి చేసి, వాడిని ఖతం చేసి, వాడి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను స్వాధీనం చేసుకొని ప్రజలకు

పంచి పెట్టిన ఘటనలో చురుగ్గా వ్యవహరించి స్థానిక ప్రజల హృదయాలను గెలుచుకున్నాడు.

2017 సంవత్సరంలో సుంకి దగ్గర పోలీసులపై జరిపిన డెలిబరేట్ ఆంబుష్‌లో కామ్రేడ్ మల్లాల్ ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆ సంఘటనను విజయవంతం చేసేందుకు, సుంకి పరిసర ప్రాంత గ్రామాలలో సంబంధాలు ఏర్పర్చుకొని రెక్కి చేయాల్సి వచ్చింది. ఈ పని కామ్రేడ్ మల్లాల్ సమర్థవంతంగా నిర్వహించాడు. ఆ సంఘటనలో తను అసాల్ట్ గ్రూపులో మెంబర్‌గా ఉంటూ, శత్రువుపై దూసుకుపోవడంలో చొరవ చేసాడు. ఈ ఘటనలో 9 మంది ఓ.ఎస్, ఏ.పీ పోలీసులు చనిపోగా, మరో ముగ్గురు సీరియస్‌గా గాయపడ్డారు. ఆ ఏరియాలో ఉన్న అనేక మంది పెత్తందార్లనూ, ఇన్‌ఫార్మర్లను కంట్రోల్ చేయడంలో కామ్రేడ్ మల్లాల్ ముఖ్యమైన పాత్ర పోషించాడు.

2018లో కామ్రేడ్ మల్లాల్‌ను ఉద్యమ అవసరాల రీత్యా కటాఫ్ ప్రాంతానికి పై కమిటీ బదిలీ చేసింది. 2018 నుండి తను అమరుడయ్యేంత వరకు కటాఫ్ ఉద్యమంలో మమేకం అవుతూ, అక్కడ ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో కీలకమైన పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఏరియా ఏ.ఆర్.సీ.ఎస్‌కు బాధ్యుడుగా ఉంటూ, ఆదివాసీ రైతాంగాన్ని వ్యవసాయ విప్లవ పోరాటంలోకి చురుగ్గా కదిలించాడు. ఈ క్రమంలో అక్కడి ప్రజలను సంఘటితపరిచి విప్లవ ప్రజా కమిటీలను ఏర్పరిచాడు. అక్కడి మిలీషియా, ప్రజల సహకారంతో ఏరియాలో పెత్తందార్లనూ, పోలీస్ ఇన్‌ఫార్మార్స్‌ను కంట్రోల్ చేయడంలో కామ్రేడ్ మల్లాల్ ముందు పీఠిన నిలిచాడు. రాజ్యాధికార నిర్మాణాలను ఏర్పాటు చేస్తూ, వాటిని ఫంక్షన్ చేయించడంలో చొరవను ప్రదర్శించాడు. ప్రజలకు అర్థమయ్యే భాషలో రకరకాల ఉదాహరణలను ఇస్తూ, ప్రజలకు రాజకీయాలను బోధించడంలో కామ్రేడ్ మల్లాల్ దిట్టా. తను ఏ ప్రాంతానికి పోయినా, కొద్ది రోజుల్లోనే ఆ ప్రాంత ప్రజలతో లోతైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంలో చొరవ చేసేవాడు. దారుల మీద, టెర్రెయిన్ మీద మంచి పట్టు సంపాదించాడు.

శత్రువుతో జరిగిన అనేక ఫైరింగ్‌లలో కామ్రేడ్ మల్లాల్ చొరవను ప్రదర్శించి, శత్రువును నిలవరించే విధంగా ఫైరింగ్ చేస్తూ, తనతోటి కామ్రేడ్స్‌ను రక్షించడంలో ముందు ఉండేవాడు. 14 ఫిబ్రవరి, 2020న కాలిగూడ దగ్గర శత్రువు మకాంపై దాడి చేయడానికి వస్తున్న సమయంలో, కామ్రేడ్ మల్లాల్ ముందే శత్రువును చూసి ఫైరింగ్ ఓపెన్ చేయడంతో శత్రువు చొరవగా ముందుకు అడ్వాన్స్ కాలేకపోయాడు. ఇలా అనేక సంఘటనలలో కామ్రేడ్ మల్లాల్ చొరవగా, ధైర్య సాహసాలు ప్రదర్శించాడు.

కటాఫ్ ప్రాంతంలో శత్రువు తీవ్రమైన దాడి కొనసాగిస్తున్న నేపథ్యంలో కొత్త పాకెట్స్‌లోకి మన ఉద్యమం విస్తరించడం ద్వారా శత్రుదాడి నుండి కొంత వెసులుబాటును పొందవచ్చుననే నిర్ణయంలో భాగంగా కామ్రేడ్ మల్లాల్‌తో పాటు, మరో ముగ్గురు కామ్రేడ్స్‌ను టీంగా ఏర్పాటు చేసి పార్టీ గాజులమామిడి పాకెట్‌కు పంపించింది. పార్టీ నిర్ణయంలో భాగంగా కామ్రేడ్ మల్లాల్‌తో పాటు, మిగతా కామ్రేడ్స్ సింగవరం గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామంలో ఉన్న నెట్‌వర్క్ విషయంలో తగినంత అప్రమత్తంగా వ్యవహరించకపోవడంతో, మన సమాచారం శత్రువుకు తెలిసింది. 13, డిసెంబర్, 2020న శత్రువు రాత్రి 2 గంటల సమయంలో గ్రామాన్ని చుట్టిముట్టి దాడి చేసాడు. ఈ దాడిలో కామ్రేడ్ మల్లాల్ తన దగ్గర ఉన్న ఇన్‌సాస్ తుపాకితో పోరాడుతూ రిట్రీట్ అవుతున్న క్రమంలో శత్రువు ఎక్కువ సంఖ్యలో ఉండడం, అనేక వలయాలు చుట్టిముట్టి ఉండడంతో ఎక్కువ దూరం వెళ్ళలేకపోయాడు. ఈ క్రమంలో శత్రువు జరిపిన రాపిడ్ ఫైరింగ్‌లో కామ్రేడ్ మల్లాల్, కామ్రేడ్ శాంతమ్మలు అమరులైనారు.

కామ్రేడ్ మల్లాల్ అమరత్వం వార్త కటాఫ్ ఏరియాలో ఉన్న ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. సుమారు 15 సంవత్సరాల విప్లవ జీవితంలో కామ్రేడ్ మల్లాల్ ఏనాడు తన కుటుంబాన్ని చూడాలని కోరలేదు. ఒకటి, రెండు సందర్భాలలో కామ్రేడ్ మల్లాల్‌కు కుటుంబ సభ్యులను కలిపించేందుకు పార్టీ వైపు నుండి ప్రయత్నించినప్పటికీ, సరైన సమన్వయం జరగకపోవడంతో సాధ్యపడలేదు. శత్రువు కొనసాగిస్తున్న తీవ్రమైన దమనకాండ మధ్యనే ఎంతో ధైర్యంగా ప్రజలను కలుస్తూ వచ్చేవాడు. అనేక ఆటు, పోటులు, ఎగుడు, దిగుళ్ళ మధ్య ఉద్యమాన్ని అంటిపెట్టుకొని భవిష్యతుపై అచంచల విశ్వాసంతో కామ్రేడ్ మల్లాల్ పని చేసాడు. కామ్రేడ్ మల్లాల్ లాంటి సీనియర్ కామ్రేడ్స్‌ను కోల్పోవడం యమ్.కే.బీ డివిజన్ ఉద్యమానికే కాక, ఏ.ఓ.బీ ఉద్యమానికి కూడా తీరని లోటే. అయితే ప్రజాయుద్ధంలో వందలాది మల్లాల్‌లు పుట్టుకొస్తారనే విషయం శత్రువుకు తెలియదు. కామ్రేడ్ మల్లాల్ మనకు భౌతికంగా దూరమైనా, ఆయన ఆశయాలు, ఆదర్శాలు నిరంతరం మన వెంటే ఉంటాయి. కామ్రేడ్ మల్లాల్ ఆశయాలను కొనసాగించడంలో భాగంగా మనమందరం మరింత బాధ్యతాయుతంగా పనిచేద్దాం. అంతిమ విజయం సాధించే వరకు మడమ తిప్పకుండా పోరుదారిలో నడుద్దామని ఈ సందర్భంగా శపథం చేద్దాం.

**నోట్ :**

**ఈ బులిటెన్ విడుదల సమయంలో, జూన్ 16న, ఈస్ట్-విశాఖ డివిజన్, తీగలమెట్ట అటవీ ప్రాంతంలో, ఎన్‌కౌంటర్ జరిగి 6గురు కామ్రేడ్స్ అమరులైనారు. దీంతో వారి ఫోటోలనూ, జీవిత చరిత్రలను సేకరించలేకపోయాము. వచ్చే బులిటెన్‌లో ఫోటోలతోపాటు, జీవిత చరిత్రలు ప్రచురిస్తాము. ఈ పరిమితిని పాఠకులు అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాం.**

# దండకారణ్య ముద్దు బిడ్డ

# ఏ.ఓ.బీ పోరాటాల వారసత్వం

# కామ్రేడ్ కిషోర్

దండకారణ్య ఉద్యమంలో భాగంగా ఉన్న దర్భ డివిజన్, కాంగేర్‌ఘాట్ ఏరియా, చాందిమెట్ట గ్రామంలో 30 సంవత్సరాల క్రితం కామ్రేడ్ కిషోర్ జన్మించాడు. తల్లిదండ్రులకు చివరివాడు కావడంతో, తనను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు మాస. తన తోబుట్టువులు ఒక అక్క, ఒక అన్నయ్య ఉన్నారు. ఈ కుటుంబం కూడా భూమి కోసం మొండెం గ్రామం నుండి చాందిమెట్ట గ్రామానికి వలస వచ్చి, కష్టపడి కొంత భూమిని తయారు చేసుకున్నారు. తన చిన్నప్పుడే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. తన తల్లే రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబాన్ని పెంచి పోషించింది. తమ గ్రామంలోనే 2వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పటి నుంచే ఆ ప్రాంతంలో జరిగే పోరాటాలనూ, ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీ నాయకత్వాన్నీ, దళాలను పరిశీలించేవాడు. తమ గ్రామానికి పార్టీ వచ్చినప్పుడు తను కూడా హుషారుగా దళాల దగ్గరకు వెళ్ళి పోరు పాటలు వినడం, వాళ్ళతో కలిసి పాడటం, వాళు ళ్ళ చెప్పే వర్గపోరు రాజకీయాలను ఆలకించడం కిషోర్‌కు అలవాటుగా మారింది. అందుకే చిన్నప్పుడే మొదట బాలల సంఘంలోనూ, తర్వాత మిలీషియాలోను భాగమయ్యాడు. చిన్ననాటి నుండే అన్ని విషయాలను నేర్చుకోవడానికి మక్కువ కనబరిచేవాడు. నేర్చుకున్న ప్రతి విషయాన్ని గుర్తు పెట్టుకొని వాటిని ఆచరించడానికి కృషి చేసేవాడు. ఈ క్రమంలో పార్టీ తనలో ఉన్న చురుకుదనాన్ని దృష్టిలో పెట్టుకొని మిలీషియాలో సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు అప్పజెప్పింది. కోలంగి గ్రామంలో ఫారెస్టు బిల్డింగ్ పేల్చివేసిన సంఘటనలో తనే మిలీషియా కమాండర్‌గా ఉంటూ, ఆ చర్యను విజయవంతం చేయడంలో కృషి చేసాడు. శత్రు సరఫరాలకు వ్యతిరేకంగా రోడ్డులను బ్లాక్ చేయడం, పార్టీ అవసరాలకు సంబంధించిన సప్లై పనుల్లో భాగమవ్వడం తదితర పనుల్లో చురుకుగా పాల్గొనేవాడు. 2011 లో పూర్తికాలం విప్లవకారుడిగా తన పనిని ప్రారంభించాడు. 2011 నుండి 2012 జనవరి వరకు తను పుట్టి పెరిగిన కాంగేర్‌ఘాట్ ఏరియాలోనే దళంలో పనిచేస్తూ, అనేక ప్రజాపోరాటాలలో భాగమయ్యాడు.

2012లో పార్టీ, కామ్రేడ్ కిషోర్‌ని ఏ.ఓ.బీకి బదిలీ చేసింది. ఏ.ఓ.బీ తనకు కొత్త ప్రాంతమే అయినప్పటికీ, పార్టీ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించి ఏ.ఓ.బీ జోన్‌లో తన కార్యాచరణను కొనసాగించాడు. 2012 ఫిబ్రవరి నుండి 2013 మే వరకు ఎస్.జడ్.సీ మెంబర్‌కు గార్డ్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 2013 నుండి 2016 వరకు 2వ ప్రొటక్షన్ దళంలో సభ్యుడిగా కొనసాగాడు. 2016 అక్టోబర్‌లో జరిగిన రాంగూడ ఘటనకు ముందే ప్రొటక్షన్ స్క్వాడ్స్ 1,2 లను కలిపి ప్రొటక్షన్ ప్లాటూన్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. ఆ నిర్మాణంలో కిషోర్ సెక్షన్ కమాండర్‌గా నియమించబడ్డాడు. కానీ రాంగూడ ఎన్‌కౌంటర్‌లో ప్లాటూన్ సెక్రటరీతోపాటు, మరికొందరు కామ్రేడ్స్ అమరులు కావడంతో ప్లాటూన్ నిర్మాణం రద్దయిపోయింది. కేవలం కొద్దిమంది కామ్రేడ్స్ మిగలడంతో దానిని తిరిగి స్క్వాడ్‌గా నిర్మాణం చేయడం జరిగింది. ఇందులో కిషోర్ డిప్యూటీగా నియమించబడ్డాడు. ఈ నిర్మాణంలో 2017 నవంబర్ వరకు  కొనసాగాడు. కమ్యూనికేషన్, రిమోట్‌లను ఉపయోగించడంలో పట్టును సంపాదించాడు.  2017 నవంబర్‌లో జరిగిన ఎస్.ఎమ్.సీ మీటింగ్‌లో పార్టీ తనను కొరాపుట్ డివిజన్‌లో



పని చేస్తున్న రీజినల్ పీ.ఎల్-3కి బదిలీ చేసింది. అక్కడ ప్లాటూన్ సెక్షన్ కమాండర్ బాధ్యతలు అప్పజెప్పింది. అక్కడ కూడా పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేసాడు. 2018 సెప్టెంబర్‌లో జరిగిన ఎమ్.ఎల్.ఏ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఏ సీవేరి సోమలను పీ.ఎల్.జీ.ఏ ఖతం చేసిన ఘటనలో కీలకమైన పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఈ సంఘటనలో స్కౌట్ బాధ్యుడుగా ఉంటూ, ఎప్పటికప్పుడూ వాళ్ళ కదలికలకు సంబంధించిన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి సమాచారం ఇవ్వడంతో ఆ యాక్షన్ సఫలం అయింది.

2018 నవంబర్‌లో నుర్మతి పోలీసు క్యాంపుకు అందుబాటులోకి వెళ్ళి పెట్రోలింగ్‌కు పోతున్న పోలీసులపై ఆంబుష్ చేసిన ప్రత్యేక యాక్షన్ టీంకు కామ్రేడ్ కిషోర్ బాధ్యుడిగా ఉన్నాడు. ఈ ఘటనలో

తను మైన్స్‌కు అందుబాటులో ఉండి పేల్చివేయగా ఇద్దరు సీ.ఆర్.పీ.ఎఫ్ జవాన్లు సీరియస్‌గా గాయపడ్డారు. 2019లో జరిగిన ఎస్.జడ్.సీ మీటింగ్‌లో పార్టీ, కిషోర్‌ను ఉద్యమ అవసరాలరీత్యా రీజనల్ పీ.ఎల్-1లోకి బదిలీ చేసింది. ఇదే సంవత్సరంలో దండాబడి పరిసర ప్రాంతంలో జరిగిన ఆంబుష్ ఘటనలో కామ్రేడ్ కిషోర్ రిమోట్ టెక్నాలజీని ఉపయోగించి ఇద్దరు బీ.ఎస్.ఎఫ్ జవాన్లను సీరియస్‌గా గాయపరిచాడు. సెప్టెంబర్ 2020లో గుమ్మలవాడ గ్రామంలో పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్న బుద్రను ఖతం చేసేదాంట్లో నలుగురుతో కూడిన యాక్షన్ టీంకు కమాండర్‌గా ఉంటూ, ఆ చర్యను విజయవంతం చేసాడు.

కామ్రేడ్ కిషోర్ పని చేసే ప్రాంతం ఒడిశారాష్ట్రం కావడంతో అతి తక్కువ సమయంలోనే ఒడియా భాషను నేర్చుకున్నాడు. స్థానిక ప్రజలతో కలిసిపోవడానికి సీరియస్‌గా ప్రయత్నించేవాడు. దారులమీద, టెర్రయిన్‌మీద పట్టు సాధించేందుకు కృషి చేసేవాడు. మిలటరీపరంగా, రాజకీయపరంగా మిలీషియా కామ్రేడ్స్‌కు తర్ఫీదు నిచ్చేవాడు. తనలో ఉన్న పాజిటివ్ లక్షణాలపై ఆధారపడి తనకు పీ.ఎల్ కమాండర్‌గా బాధ్యతలు ఇవ్వాలని 2020 జులైలో జరిగిన ఎస్.జడ్.సీ మీటింగ్‌లో పార్టీ నిర్ణయం తీసుకుంది.

కటాఫ్ ప్రాంతంలో శత్రు కేంద్రీకరణ సీరియస్‌గా పెరగడంతో, శత్రువును దెబ్బతీయకుండా మనం ఇతర పనులను నిర్వహించుకోలేని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే శత్రువును రిమోట్, బూబిట్రాప్ సాధనాలను ఉపయోగించి దెబ్బతీయాలనే నిర్ణయంలో భాగంగా కామ్రేడ్ కిషోర్‌తో పాటు, మరికొంత మంది కామ్రేడ్స్ వెళ్ళి, తోటగూడ గ్రామంలో మకాం వేసి, ప్రతిఘటనకు కావాల్సిన వస్తువులను సమకూర్చేపనిలో నిమగ్నమయి ఉన్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో శత్రువు కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాడు. నిర్దిష్టంగా ఆ గ్రామం నుండి ఇన్‌ఫార్మర్ ద్వారా స్పష్టమైన సమాచారం శత్రువుకు చేరడంతో, ఉదయం 10 గం॥లకు శత్రువు ఊరును చుట్టిముట్టి ఫైరింగ్ ప్రారంభించాడు. శత్రువు మూడు వైపుల చుట్టిముట్టి ఫైరింగ్ చేయడంతో 24, నవంబర్ 2020న కామ్రేడ్ కిషోర్ అమరుడైనాడు. 2012 నుండి 2021 వరకు సుమారు 9 సంవత్సరాలపైగా ఏ.ఓ.బీ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. కాళ్ళనొప్పులు వంటి కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, బరువులు మోయడంలోనూ, కష్టపడి పని చేయడంలోను ఆదర్శంగా ఉండేవాడు.

కామ్రేడ్ కిషోర్ అమరత్వ వార్త విన్న కటాఫ్ ఏరియా ప్రజలు అతడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. అన్ని పాకెట్స్‌లో అతని సంస్మరణ సభలు జరుపుకొన్నారు. సమసమాజ కోసం కామ్రేడ్ కిషోర్ కన్న కలలను నిజం చేస్తామని ప్రతినబూనారు.

---

41వ పేజీ తరువాయి భాగం...

2020-21 ప్రారంభంలో ముగిసిన సీ.సీ 6వ కొనసాగింపు సమావేశంలో ఫైనల్ చేసిన 14 సంవత్సరాల సీ.సీ పీ.ఓ.ఆర్ సహా పలు పార్టీ డాక్యుమెంట్ల చర్చలలో కామ్రేడ్ లక్మా చాలా చురుగ్గా పాల్గొన్నాడు. తన మూడు దశాబ్దాల అనుభవం, అధ్యయనం వెలుగులో వాటిని సమృద్ధి చేయడంలో జరిగిన కృషి ఎంతగానో తోడ్పడింది. ఆ కామ్రేడ్‌కు ఆ మీటింగే తొలి మీటింగ్‌తోపాటు, చివరిది కావడం భారత విప్లవోద్యమానికి ఎనలేని హాని కలిగించింది. మూడు రకాల వయస్సుల కామ్రేడ్స్‌తో పటిష్టమవుతున్న సీ.సీలో యువతరానికి ప్రాతినిధ్యం వహించిన కామ్రేడ్ లక్మా అకాల మరణం తక్షణం పూడ్చుకోలేని లోటుగా మిగిలింది.

కామ్రేడ్ లక్మా అమరత్వం భారత విప్లవోద్యమానికి తక్షణం పూడ్చుకోలేని లోటు. ఆయన ప్రజలను అమితంగా ప్రేమించేవాడు. దెబ్బతిన్న తెలంగాణలో తిరిగి ఉద్యమానికి ఊపిర్లు పోయడంలో ఆయన జరిపిన కృషి, పెంపొందుతున్న ప్రజా పోరాటాలలో, విప్లవ నిర్మాణాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఆయన నిరంతర అధ్యయనశీలి. ఆయన నేర్చుకోవడంలో ముందుండేవాడు. ఆయన నేర్చుకున్నది మళ్ళీ తన క్యాడర్లకు బోధించడంలో ఆదర్శ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల అభిమానాన్ని చురగొన్నవాడు. ఆయన ఒక మంచి నేర్పరైన సైనిక జనరల్. 2021 ఏప్రిల్ 3నాడు దాదాపు 60 మంది పోలీసు, అర్ధసైనిక బలగాలను మట్టు బెట్టడమో, గాయపరచడమో చేసిన జీరగూడ దాడికి నాయకత్వ కోర్‌లో ఆయన పాత్ర ఆ దాడి విజయానికి ఎంతగానో తోడ్పడింది.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి విద్రోహాన్ని ప్రజలలో ఎండగట్టడంలో కామ్రేడ్ లక్మా నిరంతర కృషి సలిపాడు. నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు అంటూ ప్రజలలో అనేక భ్రమలు కల్పించి, మావోయిస్టుల ఎజెండానే తన ఎజెండా అని నమ్మబలికి తుదకు భూస్వామ్య, సామ్రాజ్యవాద శక్తులకు ఊడిగం చేస్తూ, నూతన రాష్ట్ర వనరులను వారికి నిలువునా దోచిపెట్టడంలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్న తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వ విధానలను ఎప్పకటికప్పుడు ప్రజలలో బట్టబయలు చేయడంలో తెలంగాణ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఆయన ప్రతిభావంతుడిగా వ్యవహరించాడు. అధికారాన్ని నిలుపుకోవడం కోసం కేంద్రంలోని హిందుత్వ శక్తులతో అంటకాగుతున్న తెలంగాణ రాష్ట్ర సమితి విధానాలను కామ్రేడ్ జగన్ పేరుతో లక్మా ప్రజలకు సవివరంగా తెలిపేవాడు.

మూడు దశాబ్దాలకు పైగా విప్లవ అనుభవాన్ని కలిగిన యువ నాయకత్వ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్రమైన లోటే. మరీ ముఖ్యంగా దేశ వ్యాపితంగా హిందుత్వ శక్తులు భారత విప్లవోద్యమాన్ని తుదకంటా నిర్మూలించడానికి పథకాలు రూపొందిస్తున్న తరుణంలో అన్ని రంగాలలో అనుభవాన్ని గడిస్తున్న కామ్రేడ్ లక్మా అమరత్వం భారత విప్లవోదమ్యమానికి పెద్ద నష్టం. ప్రపంచాన్ని కరోనా కుదిపివేస్తున్న పరిస్థితులలో దేశంలో విజృంభిస్తున్న కరోనా రెండవ అలా అడవులకు కూడా విస్తరించిన నేపథ్యంలో కామ్రేడ్ లక్మా దాని తాకిడికి గురై తీవ్రమైన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచాడు. ఆ కామ్రేడ్ విప్లవ అనుభవాలనూ, ఆదర్శాలను ముమ్ముందుకు తీసుకుపోతూ, ఆయన విప్లవ స్వప్నాలను సాకారం చేద్దాం. లక్మా గురించి ఒక్క వాక్యంలో చెప్పాడంటే ఉద్యమం గురించి నిరంతర తపన అవిశ్రాంత కృషి, నూతనోత్సాహం, నిర్ణయాత్మక పాత్ర, క్రియాశీలమైన డైనమిక్ నాయకత్వం అని చెప్పుకోవాలి.

# మన్యం పితూరి సేన సైనికుడిగా

# పి.ఎల్.జీ.ఏ శ్రేణుల యోధుడిగా

# కామ్రేడ్ దయ

మన్యంలోని విప్లవోద్యమ ప్రాంతంలో వాకపల్లి గ్రామం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా) ఒకటి. ఆ గ్రామం నుంచి పీడిత ప్రజల విముక్తే లక్ష్యంగా అనేక మంది విప్లవోద్యమంలోకి రిక్రూట్ అయ్యారు. అంతేకాక 2007లో కూంబింగ్‌కి వచ్చిన గ్రేహౌండ్స్ బలగాలు తిరిగి వెలుతున్న క్రమంలో వాకపల్లి గ్రామాన్ని చుట్టుముట్టి 11 మంది మహిళలను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి, వారిని అత్యాచారం చేసారు. ఈ విషాధ ఘటన దేశాన్నే కుదిపివేసింది. బాధిత మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరు కలిసి న్యాయం కోసం ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు, విరామమెరుగక పోరాడుతూనే ఉన్నారు. సరిగ్గా ఈ పోరాట పటిమగల గ్రామం వాకపల్లిలోనే కామ్రేడ్ పాంగి పేతూరు జన్మించాడు. ఇతడి చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. విప్లవోద్యమ గ్రామం కావడంతో, తండ్రి విప్లవ రైతుకూలీ సంఘంలో పని చేస్తున్నాడు. తండ్రితోపాటు కామ్రేడ్ పేతూరు కూడా సంఘ కార్యకలాపాలకు హాజరవుతుండేవాడు. వాకపల్లికి 2, 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయితీ గ్రామం నుర్మతిలో కామ్రేడ్ పేతూరు సాంఘీక సంక్షేమ వసతీ గృహంలో ఉంటూ చదువు కొనసాగించాడు. కానీ అది పూర్తిగా కొనసాగలేదు. గొడ్లకాపు, వ్యవసాయ పనులరీత్యా తండ్రి తనకొడుకు తోడు కావాలనుకున్నాడు. 7వ తరగతిలోనే తన చదువును ఆపివేసి, తండ్రికి తోడుగా పనుల్లో భాగమవుతూ, మిలీషియాలో పని చేయడం ప్రారంభించాడు.

24, అక్టోబర్ 2016న జరిగిన రాంగూడ ఎన్‌కౌంటర్ పార్టీ చరిత్రలోనే పెద్దది. 31 మంది కామ్రేడ్స్ అమరత్వం సభ్యసమాజాన్ని కలచివేసింది. ఆ సమయంలో రాంగూడ అమరుల స్ఫూర్తితో పార్టీలోకి యువతీ, యువకులు భర్తీ అయ్యారు. అలా భర్తీ అయిన వాళ్ళలో కామ్రేడ్ పేతూరు ఒకరు. అయితే కామ్రేడ్ పేతూరును తండ్రే పార్టీలోకి పంపించాడు. ఇలా తండ్రి ప్రోత్సాహంతో కామ్రేడ్ పేతూరు 2017 ప్రారంభంలో పెదబయలు దళంలోకి భర్తీ అయ్యాడు.

కామ్రేడ్ పేతూరు రాంగూడ అమరులలో ఒకరైన కామ్రేడ్ దయ (చామల కిష్టయ్య) పేరును కరారు చేసుకున్నాడు. స్థానిక పెదబయలు దళంలో తన పనిని ప్రారంభించినప్పటి నుంచి ప్రజలందరికీ దయగా సుపరిచితుడయ్యాడు. ఈ కాలంలో పెదబయలు దళం బాధ్యుడికి చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని పనుల్లోను చురుగ్గా పాల్గొనేవాడు. ముఖ్యంగా కష్టపడే పనుల్లో ఇతరులతో పోటీ పెట్టుకోకుండా తన శక్తిమేరకు పని చేయడంలో ఉన్నత చైతన్యాన్ని ప్రదర్శించేవాడు. కొంతకాలానికి 2018 జూన్‌లో పార్టీ ఉద్యమ అవసరాలరీత్యా కామ్రేడ్ దయను ప్రొటక్షన్ స్క్వాడ్-1లోకి బదిలీ చేసింది. అక్కడ కూడా పార్టీ అప్పజెప్పిన పనులను వినయంగా, ఓపికగా నిర్వహిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ప్రొటక్షన్ స్క్వాడ్-1 ఒక సుదీర్ఘ ప్రయాణానికి సమాయత్తం కావాల్సి వచ్చింది. అది వర్షకాలం కావడంతో ప్రయాణం కష్టభూయిష్టంగా మారింది. ఈ పరిస్థితి అర్థమవుతున్నా కామ్రేడ్ దయ ఆ ప్రయాణానికి ఉత్సాహంగానే ఇష్టపడ్డాడు. కానీ ప్రారంభంలోనే



నడకలో కాలుజారి కిందపడి చేతివేలుకు గాయమైంది. ఇక అతడిని ముందుకు తీసుకుపోలేని పరిస్థితి. దాంతో బాధ్యులు కామ్రేడ్ దయను స్థానిక కామ్రేడ్స్‌కు అప్పజెప్పి వారు ప్రాయాణాన్ని కొనసాగించారు.

కామ్రేడ్ దయ వేలుకు ట్రీట్‌మెంట్ కాగానే పార్టీ ఆయనను తిరిగి పెదబయలు దళానికే పంపింది. అక్కడ తన పనిలో మరింత మెరుగుదలను సాందించాడు. సివిల్‌ల్లో చేసే పనులలో చురుకుదనం

తరువాయి భాగం 53వ పేజీలో...

# కటాఫ్ ఏరియా ముద్దు బిడ్డ

# కామ్రేడ్ శాంతమ్మ

కామ్రేడ్ శాంతమ్మ మల్కనగిరి జిల్లా, గుమ్మ బ్లాక్, చిన్న అమిలిబెడ గ్రామంలో 20 సంవత్సరాల క్రితం పురుడుబోసుకుంది. తన తండ్రి సంఘనాయకుడు కావడంతో ఆ ప్రాంతంలో జరుగుతున్న అనేక పోరాట విషయాలను ఆమెకు చెప్పేవాడు. అలా చిన్నప్పటినుండి పార్టీ, దళాలకు సంబంధించిన విషయాలు ఆమె ఎరుకలోకి వచ్చాయి. కామ్రేడ్ శాంతమ్మది కష్టపడే స్వభావం. తన చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తల్లి చనిపోయినప్పటి నుండి తన కష్టాలు మరింతగా పెరిగాయి. తెల్లవారి లేచినప్పటి నుండి ఇంటి పనులు, వంట పనులు చేసి ఆ తర్వాత గొడ్లుకాయడం, సాయంకాలం ఇంటికి వచ్చిన తరువాత ఇంటి, వంట పనులు చేయడం ఇలా ఏ ఒక్క క్షణం కూడా తనకు విరామం దొరికేది కాదు. తన తల్లి చనిపోయిన తర్వాత తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కామ్రేడ్ శాంతమ్మను సరిగా చూసేది కాదు. ఎన్ని సమస్యలు, కష్టాలు ఎదురైనా వాటిని ఓపికతో ఓర్చుకుంటూ, తన బాధ్యతలు నెరవేర్చుకుంటూ వచ్చేది. ఈ క్రమంలోనే తన గ్రామంలో పార్టీ నాయకత్వంలో సంఘ నిర్మాణం జరగడం, దళం ఆ గ్రామానికి నిరంతరం వెళ్ళి పాటలు పాడడం, పోరాట వార్తలు మీటింగ్‌లో చెప్పడం ద్వారా కామ్రేడ్ శాంతమ్మ అవి నేర్చుకొని తనతోటి స్నేహితులకు అర్థం చేయించేది. గ్రామంలోకి దళం పోయిన తర్వాత, దళానికి సంబంధించిన పనులలో తన స్నేహితులతో కలిసి పాల్గొనేది. దళం ఆ గ్రామంలో యువతీ, యువకులతో మిలీషియా నిర్మాణం చేపట్టింది. ఆ మిలీషియా నిర్మాణంలో కామ్రేడ్ శాంతమ్మ భాగమయ్యింది. అప్పటినుండి మరింత బాధ్యతగా పనులు చేసింది. మన సివిల్ ఆర్గనైజర్స్ ఆ గ్రామానికి పోయినప్పుడు వాళ్ళతో పాటు కలిసి ఉంటూ, పార్టీ రాజకీయాలను నేర్చుకుంది. ఈ క్రమంలో పార్టీ అందించిన చైతన్యంతో పాటు, తన తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో పూర్తికాలం కార్యకర్తగా ఎదిగింది. డిడోయి, కువ్వి, ఒడియా భాషలతో ప్రజలకు తనకు తెలిసిన విషయాలను బోధించేది.

కామ్రేడ్ శాంతమ్మ పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చిన తరువాత మిలటరీపరంగా నేర్చుకోవడంలో చాలా ఆసక్తి కనపరిచేది. ఎక్సర్‌సైజ్, వెపన్ పొజీషన్స్ తదితర మిలటరీ విషయాలను నేర్చుకోవడానికి సీరియస్‌గా ప్రయత్నించేది. శాంతమ్మ స్థానిక కామ్రేడ్ కావడంతో ప్రతి గ్రామంలో తనకున్న పరిచయాలను పార్టీకి చెప్పేది. పార్టీ కూడా తనను మరింత అభివృద్ధి చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. తను పూర్తికాలం కార్యకర్తగా సిద్ధపడి 4 నెలలు అవుతుంది. ఈ క్రమంలోనే ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ 1+3 నిర్మాణాన్ని గాజులమామిడి పాకెట్‌లో ఆర్గనైజ్ చేయడం కోసం పంపించింది. ఈ టీంలో కామ్రేడ్ శాంతమ్మను కూడా ఒక మెంబర్. ఉద్యమ కర్తవ్యాలలో భాగంగా 13, నవంబర్ 2020వ తేదీన సింగవరం గ్రామానికి ఈ టీం వెళ్ళింది. ఆ గ్రామంలో గతంలో కొంత అనుమానం ఉన్నప్పటికీ, వాళ్ళతో మాట్లాడాలని నిర్ణయించుకొని వెళ్ళారు. అయితే ఊహించిన విధంగానే మన కామ్రేడ్స్ ఆ గ్రామం వెళ్లగానే శత్రువుకు సమాచారం వెళ్ళింది.



దీంతో శత్రువు రాత్రి 2 గంIIల సమయంలో గ్రామాన్ని చుట్టిముట్టి కాల్పులు జరపడంతో, ఆ కాల్పుల మధ్యనే రిట్రీట్ అవుతున్న క్రమంలో కామ్రేడ్ శాంతమ్మకు తూటా తగిలి అమరురాలైంది.

ఎన్ని కష్టాలు ఎదురైన పార్టీలో కొనసాగుతూ, ప్రజలకు సేవ చేయాలనే దృఢదృక్పథంతో కామ్రేడ్ శాంతమ్మ చివర వరకు జీవించింది. కామ్రేడ్ శాంతమ్మ ఆదర్శాలను ఎత్తిపట్టాలి. కామ్రేడ్ శాంతమ్మ ఆశయాలను కొనసాగించాలి.

# ఎమ్.కే.బీ డివిజన్
# శత్రు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ నియంత్రణ, విప్లవ వారోత్సవాలు, కరోనా కార్యక్రమాలు

★ (2020 ఆగస్టు) విశాఖపట్నం జిల్లా, ముంచంగిపుట్ మండలం, ఉప్పచెరువు గ్రామానికి చెందిన సోన్యా క్రిష్టియన్ మతసంస్థకు ఫాస్టర్‌గా ఉంటూ ప్రజలపై పెత్తనం చేసేవాడు. అనేక గ్రామాలకు క్రిష్టియన్ మత సంస్థను వ్యాప్తి చేస్తుండేవాడు. ఈ పనులతోపాటు, గంజాయి వ్యాపారం చేసి, ప్రజలకు డబ్బులు ఎగ్గొడుతుండేవాడు. ఈ మధ్య కాలంలో సుమారు 10 లక్షల రూపాయల వరకు ప్రజలకు ఎగ్గొట్టాడు. మరోవైపు పోలీసులతో సంబంధాలను కొనసాగిస్తూ, గ్రామంలోఉన్న పార్టీ, సంఘ, మిలీషియా కామ్రేడ్స్ వివరాలతోపాటు, వారి కార్యకలాపాలను కూడా పోలీసులకు చేరవేస్తుండేవాడు. ఇతడు దళంలో పని చేసి, పారిపోయిన దేవాల్‌కు స్వయాన మేనమామ. ఇతడి ఆగడాలు భరించలేక సంఘ నాయకత్వంలో మీటింగ్ ఏర్పాటు చేసి, పద్ధతులను మార్చుకోవాలనీ, ప్రజలకు ఇవ్వవలసిన డబ్బులు వెంటనే అందజేయాలనీ, పోలీసులతో సంబంధాలు కొనసాగించరాదనీ, క్రిష్టియన్ ఫాస్టర్ పని చేయకుండా సాధారణంగా బతకాలని షరతులు పెట్టి హెచ్చరిస్తూ వదిలిపెట్టారు. గ్రామ ప్రజలు పెట్టిన షరతులను ఏ మాత్రం లెక్కచేయకుండా అదే పద్ధతిని కొనసాగిస్తూ వచ్చాడు. ఇతడి కార్యాచరణను మరొకసారి పాకెట్ కమిటీలో చర్చించి సీరియస్‌గా దేహశుద్ధి చేసి, గ్రామం నుండి తరిమివేయాలని నిర్ణయం చేయడం జరిగింది. ఈ నిర్ణయం అమల్లో భాగంగా సిర్లిమెట్ట పాకెట్‌లో ఉన్న అన్ని గ్రామాల నుండి ప్రజలు సుమారు 400 మంది వరకు హాజరై అతడికి సీరియస్‌గా దేహశుద్ధి చేసి, కట్టుబట్టలతోనే గ్రామం నుండి తరిమేసారు. తను నివసిస్తున్న ఇల్లునూ, ఇతర ఆస్తులను ప్రజలు స్వాధీనం చేసుకొని పంచుకున్నారు.

★ విశాఖపట్నం జిల్లా, ముంచంగిపుట్ మండలం, బొడపనస గ్రామానికి చెందిన కామేష్ అనే వ్యక్తి గత కొంత కాలంగా పార్టీ, ప్రజాసంఘాలకు సంబంధించిన సమాచారాన్ని రహస్యంగా పోలీసులకు చేరవేస్తూ వచ్చాడు. గ్రామంలో ఉన్న ప్రజలనూ, సంఘ నాయకత్వాన్ని కూడా భయపెట్టేవాడు. అంతే కాకుండా పార్టీ కార్యకర్తల, ప్రజాసంఘాల కార్యకర్తల సమాచారాన్ని సేకరించి సెల్‌ఫోన్‌తో ముంచంగిపుట్ ఎస్.ఐకు చెప్పేవాడు. ఈ పని కోసం పోలీసులు, ఇతడికి సెల్‌ఫోన్, సిమ్ కూడా అందజేసారు. సమాచారం చెప్పిన ప్రతి సందర్భంలోనూ, ఇతడికి పోలీసులు ఎంతో కొంత డబ్బులు ముట్టజెప్పేవారు. ఈ విషయం పార్టీ దృష్టికి రావడంతో, ప్రజల సమక్షంలో ఇతడిని పార్టీ విచారించింది. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కామ్రేడ్స్ ఇతడి నుంచి పోలీసులు యిచ్చిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, సీరియస్‌గా హెచ్చరించి వదిలి పెట్టారు. టౌన్ సెంటర్స్‌కూ, సంతలకు ఎక్కడికీ పోవద్దని కండీషన్ పెట్టారు. పార్టీ, ప్రజలు పెట్టిన ఈ కండీషన్స్‌ను కొద్ది రోజులు మాత్రమే అమలు చేసాడు. తిరిగి పాత పద్ధతులనే కొనసాగిస్తూ వచ్చాడు. ఇతడిని మరొకసారి పట్టుకొని విచారిస్తే మంచిదని ప్రజలు డిమాండ్ చేయడంతో, 2020 డిసెంబర్ నెలలో పీ.ఎల్.జీ.ఏతోపాటు, సుమారు 100 మందికిపైగా ప్రజలు, మిలీషియా పోయి ఇతడిని పట్టుకొని 'ఇదే నీకు చివర అవకాశమనీ, పద్ధతులు మార్చుకోకపోతే మరణశిక్ష తప్పదని' హెచ్చరించారు. తనకు పోలీసులు ఇచ్చిన మరొక మొబైల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రామాన్ని వదిలి ఎక్కడికి పోవద్దని కండీషన్స్ పెట్టి వదిలిపెట్టారు.

★ విశాఖపట్నం జిల్లా, ముంచంగిపుట్ మండలం, పదాల్‌పుట్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిని పార్టీ, మిలీషియా, ప్రజలు కలిసి విచారించారు. ఇతడు కూడా ముంచంగిపుట్ పోలీసుల లింకులోనే ఉంటూ, ఎప్పటికప్పుడు పార్టీ కదలికలనూ, గ్రామసంఘ నాయకుల సమాచారాన్ని సేకరించేవాడు. గ్రామంలో ఇతడు పెత్తందారీ కావడంతో తను చెప్పే మాటే గ్రామ ప్రజలు వినాలని షరతు పెట్టేవాడు. గ్రామంలో పార్టీకి సంబంధించిన వ్యక్తులు మీటింగ్ పెడితే, ఇతడు ఏ రోజు ఆ మీటింగ్‌కు వెళ్ళకపోవడమే కాకుండా, మీటింగ్‌కు పోయిన ప్రజలను భయపెట్టేవాడు. పార్టీ, గ్రామ సంఘనాయకత్వం పట్ల దురుసుగా మాట్లాడేవాడు. 2020

ఏప్రిల్ నెలలో ఇతడిని ప్రజల ముందు పెట్టి దేహశుద్ధి చేసారు. ఈ ప్రజాకోర్టులో సుమారు 150 మంది వరకు ప్రజలు, మిలీషియా పాల్గొన్నారు. ప్రజలు, సంఘం చెప్పినట్లుగా నడుచుకోవాలనీ, సంతలకుగానీ, ముంచంగిపుట్‌కుగానీ, మరే ఇతర గ్రామాలకు గాని పోవద్దని షరతులు పెట్టి వదిలిపెట్టారు. అయితే తర్వాత ఇతడి పద్ధతిలో మార్పేమిరాలేదు. ప్రజలు పెట్టిన ఏ షరతును కూడా పాటించకుండా పాత పద్ధతిలోనే తన కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చాడు. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే ఒక పోలీసు ఇన్‌ఫార్మర్‌గా తన కార్యకలాపాలను తీవ్రతరం చేసాడు. పోలీసులతో సంబంధాలను వదిలిపెట్టకుండా నిరంతరం కొనసాగిస్తూ వచ్చాడు. పోలీసులకు తొందరగా సమాచారం చేరవేసేందుకు వారి నుండి మరో రెండు సెల్‌ఫోన్స్‌ని కూడా తీసుకున్నాడు. ఇతడు పోలీసులు ఇచ్చిన సెల్‌ఫోన్స్‌ను తన దగ్గర ఒకటి పెట్టుకొని, మరొకదాన్ని గ్రామంలో ముఖ్యంగా మనం ఆధారపడుతున్న సాహు అనే మరో సంఘ నాయకుడ్ని లోబర్చుకొని, అతడికి అందజేసాడు. వీళ్ళ బుద్ధిలో మార్పు రాలేదని గ్రహించిన ప్రజలు, మిలీషియా కలిసి మార్చి 2021న రాజు అనే వ్యక్తికి సీరియస్‌గా దేహశుద్ధి చేసారు. సాహు అనే సంఘనాయకుడిని కూడా సీరియస్‌గా హెచ్చరిస్తూ తనను సంఘం నుండి తొలగిస్తున్నట్లు ఆ సందర్భంగానే ప్రకటించారు. ఇద్దరి దగ్గర ఉన్న సెల్‌ఫోన్స్, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రజాకోర్టులో సుమారు 100 మందికి పైగా ప్రజలు, మిలీషియా పాల్గొన్నారు.

### పోలీసు దాడులకు వ్యతిరేకంగా ప్రజాందోళన

విశాఖ జిల్లా, ముంచంగిపుట్ మండలానికి చెందిన కిమిడిపుట్, దొరగూడ, అండికల్, మూలపుట్ తదితర గ్రామాలపై ఆంధ్ర గ్రేహౌండ్స్ పోలీసులు నిరంతరం కొనసాగిస్తున్న ఫాసిస్టు దాడులను నిరసిస్తూ, సుమారు 300 మందికి పైగా ప్రజలు సమావేశమై పత్రికావిలేఖర్ల ముందు పోలీసులు చేస్తున్న అరాచకాలను బహిరంగంగా మాట్లాడారు. ముఖ్యంగా మావోయిస్టు పార్టీకి సహకరిస్తున్నారనే పేరుతో గ్రామాలపై దాడులు చేయడం, అరెస్టులు చేయడం, వేధించడం, లాంటివి పూర్తిగా బంద్ చేయాలని డిమాండ్ చేసారు. అంతేకాకుండా తమకు చెందిన 4 లేదా 5 వేల విలువ చేసే గొర్రెలనూ, మేకలను రూ॥ 1000 లేదా రూ॥ 1500 ఇచ్చి దౌర్జన్యంగా లాగేసుకుంటున్నారనీ, ఈ పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్‌లో సీరియస్‌గా ప్రతిఘటించాల్సి వస్తుందని పత్రికాముఖంగా హెచ్చరించారు. ఈ విషయాన్ని మీడియా కూడా పెద్దఎత్తున ప్రచారం చేయడంతో, పోలీసులు చేస్తున్న అరాచకాలను ఉద్యమ ప్రాంతానికి దూరంగా ఉన్న ప్రజలు కూడా అర్థం చేసుకోగలిగారు.

### పోలీసు ఇన్‌ఫార్మర్ దన్నును ఖతం చేసిన పి.ఎల్.జి.ఏ

మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, కొజ్జురుగూడ గ్రామానికి చెందిన దన్ను గత కొంతకాలంగా గ్రామంలో ఉన్న పెత్తందార్ల అండదండలతో ప్రజల మీద దాడులు చేస్తూ వచ్చాడు. ముఖ్యంగా గ్రామంలో పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న రైతుకూలీ సంఘానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే కొజ్జురుగూడ గ్రామానికి సమీపానగల దర్లబెడ గ్రామంలో పోలీసు క్యాంపు ఏర్పాటు కావడంతో ఇతడికి మరింత ధైర్యం వచ్చింది. అప్పటి నుంచి ప్రతిరోజు పోలీసు క్యాంపుకు వెళ్ళిరావడం కొనసాగేది. ఆ గ్రామ పరిసరాల్లో మనం పెట్టిన లాండ్‌మైన్స్ కూడా శత్రువుకు అప్పజెప్పాడు. ఆ గ్రామంలో ఉన్న కొద్దిమంది పెత్తందార్లతో కలిసి విందులు చేసుకోవడం, పోలీసుల ద్వారానే ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందనీ, మావోయిస్టు పార్టీ మా ప్రాంత ప్రజలకు అవసరం లేదనీ, ఇలా అనేక పద్ధతుల్లో పార్టీ, ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ వచ్చాడు. ఇతడు కొనసాగిస్తున్న ఈ తప్పుడు విధానాలపై గతంలో గ్రామంలో మీటింగ్ నిర్వహించి హెచ్చరించినప్పటికీ, కనీసమైన మార్పు రాకపోవడమే కాకుండా, తన ప్రజావ్యతిరేక కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేసాడు. ఈ క్రమంలోనే ఇతడి దగ్గర పోలీసులు ఇచ్చిన సెల్‌ఫోన్, సిమ్‌కార్డు ఉందని పార్టీకి తెలిసి అడిగితే సెల్‌ఫోన్, సిమ్‌కార్డులను పూర్తిగా నమిలివేసి పార్టీకి అప్పజెప్పాడు. దీంతో ఇతడికి సంబంధించిన అరాచకాలను కొజ్జురుగూడ పాకెట్ కమిటీ ముందు చర్చకు పెట్టడంతో, ప్రజలు ఇతడిని (అక్టోబర్ 2020) ఖతం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని పార్టీ ఆమోదించి అమలు చేసింది. ఈ సంఘటన చుట్టుపక్కల గ్రామాల్లో మంచి ప్రభావం వేసింది. అయితే ఈ సంఘటన తర్వాత పోలీసు అధికారులు మరింతగా అప్రమత్తమై గుర్రశెట్టి దగ్గర పోలీసు క్యాంపును ఏర్పాటు చేసారు.

### స్నైపర్ టెక్నిక్‌ను ఉపయోగించి బి.ఎస్.ఎఫ్ పోలీసును సీరియస్‌గా గాయపర్చిన పి.ఎల్.జి.ఏ యాక్షన్ టీం

శత్రువును నిర్మూలించే లక్ష్యంతో మన పి.ఎల్.జి.ఏ ప్రతిఘటనా కార్యక్రమాన్ని కొనసాగించింది. దీనిలో భాగంగా గుర్రశెట్టి చౌక్‌కు అందుబాటులో మైన్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రతిఘటనా కార్యక్రమంలో భాగమైన ఒక ద్రోహి నుండే శత్రువుకు సమాచారం వెళ్ళి, మైన్స్‌ను తొలగించడం కోసం పోలీసు బలగాలు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కేంద్రీకరించాయి. ఈ విషయం అర్థం అయిన తర్వాత అక్కడ నుండి పి.ఎల్.జి.ఏ బలగాలు రిట్రీట్ అయ్యాయి. అయితే ఆంబూష్ ప్రయత్నం విఫలం కావడంతో స్నైపర్ టెక్నిక్‌ను ఉపయోగించి శత్రువును దెబ్బతీయాలనుకోవడం జరిగింది. ఈ పథకంలో భాగంగా (డిసెంబర్ 2020) పి.ఎల్.జి.ఏ నుంచి ఇరువురు స్నైపర్‌లు, మిలీషియా సహకారంతో శత్రువుకు సమీపం వరకు వెళ్ళి ఫైరింగ్ చేసారు. ఈ సందర్భంగా ఒక బి.ఎస్.ఎఫ్ పోలీసు సీరియస్‌గా గాయపడటంతో, పోలీసులు తీవ్రమైన గందరగోళానికి గురైనారు. అప్పటికే చీకటి పడటంతో రాత్రి మొత్తం నిద్రలేకుండా గడిపి, తెల్లవారి 6 గం॥లకు మనం ఏర్పాటు చేసిన మైన్స్‌ను కొన్ని మాత్రమే బయటకు తీసి వాటిని పేల్చివేసి వెళ్ళిపోయారు. అదేరాత్రి మన పి.ఎల్.జి.ఏ కామ్రేడ్స్ మైన్స్ ఏర్పాటు చేసిన స్థలానికి పోయి వాటిని వెలికితీసి పట్టుకున్నారు. ఈ ఘటన చిన్నదే అయినప్పటికీ, ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

## డకడపాదర్ గ్రామ ప్రజల ప్రతిఘటనతో తోక ముడిచిన పోలీసులు

మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, దకడపొదర్ గ్రామంపై పోలీసులు దాడి చేసి, గ్రామంలో పార్టీ, పీ.ఎల్.జీ.ఏలకు సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేసారు. ఈ దాడిలో ఉద్యమం నుంచి దిగజారి ద్రోహులుగా మారిన రఘు, జీప్రో, దేవాల్‌లు ముఖ్యమైన పాత్రను పోషిస్తూ, ఇళ్ళలోకి దూరే ప్రయత్నం చేసారు. దీంతో ప్రజలు అప్పటికప్పుడు అప్రమత్తమై పోలీసులను ప్రతిఘటించేందుకు అందుబాటులో ఉన్న సాంప్రదాయక ఆయుధాలను (గొడ్డలి, కత్తి, కర్ర మొదలమైనవి) పట్టుకొన్ని ధైర్యంగా పోలీసుల, దిగజారిన ద్రోహుల ప్రయత్నాన్ని తిప్పికొట్టారు. ఈ సందర్భంగా పోలీసులకూ, ప్రజలకు మధ్య సీరియస్ గొడవ జరిగింది. పోలీసులకు రూట్ గైడ్స్‌గా ఉపయోగపడుతున్న మాజీలను కూడా ప్రజలు సీరియస్‌గా తిట్టారు. ప్రజల ప్రతిఘటనను చూసిన పోలీసులు తమ కార్యక్రమాన్ని ఆపుకొని తోకముడిచి వెళ్ళిపోయారు. ప్రజల ప్రతిఘటన ముందు ఎంత బలమైన శత్రువైనా ఓడిపోక తప్పదని ఈ సంఘటన రుజువు చేసింది.

## పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు

✶ మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్ పరిధిలో సింగోయి గ్రామం దగ్గర ఆగస్టు, 2020లో సుమారు 3 వేలమంది ప్రజలు హాజరై భారీ భహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో దర్లబెడ, జొడంబా గ్రామాలలో కొత్తగా బీ.ఎస్.ఎఫ్ క్యాంపులను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వక్తలు, పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేసారు. ముఖ్యంగా ప్రజలు స్వేచ్ఛగా అడవిలోకి వెళ్ళి తమ పనులను చేసుకోలేకపోతున్నారని తమ అవేదనను వ్యక్తం చేసారు. ఈ సభ ముగింపులో పోలీసు క్యాంపులను ఎత్తివేసేదాక తమ పోరాటాన్ని కొనసాగించాలని దృఢంగా నిర్ణయించుకున్నారు.

✶ మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, కటాఫ్ ఏరియాలో మార్చి 2021లో అనారోగ్యానికి గురైన ఒక వ్యక్తిని పడవలో హాస్పత్రికి తీసుకువెలుతుండగా, పిప్పలపొదర్ క్యాంపు పోలీసులు వారిపై ఫైరింగ్ చేసారు. దీంతో ఆగ్రహించిన ఆ ప్రాంత ప్రజలు 15, మార్చి, 2021లో ఒక నిరసన సభను నిర్వహించారు. ఈ సభకు ఒంగురుగూడ, బొడ అమిలిబెడ, చిన్న అమిలిబెడ, టిక్రపాడు, జొల్లగూడ, నారింజోల, కొజ్జరిగూడ తదితర గ్రామాల నుండి కనీసం రెండు వేలమంది ప్రజలు హాజరైనారు. ఈ సభానంతరం ప్రజలు పెద్ద ఎత్తున కదిలి చిత్రకొండ బ్లాక్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం కొనసాగించారు.

ఈ సభలలో, ధర్నాలలో ప్రజలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు. ముఖ్యంగా ప్రభుత్వాలు ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోకుండా అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకూ, స్థానిక పెత్తందార్లకు ప్రయోజనకరంగా ఉండేందుకు పోలీసు క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమాలు విడివిడి(స్పొరాడిక్)గా ఉంటున్నాయి. వీటిని ఒక సమైఖ్య, సమరశీల, దీర్ఘకాలిక, రాజకీయ ఉద్యమంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

## రేషన్ సమస్యను పరిష్కారించుకున్న కొసంపూట్ పాకెట్ విప్లవ ప్రజానీకం

ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ప్రచారంలో డొల్లతనాన్ని కొనంపుట్ పాకెట్ ప్రజలు బహిర్గతపరిచారు. ముఖ్యంగా రంగబయలు పంచాయితీలో ఉన్న జోడిగుమ్మ, పడాల్‌పుట్, మఠంపుట్, బొడపనస, నవగూడ, మట్టిగూడ, రంగబయలు, చంపాపుట్, జల్లాయిపొదర్, కొట్లగూడ, దానబందు, లొంగపొదర్, మాలిపొదర్ గ్రామాల ప్రజలు రేషన్ తెచ్చుకొనేందుకు మైళ్ళదూరం ప్రయాణం చేయాల్సి వస్తున్నది. వీరు కొండలు, గుట్టలు దాటుకుంటూ అడవి మార్గానా 1, 2 రోజులు కాలినడకన ప్రయాణం చేయాల్సి వస్తున్నది. కొన్ని సందర్భాల్లో ప్రజలు రేషన్ ఇచ్చే ప్రాంతానికి వెళ్ళినప్పటికీ, డీలర్ అందుబాటులో లేడనే సాకు చూపి, రేషన్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారు. దీంతో వాలెంటీర్ల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్నామనే ప్రభుత్వ ప్రచారం ఉత్త బూటకమని ఇక్కడి పరిస్థితి తెలియజేస్తున్నది. ఈ విషయంపై ప్రజలు స్థానిక సర్పంచ్‌కు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా, సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో కొసంపుట్ ఏ.ఆర్.సీ.ఎస్ నాయకత్వంలో సుమారు 500 మంది ప్రజలు పంచాయితీ హెడ్‌క్వార్టర్ రంగబయలు గ్రామం దగ్గర సమావేశమై రేషన్ సమస్యను లోతుగా చర్చించారు. ఈ సమావేశానికి స్థానిక సర్పంచ్‌తోపాటు, పంచాయితీ సెక్రటరీ, డీలర్‌ను కూడా పిలిచి సీరియస్‌గా హెచ్చరించారు. నెల రోజుల్లో ఈ సమస్యను పరిష్కారించాలని షరతు పెట్టారు. ప్రజలు పెట్టిన షరతులకు అనుగుణంగా 2020 డిసెంబర్ నెల నుండి రంగబయలు గ్రామం దగ్గరే రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. ఈ సమస్య పరిష్కారం కావడంతో, ప్రజలు సంఘనాయకత్వంలో ఇంకా అనేక సమస్యలు పరిష్కారించుకోవడానికి సిద్ధపడుతున్నారు.

# జూలై 28 నుండి ఆగష్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని వివిధ పాకెట్స్‌లో ఘనంగా నిర్వహించిన విప్లవ ప్రజానీకం

ఎమ్.కే.బీ డివిజన్ కమిటీ పిలుపు మేరకు గుమ్మ ఏరియా పరిధిలో అమరుల సంస్మరణ వారాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముకుడుపల్లి పాకెట్ పరిధిలో గుర్రశెట్టి దగ్గర గతంలో నిర్మించిన స్మారక స్థూపాన్ని పోలీసులు కూల్చివేయడంతో, మరల ప్రజలు అదే స్థలంలో కొత్తగా స్మారక స్థూపాన్ని నిర్మించారు. ఏ.ఆర్.సీ.ఎస్ నాయకత్వంలో ప్రతిరోజు ప్రజలు అన్ని గ్రామాల నుండి తరలివచ్చి వారం రోజుల్లో కొత్త స్థూపాన్ని నిర్మించారు. స్థూప నిర్మాణ సందర్భంగా ప్రజలను పోలీసులు ఎన్నో రకాలుగా బెదిరించినప్పటికీ, వాటిని కాతరు చెయ్యకుండా నిర్మాణం చేపట్టి, జూలై 28 నాడు స్థూప ఆవిష్కరణతో పాటు, బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు సుమారు 300 మంది ప్రజలు హాజరైనారు. ఈ సందర్భంగా రామగూడ అమరులతోపాటు కామ్రేడ్ మీనా, కామ్రేడ్ రాకేష్, కామ్రేడ్ అడ్మా, కొండజర్త, చందురుపల్లి అమరులను స్మరించుకున్నారు. అమరుల ఆశయాలను కొనసాగించడంలో భాగంగా తమ ప్రాంతంలో ప్రజా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అంద్రపల్లి పాకెట్‌లో ఆర్.పీ.సీ నాయకత్వాన అమరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సుమారు 400 మంది ప్రజలు హాజరై, తమ కోసం ప్రాణాలిచ్చిన అమరులను పేరుపేరున స్మరించుకున్నారు. కామ్రేడ్ మీనా, కామ్రేడ్ రాకేష్, కామ్రేడ్ అడ్మాల్‌లతో తమకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న పార్టీ కార్యకర్తలను గ్రామాలలోని పెత్తందారులు, వారి గూండాలు, పోలీసులు హత్య గావించడాన్ని తీవ్రంగా నిరసించారు. అంతేకాదు, ఈ విప్లవ ప్రతీఘాతుక శక్తులను ప్రతిఘటిస్తూ పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏను కంటికి రెప్పలా కాపాడుకోవాలని శపథం చేసారు.

జొంత్రి ఆర్.పీ.సీ పరిధిలో తోటగూడ అమరుల స్మారక భవనం దగ్గర సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జొంత్రి, తోటగూడ, దకడపాదర్, డాబగూడ, సన్యాసిగూడ, చదరం గ్రామాల నుండి సుమారు 300 మంది ప్రజలు పాల్గొని అమరులకు ఘనంగా నివాళి అర్పించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామని శపథం చేసారు.

తాబేరు పాకెట్‌లో నడిమింజరి గ్రామం దగ్గర అమరుల సంస్మరణ సభను ప్రజలు నిర్వహించారు. ఈ సమావేశానికి నడిమింజరి, కొండంజరి, తాబేరు, కోడిగొంది, అర్లింగ్‌పడ గ్రామాల నుండి సుమారు 200 మంది ప్రజలు హాజరైనారు. ముఖ్యంగా ఆ పాకెట్ ప్రజలు అమరుడు కామ్రేడ్ అడ్మాల్‌తో తమకున్న బంధాన్ని గుర్తుచేసుకున్నారు. అడ్మాల్ ప్రజలతో కలిసిపోయే తీరునూ, ప్రజా శత్రువుల పట్ల ప్రదర్శించే వర్గ కసిని నేర్చుకోవాలని మాట్లాడారు. కామ్రేడ్ అడ్మాల్‌ను హత్య చేసిన విప్లవ ద్రోహులను ఎన్నటికి వదిలిపెట్టవద్దని ప్రతినబూనారు.

కొసంపుట్, కాలిగూడ పాకెట్స్‌లో ఉన్న సిందుగూడ, ఒండెపాదర్, కాలిగూడ, పాత్రపుట్, బొజ్జగూడ, పడాల్‌పుట్, మరంపుట్, జోడిగుమ్మ, మట్టిగూడ, రంగబయలు గ్రామాల నుండి సుమారు 500 మంది ప్రజలు జమై కొసంపుట్ గ్రామం దగ్గర అమరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు రెండు పాకెట్స్‌కు సంబంధించిన ఏ.ఆర్.సీ.ఎస్ కామ్రేడ్స్ నాయకత్వం వహించారు. రాంగూడ అమరులతో పాటు, తమకు పరిచయమున్న కామ్రేడ్ మీనా, కామ్రేడ్ రాకేష్, కామ్రేడ్ అడ్మాల్‌లను స్మరించుకుంటూ వాళ్ళ ఆదర్శాలను గుర్తుచేసుకున్నారు. ప్రజల పట్ల వారికున్న అంకిత భావాన్నీ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వాళ్ళు చూపిన చొరవనూ, శత్రు వర్గాల పట్ల ప్రదర్శించే వర్గకసిని గుర్తుచేసుకున్నారు. అమరుల ఆశయాలను కొనసాగించడంలో భాగంగా, శక్తిమేరకు శత్రువును ప్రతిఘటిస్తూ వర్గ పోరాటాన్ని కొనసాగించాలనీ, అంతిమంగా అమరులు కన్న కలలను నెరవేర్చాలని శపథం చేసారు. ఈ సభ సందర్భంగా ప్రజా సంఘాల కామ్రేడ్స్ మాట్లాడిన విషయాలు, ప్రజలు మరింత చైతన్యవంతులు కావడానికి ఉపయోగపడ్డాయి.

అమిలిబెడ పాకెట్‌లో ఒంగుర్‌గూడ, చిన్న అమిలిబెడ, బొడ అమిలిబెడ, టిక్రపాడు, జొల్లగూడ, నారింజోల, కొజ్జురుగూడ గ్రామాల నుండి సుమారు 250 మంది ప్రజల సమావేశమై అమరుల సంస్మరణ దినాన్ని జరుపుకున్నారు.

ఈ సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని ప్రజలు ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం గావించారు. తోటగూడ మెట్టపైన అన్ని గ్రామాలకు కనిపించే విధంగా పెద్ద జెండాను ఎగురవేసారు. శత్రువు అమరుల సంస్మరణ వారాన్ని అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, ప్రజలు సంఘటితంగా, సమరశీలంగా అన్ని ప్రాంతాలలోను అమరుల సంస్మరణ సభలను విజయవంతం చేసారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించిన కటాఫ్ ఏరియా విప్లవ ప్రజానీకం

ఎమ్.కే.బి డివిజన్ కమిటీ పిలుపులో భాగంగా గుమ్మ ఏరియాలో ప్రజలు, పార్టీ 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ, ఆర్.పీ.సీలు, ప్రజా నిర్మాణాలు, మిలీషియా చురుగ్గా పాల్గొన్నాయి. ఈ వార్షికోత్సవాలలో జొంత్రి పాకెట్‌లో 200 మంది, తాబేరు పాకెట్‌లో 360 మంది, కొసంపుట్, కాలిగూడ పాకెట్స్‌లో 500 మంది, అమిలిబెడ పాకెట్‌లో 150 మంది వరకు ప్రజలు పాల్గొన్నారు. ఈ సభల సందర్భంగా పార్టీ నేతృత్వంలో జరిగిన వర్గపోరాటాన్ని తత్ఫలితంగా తాము సాధించుకున్న భూమినీ, అధికారాన్నీ, తదితర విషయాలను వక్తలు ప్రస్తావించారు. అయితే ఈ విజయాలను నిలబెట్టుకునేందుకూ, వాటిని మరింతగా పురోగమింపజేసేందుకు ప్రజా శత్రువులైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాయుధవర్గ పోరాటాన్ని కొనసాగించాలనీ, అందుకు పార్టీలోకీ, పీ.ఎల్.జీ.ఏలోకి ప్రజలు విస్తృతంగా సమీకరించబడాలని పిలుపునిచ్చారు.

## తీవ్రమైన శత్రువుదాడి మధ్యనే పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్న కటాఫ్ ఏరియా విప్లవ ప్రజలు

అక్టోబర్, 2020 నుంచి కటాఫ్ ఏరియాలో ప్రభుత్వ దాడి తీవ్రతలో చాలా మార్పులు వచ్చాయి. కొత్త క్యాంపుల నిర్మాణాలు ఊపందుకోవడం, ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర పోలీసు బలగాలు సమన్వయంతో నిరంతరం ఏరియా వ్యాప్తంగా కూబింగ్స్ నిర్వహిస్తుండటం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, ఆస్తుల విధ్వంసం తదితర రూపాలలో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ, ప్రజలు ఆ దాడుల మధ్యనే దొరికిన సమయాన్ని వినియోగించుకొని కొసంపుట్, కాలిగూడ, జొంత్రి పాకెట్స్‌లో పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

కొసంపూట్, కాలిగూడ పాకెట్స్ ప్రజలు సుమారు 2వేల మంది కొసంపూట్ గ్రామ సమీపంలో పీ.ఎల్.జీ.ఏ 20వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సభలో నూతనంగా ఏర్పడిన స్థానిక గొనొ నాట్య సంఘ్ (జీ.యన్.ఎస్) నేతృత్వంలో కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. శత్రువు కొనసాగిస్తున్న తీవ్రమైన నిర్బంధం మధ్యనే ఈ మీటింగ్ విజయవంతం కావడంతో, ఇది శత్రు వర్గాల్లో కలవరం పుట్టించగా, స్థానిక పీడిత ప్రజల్లో మనోధైర్యాన్ని కల్పించింది.

డిసెంబర్ 5వ తేదీన దకడపొదర్ గ్రామంలో పీ.ఎల్.జీ.ఏ ద్విదశాబ్ద ఉత్సవాలు అత్యంత ఉత్సాహపూరితంగా జరిపారు. సుమారు 500 మంది ప్రజలు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూడా జీ.ఎన్.ఎస్ కామ్రేడ్స్ అమరులకు సంబంధించిన పాటలతో పాటు, వివిధ సమస్యలపైన రాసిన విప్లవ పాటలు పాడి తమ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ రెండు మహాసభలు కూడ శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతుక దాడి 'సమాధాన్' మధ్యనే జరగడంతో ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేయగలిగాయి.





# కరోనా సమయం (మార్చి - మే 2021)లో సైతం పార్టీ, ప్రజాసంఘాల నాయకత్వంలో వివిధ సమస్యలు పరిష్కారించుకుంటున్న కటాఫ్ ఏరియా విప్లవ ప్రజానీకం



ప్రజల ఆరోగ్య సమస్యలపై కనీసమైన దృష్టి సారించని ఈ దోపిడీ పాలక వర్గాలపై ఆధారపడకుండా ప్రజలు, పార్టీ నాయకత్వంలో సంఘటితమై లక్షలాది రూపాయాల విలువ చేసే మందులను ప్రజా దాక్టర్ల సమక్షంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి పంపిణీ చేసారు. ముందుగా ఏరియాలో చదువుకుంటున్న కొంత మంది యువతను సమీకరించి, రెండు రోజుల మెడికల్ ట్రెనింగ్ క్యాంపును నిర్వహించారు. వాళ్ళను మూడు గ్రూపులుగా విభజించి ఏరియా వ్యాప్తంగా ప్రజలకు మందులు అందజేసారు. ముఖ్యంగా మలేరియా, సీజనల్‌గా వచ్చే ఇతర అనారోగ్య సమస్యలపై దృష్టి పెట్టి, వాటికి సంబంధించిన మందులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం సందర్భంగా పార్టీ నేతృత్వంలో ప్రచార దళాలు గ్రామాలను శుభ్రపర్చుకోవడం అవసరమనీ, వేడి నీటిని తాగడం ద్వారా జబ్బులు కొంత మేరకు నివారించుకోవచ్చునని ప్రచారం చేసాయి. ఈ సేవా కార్యక్రమాలతో పాటు, దోపిడీ ప్రభుత్వం ప్రజల పట్ల కొనసాగిస్తున్న నిర్లక్ష్యపూరిత వైఖరిని ఎండగట్టే విధంగా ప్రచారం చేసాయి. ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. పార్టీ పట్ల మరింత విశ్వాసం పెరిగే విధంగా దోహదపడింది.

కరోనా సమయంలో ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్ళి తమ నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొసంపూట్, కాలిగూడ పాకెట్స్‌లో ఉన్న ప్రజలు ఎటువైపు పోవాలన్న గంటల తరబడి నడుచుకుంటూ పోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ రెండు పాకెట్స్‌లో ఉన్న అనేక గ్రామాల ప్రజలు అందుబాటులో సంత నిర్వహిస్తే బాగుంటుందని పార్టీ ముందు తమ ప్రతిపాదనను తెలియజేసారు. పార్టీ కూడ వాళ్ళ ప్రతిపాదనను అంగీకరిస్తూనే కొసంపుట్ గ్రామంలో సంత నిర్మాణం జరిగే విధంగా సంబంధిత వ్యక్తులతో మాట్లాడి అమలు చేసింది. సంత సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు తమకు కావాల్సిన తిండి సరుకులను స్థానికంగానే సమకూర్చుకుంటున్నారు. ❀

---

46వ పేజీ తరువాయి భాగం...

పెంచుకున్నాడు. శతృవు పరిసర ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు బూబిట్రాప్, మైన్స్‌తో చిన్న టీంలు ఎంగేజ్ అవుతుండేవి. ఇలా ఎంగేజ్ అయిన మెజారిటీ టీంలలో తాను భాగమయ్యేవాడు. పార్టీ పనులరీత్యా కొన్ని సందర్భాలలో మిలీషియాతో ఉండాలన్నప్పుడు వారితోనే గడుపుతూ, పార్టీ రాజకీయాలను వారికి అందిస్తూ, మిలీషియా నిర్వహించే పనులలో, మిలటరీ చర్యలలో పాలుపంచుకునేవాడు.

సహజసిద్ధంగా ఆదివాసీ ప్రజలలో ఉండే కల్మషంలేని నవ్వు కామ్రేడ్ దయలో కనిపించేది. తెలివితేటలు ఉన్నప్పటికీ, ఆ ముఃఖంలో తెలియని అమాయకత్వం ఉండేది. తాను చదివింది 7వ తరగతే అయినా, తను రాసే గుండ్రటి అక్షరాలు మాత్రం ఇట్టే కామ్రేడ్స్‌అందరిని ఆకట్టుకునేవి. సహచర కామ్రేడ్స్‌తో స్నేహంగా మెలగడమే తప్పా, కోప్పడటం తెలియని వ్యక్తి. అసహనం, కోపం కామ్రేడ్ దయలోలేని లక్షణాలు. బరువులు మోయడం మాములు సమయాల్లోనే కాకుండా జ్వరం వచ్చినప్పుడు కూడా ఏ మాత్రం తగ్గేవాడు కాదు. "నేను ప్రజలకోసం గొడ్డులా పని చేస్తాను" అన్న కామ్రేడ్ మావో మాట దయకు చక్కగా వర్తిస్తుంది.

కామ్రేడ్ దయ పనిచేస్తున్న పెదబయలు ప్రాంతంలో కూడా రాజ్యనిర్బంధం తీవ్రతరమవుతూ వచ్చింది. శతృవు అనేక కుట్రపూరిత పథకాలను రచిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే శతృవు జీ.పీ.ఎస్ ట్రాకర్స్ అమర్చిన రెండు వాకీటాకీలను ఒక సానుభూతిపరుడి ద్వారా పెదబయలు దళానికి పంపాడు. ఈ సానుభూతిపరుడు అంతకు ముందే శతృవుకు లొంగిపోయాడు. ఈ విషయం దళానికి తెలియదు. దీంతో ట్రాకర్స్ ఉన్న వాకీలను చార్జీ చేస్తూ ఉండటంతో జులై 2020లో పది రోజుల్లోనే శతృవుతో మూడుసార్లు ఎన్‌కౌంటర్లు జరిగాయి. చివరిసారి జులై 25 (2020)న శతృవు దళాన్ని గుర్తించి వెంటాడుతూ వస్తున్న క్రమంలో గజ్జేడు అటవీ ప్రాంతంలో సాయంత్రం 6గం॥లకు శతృవుతో ఫైరింగ్ జరిగింది. ఈ సందర్భంగా మన కామ్రేడ్స్ ముందుగా రాపిడ్ ఫైర్ చేసి, శతృవును గాబరాకు గురి చేసారు. కానీ ఫ్లాంక్‌లో పోలీసు బ్యాచ్ చేసిన ఫైరింగ్‌లో కామ్రేడ్ దయ తలకు తూట తగలడంతో అక్కడికక్కడే అమరుడయ్యాడు.

27వ తేదీన కామ్రేడ్ దయ అంత్యక్రియలు స్వగ్రామమైన వాకపల్లిలో వందల మంది విప్లవ ప్రజానీకం మధ్య ఘనంగా జరిగాయి. కామ్రేడ్ దయ అల్లూరి వారసత్వాన్ని పునికిపుచ్చుకొని, మన్యం పితూరీసేనలోనూ, పీ.ఎల్.జీ.ఏ లోను ఒక బాధ్యత కలిగిన, క్రమశిక్షణతో కూడిన కార్మికవర్గ యోధుడిగా, ప్రజల ప్రేమ పాత్రుడిగా నిర్వహించిన పాత్రను అక్కడి ప్రజలు అంతిమయాత్రలో తలుచుకుంటూ సగర్వంగా నివాళులర్పించారు. ❀

# ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం



పార్టీ, పీ.ఎల్‌జీ.ఏ జెండాలతో ర్యాలీ చేస్తూ



అరుణపతాకానికి రెడ్ సెల్యూట్ చేస్తూ



కవాత్తు చేస్తూ